# 2012 మార్చితో ముగిసిన సంవత్సరానికి

# రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై

# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక




## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

నివేదిక సంఖ్య-1

# 2012 మార్చితో ముగిసిన సంవత్సరానికి

# రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై

# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

## నివేదిక సంఖ్య 1

# విషయసూచిక


| | పేరా | పేజీ |
|---|---|---|
| *ముందుమాట* | | v |
| *కార్య సంగ్రహం* | | vii |
| **అధ్యాయం -1 రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు** | | |
| పరిచయం | 1.1 | 1 |
| ప్రస్తుత సంవత్సరపు ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరణ | 1.2 | 1 |
| బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు | 1.3 | 3 |
| ద్రవ్య సంస్కరణల పథం | 1.4 | 3 |
| రాష్ట్ర వనరులు | 1.5 | 4 |
| రెవెన్యూ రాబడులు | 1.6 | 4 |
| వనరుల వినియోగం | 1.7 | 8 |
| ఖర్చుల నాణ్యత | 1.8 | 14 |
| ప్రభుత్వం చేసిన ఖర్చులు, పెట్టుబడులపై ఆర్థిక విశ్లేషణ | 1.9 | 17 |
| ఆస్తులు - అప్పులు | 1.10 | 21 |
| ఋణాలను భరించే సామర్థ్యం | 1.11 | 23 |
| ద్రవ్య అసమతుల్యతలు | 1.12 | 25 |
| సారాంశం | 1.13 | 28 |
| **అధ్యాయం - 2 ఆర్థిక నిర్వహణ - బడ్జెట్‌పరమైన నియంత్రణ** | | |
| పరిచయం | 2.1 | 29 |
| బడ్జెట్ విషయంలో పారదర్శకత | 2.2 | 29 |
| ఆర్థికపరమైన జవాబుదారీతనం, బడ్జెట్ నిర్వహణ | 2.3 | 29 |
| వినిమయ పద్దుల సంగ్రహం | 2.4 | 30 |
| ప్రధానమైన విధాన నిర్ణయాలు | 2.5 | 40 |
| ఆకస్మిక ఖర్చుల నిధి నుండి అడ్వాన్సులు | 2.6 | 42 |
| బడ్జెట్ ప్రక్రియలో లోపాలు | 2.7 | 43 |
| సారాంశం | 2.8 | 44 |

| | పేరా | పేజీ |
|---|---|---|
| **అధ్యాయం - 3 ఆర్థిక విషయాల నివేదన** | | |
| పరిచయం | 3.1 | 45 |
| వినియోగ ధృవపత్రాలు | 3.2 | 45 |
| స్వయంపాలక సంస్థల పద్దులు/ఆడిట్ నివేదికల సమర్పణ | 3.3 | 45 |
| రీకన్సిలియేషన్ చేయని ఖర్చులు, రాబడులు | 3.4 | 46 |
| ఖజానాల పనితీరు | 3.5 | 46 |
| నిధుల అక్రమ పార్కింగ్ | 3.6 | 46 |
| వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలు | 3.7 | 47 |
| నిధులను ప్రభుత్వ ఖాతా వెలుపల ఉంచడం | 3.8 | 50 |
| వివరణాత్మక కంటింజెంట్ బిల్లుల బకాయిలు | 3.9 | 50 |
| సస్పెన్స్ పద్దు (ప్రధాన పద్దు 8658) కింద నిల్వవున్న మిగులు మొత్తాలు | 3.10 | 51 |
| ఓమ్నిబస్ - చిన్న పద్దు 800 నిర్వహణ | 3.11 | 54 |
| భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాలను (ఐ.జి.ఏ.ఎస్.) అమలుచేయటం | 3.12 | 54 |
| సారాంశం | 3.13 | 55 |

# అనుబంధాలు



| | | పేరా | పేజీ |
|---|---|---|---|
| 1.1 | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వరూప చిత్రణ | | 57 |
| 1.2 | ప్రభుత్వ పద్దుల రూపకల్పన - ఆర్థిక పద్దుల స్వరూపం | 1.1 | 59 |
| 1.3 | 2011-12 సంవత్సరానికి సంక్షిప్తంగా వసూళ్లు, చెల్లింపులు | 1.2 | 60 |
| 1.4 | 2011-12 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు | 1.3 | 63 |
| 1.5 | ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టం - 2005 | 1.4 | 64 |
| 1.6 | రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై సమయానుగత సమాచారం | 1.6 &1.10.2 | 65 |
| 1.7 | రాష్ట్రంలోని నిర్వాహక సంస్థలకు నేరుగా అందిన నిధుల వివరాలు | 1.6.4 | 68 |
| 1.8 | అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల వివరాలు | 1.9.1 | 70 |
| 1.9 | 2012 మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక స్థితి సంగ్రహ రూపం | 1.10.1 | 73 |
| 2.1 | మొత్తం కేటాయింపులో 20 శాతంకన్నా అధికంగానూ, ₹100 కోట్ల కన్నా ఎక్కువగానూ నిధులు మిగిలిపోయిన వివిధ గ్రాంట్లు/అప్రోప్రియేషన్ల వివరాలు | 2.4.1 | 75 |
| 2.2 | గత సంవత్సరాలలో కేటాయింపులకు మించి చేసి, ఇంకా క్రమబద్ధీకరించాల్సిన ఖర్చు | 2.4.5 | 76 |
| 2.3 | కోటి రూపాయలు, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని అదనంగా కేటాయించిన చోట్ల ఈ కేటాయింపు అనవసరమని తేలిన సందర్భాల వివరాలు | 2.4.6 | 77 |
| 2.4 | అనవసరంగా నిధులను పునఃకేటాయించిన సందర్భాలు (ఒక్కో కేసులోనూ ₹10 కోట్లను మించి) | 2.4.7 | 79 |
| 2.5 | ఈ ఆర్థిక సంవత్సరంలో పెద్ద మొత్తంలో సరెండర్ చేసిన నిధుల వివరాలు | 2.4.9 | 83 |
| 2.6 | వాస్తవ మిగుళ్లు/అదనం కంటే ఎక్కువగా సరెండర్ చేసిన మొత్తాల వివరాలు (ప్రతి కేసులోనూ ₹50 లక్షలు లేదా అంతకు మించి) | 2.4.11 | 85 |
| 2.7 | వివిధ గ్రాంట్లు/అప్రోప్రియేషన్లలో మిగుళ్లు ఏర్పడినా వాటిలో కొంత భాగం కూడా సరెండర్ చేయని సందర్భాలు | 2.4.12 | 86 |
| 2.8 | ₹5 కోట్లు లేదా అంతకన్నా ఎక్కువ మిగుళ్లను సరెండర్ చేయని సందర్భాలు | 2.4.12 | 87 |

| | | పేరా | పేజీ |
|---|---|---|---|
| 2.9 | 2012 మార్చి 30, 31 తేదీల్లో ₹10 కోట్ల కన్నా అధికంగా నిధులను సరెండర్ చేసిన కేసులు | 2.4.12 | 88 |
| 2.10 | సవరణ స్లిప్పులను అనుసరించకపోవడాన్ని చూపే పట్టిక | 2.7.1 | 91 |
| 2.11 | రెవెన్యూ విభాగంలో నమోదు చేసిన వివరణాత్మక పద్దు 530 - భారీ పనులు | 2.7.7 | 92 |
| 2.12 | క్యాపిటల్ విభాగంలో నమోదు చేసిన వివరణాత్మక పద్దు 270 - మైనరు పనులు | 2.7.8 | 92 |
| 2.13 | క్యాపిటల్ విభాగంలో నమోదైన వివరణాత్మక పద్దు 310 - సహాయక గ్రాంట్లు | 2.7.8 | 93 |
| 3.1 | 2012 మార్చి 31 నాటికి పెండింగులో ఉన్న వినియోగ ధృవపత్రాల వివరాలు సంవత్సరాలవారీగా | 3.2 | 94 |
| 3.2 | స్వయంపాలక సంస్థల పద్దుల సమర్పణ, వాటి ఆడిట్ | 3.3 | 95 |
| 3.3 | పద్దులు సమర్పించని సంస్థల వివరాలు | 3.3 | 97 |
| 3.4 | రికన్సిలియేషన్ చేయని ఖర్చులు (₹500 కోట్లు, అంతకు మించిన కేసులు మాత్రమే) | 3.4 | 100 |
| 3.5 | పింఛను/కుటుంబ పింఛనుల అధిక చెల్లింపులు | 3.5 | 101 |
| 3.6 | రాబడులు, ఖర్చుల అంకెలలో వ్యత్యాసాలు | 3.7 | 101 |
| 3.7 | 2011-12 సంవత్సరాంతానికి, శాఖలవారీగా పెండింగులో ఉన్న డి.సి. బిల్లులు | 3.9 | 102 |
| 4.1 | పారిభాషిక పదాలకు వివరణ | -- | 103 |
| 4.2 | సంక్షిప్త నామాలు, పొడి అక్షరాల వివరణ | -- | 106 |

# ముందుమాట

భారత రాజ్యాంగంలోని 151 వ అధికరణాన్ని అనుసరించి గవర్నర్‌కు సమర్పించే నిమిత్తం ఈ నివేదికను రూపొందించడమైంది.

2012 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పద్దులను (ఫైనాన్స్ అకౌంట్స్), వినిమయ పద్దులను (అప్రోప్రియేషన్ అకౌంట్స్) ఆడిట్‌లో పరిశీలించగా వెల్లడైన విషయాలు ఈ నివేదికలోని 1, 2 అధ్యాయాలలో ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆర్థిక నియమాలను, పద్ధతులను, నిర్దేశాలను పాటించడంపై స్థూల పరిశీలనలు, ప్రస్తుత పరిస్థితి అధ్యాయం 3 - 'ఆర్థిక విషయాల నివేదన' లో ఉన్నాయి.

వివిధ శాఖలకు సంబంధించిన పనితీరు, లావాదేవీల తనిఖీల్లో వెల్లడైన అంశాలు, చట్టబద్ధమైన సంస్థలు (స్టాట్యూటరీ కార్పోరేషన్లు), బోర్డులు, ప్రభుత్వ కంపెనీల తనిఖీల్లోని పరిశీలనలు, రెవెన్యూ వసూళ్ల మీద పరిశీలనలు గల నివేదికలను విడిగా సమర్పించడం జరుగుతుంది.

ఈ తెలుగు నివేదికలో ఏవైనా సందేహాలుంటే అనువాదానికి మూలాధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.

# కార్య సంగ్రహం

## 1 నేపథ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005 అక్టోబరులో 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టాన్ని' చేసింది. మధ్యకాలికంగా ద్రవ్య దిద్దుబాటు పథాన్ని అనుసరించడం ద్వారా దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటులో స్థిరత్వాన్ని సాధించాలన్న లక్ష్యంతో ఈ చట్టం సంస్కరణలను నిర్దేశించింది. ఈ సంస్కరణలను కొనసాగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత తదనంతర బడ్జెట్లలో ప్రకటించిన విధానాలలో ప్రస్ఫుటమయ్యింది. లోటును సూచించే ముఖ్యమైన కొలమానాలలో తగ్గుదల రూపేణా ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రయోజనాలు ఇప్పటికే సిద్ధించినా, విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను అమలు చేయడం, కొత్త పింఛను పథకాన్ని ప్రవేశపెట్టడం, ప్రభుత్వం ఇచ్చే పూచీకత్తుల మీద పరిమితులను విధించడంతోపాటు అనేక ఇతర సంస్థాపరమైన, వివిధ రంగాలకు సంబంధించిన సంస్కరణలు ప్రభుత్వ వ్యయంలోని నాణ్యతను మెరుగుపరచడానికీ, ద్రవ్య స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికీ కావలసిన 'ద్రవ్య వెసులుబాటు' ను చేరుకునేందుకు ఉపయోగపడాల్సి ఉంది.

## 2 ఈ నివేదిక గురించి...

2012 మార్చితో ముగిసిన సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించి ఆడిట్ అయిన పద్దుల ఆధారంగా, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై విశ్లేషణాత్మక సమీక్షను ఈ నివేదిక అందిస్తుంది. ఈ నివేదికను మూడు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

**మొదటి అధ్యాయాన్ని** ఆర్థిక పద్దుల ఆడిట్ ఆధారంగా రూపొందించడమైంది. ఈ అధ్యాయంలో 2012 మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులను మదింపు చేయడమైంది. రాష్ట్ర ప్రభుత్వ వనరులు, వాటి వినియోగం, అభివృద్ధి వ్యయం, అప్పుల సరళి, ఋణాలను భరించే సామర్థ్యంకు సంబంధించిన ధోరణులను ఆమూలాగ్రం వివరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుండి వచ్చిన నిధుల గురించీ, రాష్ట్రంలో వివిధ పథకాలను అమలు చేస్తున్న సంస్థలకు బడ్జెటేతర మార్గంలో నేరుగా బదిలీ అయిన కేంద్ర నిధుల గురించీ ఈ అధ్యాయం సంక్షిప్తంగా తెలియజేస్తుంది. ఇంకా, రాష్ట్ర ప్రభుత్వం వివిధ అంశాలకు ఇస్తున్న ఆర్థిక ప్రాథమ్యాలు తగిన విధంగా ఉన్నాయా లేవా అనేది కూడా ఈ అధ్యాయంలో మదింపు చేయడమైంది.

**రెండో అధ్యాయం** వినియోగ పద్దుల ఆధారంగా రూపొందింది. రాష్ట్ర ప్రభుత్వపు కేటాయింపుల ప్రాథమ్యాలనూ, సేవలను అందజేసే వివిధ ప్రభుత్వ శాఖలు తమకు కేటాయించిన వనరులను ఉపయోగించిన తీరునూ ఈ అధ్యాయంలో విశ్లేషించడం జరిగింది.

**మూడో అధ్యాయంలో** ఆర్థిక నియమావళినీ, వివిధ నివేదికల సమర్పణకు సంబంధించిన ఆవశ్యకతలనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏమేరకు పాటించిందనే విషయాలపై అవలోకనం ఉంది. ఆడిట్ కనుగొన్న విషయాలకు మద్దతుగా పలుచోట్ల నుండి సేకరించిన అదనపు సమాచారాన్ని కూడా ఈ నివేదికకు అనుబంధంగా చేర్చడం జరిగింది.

## 3 ఆడిట్ కనుగొన్న విషయాలు, సిఫార్సులు

### 3.1 ఆర్థిక పరిపుష్టి

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టాన్ని తీసుకొచ్చిన తరువాతికాలంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల లక్ష్యాలను ప్రతి ఏటా సాధిస్తూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 2011-12లో వరుసగా 6వ సంవత్సరం రెవెన్యూ మిగులును సాధించింది. ద్రవ్యలోటు గత ఏడాది కంటే స్వల్పంగా పెరిగినప్పటికీ, ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం నిర్దేశించిన పరిమితిని మించలేదు. ఎఫ్.ఆర్.బి.ఎమ్.

చట్టంలో నిర్దేశించిన ప్రకారం, 2011-12 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య బాధ్యతలు జి.ఎస్.డి.పి.లో 29.60 శాతానికి మించకూడదు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య బాధ్యతలు ఈ పరిమితికి లోపలే, అంటే, 22.27 శాతం మాత్రమే ఉన్నాయి.

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టానికి అనుగుణంగా ఋణభారాన్ని తగ్గించుకోవడానికి లేదా వదిలించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిక్షిప్త నిధి (సింకింగ్ ఫండ్)ని, పూచీ విమోచన నిధి (గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్)ని ఏర్పాటు చేసింది. భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశించిన రేట్ల ప్రకారం వీటిలో నిధులను జమ చేస్తూ వస్తోంది. ఐతే, స్పెషల్ పర్పస్ వెహికిల్స్ తీసుకున్న ఋణాలను వాటి తరఫున ప్రభుత్వమే చెల్లిస్తోన్న సందర్భాల్లో, ఆ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ పద్దుల్లో తప్పుగా నమోదు చేసారు. ఫలితంగా, లోన్ల పద్దు కింద ప్రతికూల నిల్వలు ₹3,732 కోట్లు ఏర్పడి ఆర్థిక పద్దులలో రాష్ట్ర రెవెన్యూ వ్యయాన్నీ తక్కువగా చూపినట్లయింది. రాష్ట్ర ద్రవ్య సూచికలపై కూడా దీని ప్రభావం పడింది.

*సిఫార్సు: ద్రవ్య సూచికలను ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. వివిధ లావాదేవీల విషయంలో, ముఖ్యంగా తన అప్పులకు సంబంధించిన లావాదేవీల విషయంలో, అకౌంట్లలో వాటి నమోదు సరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.*

సొంత పన్నులు, పన్నులు కాని ఇతర రాబడులు గత ఏడాది కంటే ₹9,119 కోట్ల మేర పెరిగినందు వలన ఈ ఏడాది రెవెన్యూ రాబడులు (₹12,558 కోట్లు) గత ఏడాది కంటే 15.50 శాతం మేర పెరిగాయి. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలు రెండూ పెరిగిన కారణంగా, గత ఏడాది కంటే రెవెన్యూ వ్యయం 15.13 శాతం (₹11,881 కోట్లు) పెరిగింది. వడ్డీ చెల్లింపులు, స్థానిక సంస్థలకు విద్యా రంగంలో అందించే సాయంలో వృద్ధి వలన రెవెన్యూ వ్యయంలో పెరుగుదల నమోదయింది.

క్యాపిటల్ ఖర్చు 23 శాతం మేర పెరిగింది. మొత్తం వ్యయంతో క్యాపిటల్ వ్యయం నిష్పత్తి కూడా 12.28 శాతం నుంచి 18.43 శాతానికి గణనీయంగానే పెరిగింది. ఐతే, ఇది ఈ ఏడాదికి స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.)లో నిర్దేశించిన స్థాయిలో లేదు. సాగునీరు, రోడ్ల రంగాలలోని క్యాపిటల్ పనులు/ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయకపోవడంతో ఆశించిన ప్రయోజనాలు ఒనగూరకపోగా ఈ ప్రాజెక్టులపై ఖర్చు పెరుగుతోంది. 2012 మార్చి 31 నాటికి మొత్తం ₹49,516 కోట్ల ఖర్చు, ఈవిధంగా అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రాజెక్టులు/పనులపై ప్రతిఫలం రాని పెట్టుబడిగా ఉండిపోయింది. (ఇది గత సంవత్సరం ₹46,330 కోట్లు).

*సిఫార్సు: ఆశించిన విధంగా లక్షిత లబ్ధిదార్లకు ప్రయోజనాలు ఒనగూరాలంటే ఏళ్ళ తరబడి కొనసాగుతున్న పనులను, ముఖ్యంగా, సాగునీటి రంగానికి సంబంధించిన పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవలసి ఉంది. అంతేకాకుండా, క్యాపిటల్ వ్యయం అవసరమున్న రంగాలకు, ముఖ్యంగా, సామాజిక-ఆర్థిక రంగాలకు సంబంధించి ప్రభుత్వం తన ప్రాథమ్యాలను నిర్ణయించుకోవాలి.*

2011-12లో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వ్యయానికి తగిన ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, కేటాయించిన మొత్తం నిధులు నిర్దేశిత ప్రయోజనానికి వినియోగించేలా చూడలేదు. నిర్దేశిత సామాజిక రంగ కార్యకలాపాల కోసం కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం లేదా అసలే విడుదల చేయకపోవడం వలన ఏ లక్ష్యం కోసం నిధులను కేటాయించారో ఆ లక్ష్యం నెరవేరలేదు. విద్యా రంగంపై రాష్ట్ర వ్యయం (13.80 శాతం) సాధారణ వర్గం రాష్ట్రాల (17.18 శాతం) కంటే చాలా తక్కువగా ఉంది. అంతేకాకుండా, సామాజిక రంగంపై క్యాపిటల్ వ్యయం (మొత్తం వ్యయంలో 12.58 శాతం) కూడా సాధారణ వర్గం రాష్ట్రాల (13.71 శాతం) కంటే తక్కువగానే ఉంది.

*సిఫార్సు: సామాజిక రంగానికి సంబంధించిన ఖర్చుల విషయంలో ప్రభుత్వం తన ప్రాథమ్యాలను పునర్నిర్వచించుకొని ఆమోదించిన మేరకు నిధులు విడుదలయ్యేలా, మంజూరు చేసిన ప్రయోజనానికే ఆ నిధులు ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలి. విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ద్రవ్య ప్రాథమ్యాన్నివ్వాలి. అంతేకాకుండా, పెరుగుతున్న అప్పులకు దన్నుగా సంపదను సృష్టించుకునేలా క్యాపిటల్ వ్యయాన్ని పెంచుకోవలసి ఉంది.*

రాబోయే సంవత్సరాలలో, ప్రతి ఏటా చెల్లించాల్సిన పింఛను మొత్తాలను బీమా గణన (యాక్చూరియల్) ప్రాతిపదికన లెక్కగట్టాలని ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అలా లెక్కించలేదు. పింఛను నిధి నియంత్రణాధికార సంస్థ నిర్దేశాల ప్రకారం, కాంట్రిబ్యూటరీ పింఛను పథకంలో తన వాటా మొత్తాన్ని ఫండ్ మేనేజరుకు బదిలీ చేయాల్సి ఉండగా, 2012 మార్చి 31 నాటికి అలా బదిలీ చేయకుండా బకాయి ఉన్న పూర్తి మొత్తం ₹894 కోట్లకు చేరింది. నిజానికి, ఉద్యోగులు తమ వాటాగా చెల్లించిన మొత్తంతో పోలిస్తే, ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ₹100 కోట్లను తక్కువగా కేటాయించింది.

*సిఫార్సు: ప్రభుత్వం పింఛన్ల కోసం చేసే బడ్జెట్ కేటాయింపులను సమీక్షించుకుని, చెల్లించాల్సిన పింఛను మొత్తాలను బీమా గణన (యాక్చూరియల్) ప్రాతిపదికన లెక్కగట్టి, ఈ పద్దు కింద కేటాయింపులను చేయాలి. అంతేకాకుండా, పింఛను నిధికి జమ చేయాల్సిన బకాయిలను తక్షణమే ఫండ్ మేనేజరుకు బదిలీ చేయాలి.*

కంపెనీలు, చట్టబద్ధమైన కార్పోరేషన్లపై పెట్టిన పెట్టుబడులపై ప్రతిఫలం ఎప్పటిలా స్వల్పంగానే ఉంది. ప్రభుత్వం తెచ్చిన ఋణాలపై 2011-12లో చెల్లించిన వడ్డీ రేటు 7.40 శాతం కాగా, ప్రభుత్వ పెట్టుబడులపై ఈ ఏడాది వచ్చిన సగటు ప్రతిఫలం రేటు 0.85 శాతం మాత్రమే. ఈ కంపెనీలు, కార్పోరేషన్లలోని చాలావాటికి వార్షిక పద్దులు ఖరారు కాలేదు. పదకొండు సంస్థలకు సంబంధించి, పద్దులు ఖరారైన ఏడాదివరకూ పేరుకుపోయిన నష్టాల మొత్తం ₹5,979 కోట్లు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ₹3,554 కోట్ల నష్టంతోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ₹1,984 కోట్ల నష్టంతోనూ, జాబితాలో ముందున్నాయి.

ఇచ్చిన లోన్ల మొత్తం (₹4,983 కోట్లు), రికవరీ చేసిన లోన్ల (₹164 కోట్లు) మధ్య అంతరం బాగా పెరిగి, ప్రస్తుత లోన్ల రికవరీ స్థాయి చాలా అత్యల్పంగా ఉంది. మొత్తం ₹17,337 కోట్ల లోన్లు పొందిన సంస్థలనుండి రావలసిన బకాయిల వివరాలపై ఇప్పటికీ ధృవీకరణలు రాలేదు.

*సిఫార్సు: ప్రభుత్వరంగ సంస్థల నష్టాలకు ప్రాజెక్టు అమలు లోని లోపాలు, ఆర్థిక నిర్వహణా లోపాలు, ఇతరత్రా నిర్వహణా పరమైన లోపాలను ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. పదమూడవ ఆర్థిక సంఘం సిఫార్సులననుసరించి నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడానికి ప్రభుత్వం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించు కోవలసి ఉంది. అంతేకాకుండా, ఋణాలను తీసుకున్న సంస్థల నుండి బకాయిల వివరాలను ధృవీకరించుకుని, అసలు, వడ్డీలను నిర్దిష్ట కాలవ్యవధిలో వసూలు చేసేలా కూడా ప్రభుత్వం చర్యలను తీసుకోవలసి ఉంది.*

*(అధ్యాయం 1)*

## 3.2 ఆర్థిక నిర్వహణ, బడ్జెట్ నియంత్రణ

2010-11లో ఉన్నట్లే, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనా ప్రక్రియలో ఈ ఏడాది కూడా పలు లోపాలున్నాయి. బడ్జెట్ అంచనాల్లో లోపాలుండడం, వర్గీకరణ దోషాలను కొనసాగించడం, ఏ ప్రయోజనానికి కేటాయిస్తున్నారనే స్పష్టత లేకుండా (తర్వాత సరెండరు చేయడానికే అన్నట్లు) గంపగుత్త కేటాయింపులను చేయడం, కేటాయింపులను మించి ఖర్చు చేయడం, కేటాయింపులు లేకుండానే ఖర్చు చేయడం వంటివి జరిగాయి. అవసరానికి మించి నిధులను డ్రా చేయడం, సరైన వివరణలు లేకుండానే రీ-అప్రాప్రియేషన్లను చేయడం, బడ్జెట్లో నిధులు కేటాయించకుండానే ఖర్చు చేయడం ద్వారా పలు ప్రభుత్వ శాఖలు ఆర్థిక నియమాలను ఉల్లంఘించాయి. కొన్ని గ్రాంట్ల కింద ప్రతి ఏటా మిగుళ్ళేర్పడటం, మరికొన్ని గ్రాంట్ల కింద ₹500 కోట్లకు పైగానూ, బడ్జెట్ కేటాయింపులో 20 శాతానికంటే అధికంగానూ భారీ మిగుళ్ళేర్పడటం బడ్జెట్ అంచనాల్లో ఖచ్చితత్వం లేకపోవడాన్ని సూచిస్తుంది.

బడ్జెట్ కేటాయింపులో సుమారు ఆరో వంతు మిగుళ్ళేర్పడడం, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను వినియోగించకపోవడం బడ్జెట్ రూపకల్పనా ప్రక్రియపైనే సందేహాలకు అవకాశం కల్పిస్తోంది. ద్రవ్య సూచికలకు సంబంధించినంత వరకూ ఇది ఆరోగ్యవంతమైన ధోరణిని కనబరచినా, ప్రభుత్వం ప్రకటించిన/చేపట్టిన వివిధ విధాన నిర్ణయాల అమలుమీద ప్రతికూల ప్రభావం చూపుతుంది.

*సిఫార్సు : బడ్జెట్ ప్రక్రియ మరింత పారదర్శకంగానూ, సత్ఫలితాలనిచ్చేవిధంగానూ ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన ప్రాథమిక అంచనాలు మరింత కచ్చితంగా ఉండాలి. ఆర్థిక సంవత్సరం చివర్లో భారీ మిగుళ్ళు/అధిక ఖర్చులు, రీ-అప్రాప్రియేషన్లు, సరెండర్లను నివారించేలా గతంలోని రాబడులు, ఖర్చుల సరళిని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖలూ వాస్తవిక బడ్జెట్ అంచనాలను రూపొందించేలా చర్యలు తీసుకోవాలి.*

*(అధ్యాయం 2)*

## 3.3 ఆర్థిక నివేదన

పలు ప్రభుత్వ శాఖలు పాటించాల్సిన నియమ నిబంధనలను పాటించడంలేదు. ముఖ్యంగా, పద్దుల సంకలనం, ఆడిట్‌కు పద్దులను సమర్పించడం, వివిధ సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలను అమలు చేయడానికి వాటికిచ్చిన నిధుల వినియోగానికి సంబంధించిన నివేదికలను సమర్పించడం విషయంలో ప్రభుత్వ శాఖలు నియమ నిబంధనలను పాటించడంలేదు. తమ రాబడులు, ఖర్చులను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఎ.&ఇ.) రికార్డుల్లో నమోదయిన అంకెలతో సరిపోల్చి చూసుకోకపోవడం, ప్రభుత్వ పద్దులకు వెలుపల అక్రమంగానూ, ఆదేశాలకు విరుద్ధంగానూ వివిధ డిపాజిట్లలో నిధులను ఉంచడం, ఏ.సి. బిల్లులపై డ్రా చేసిన మొత్తాలకు డి.సి బిల్లులను సమర్పించి వాటిని సర్దుబాటు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఏళ్ళ తరబడి ఆ అడ్వాన్సులను పెండింగులో ఉంచడం వంటి చర్యల వలన అంతర్గత నియంత్రణలు సరిగా పనిచేయడం లేదని తెలుస్తోంది. అనామతు పద్దుల్లో (సస్పెన్స్ హెడ్స్‌లో) ఉన్న మొత్తాలను సర్దుబాటు చేయడానికి అవసరమైన వోచర్లు/డాక్యుమెంట్లను సంబంధిత అధికారులు సమర్పించేలా చర్యలు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపలేదు. **లక్షకు పైగా వ్యక్తిగత డిపాజిట్ (పి.డి.) అకౌంట్లను నిర్వహించడం, సుమారు ₹23,483 కోట్ల నిధులను ఈ అకౌంట్లలో ఉంచేయడం ప్రభుత్వ పద్దుల పారదర్శకతపై ప్రభావం చూపింది.** 'సబ్సిడీలు' వంటి ముఖ్యమైన ఖర్చులనూ, భారీ ఖర్చులనూ 'ఓమ్నిబస్ మైనర్ హెడ్ 800' కింద వర్గీకరణ చేయడం ప్రభుత్వ ఆర్థిక నివేదన పారదర్శకతను ప్రభావితం చేసింది.

*సిఫార్సు: ప్రభుత్వం ఆర్థిక నిర్వహణ, నివేదనలను పటిష్టం చేయాల్సి ఉంది. ముఖ్యంగా, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సంస్థలు సకాలంలో పద్దులను సంకలనం చేయడం, ఏ.సి.బిల్లులపై డ్రా చేసిన నిధులకు డి.సి. బిల్లులను సమర్పించి ఆ అడ్వాన్సులను సర్దుబాటు చేయడం, మైనర్ హెడ్ స్థాయి వరకూ ఖర్చుల వర్గీకరణను సరిగా చేయడం వంటి విషయాలలో ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ, నివేదనలు పటిష్టంగా ఉండాలి. పి.డి.అకౌంట్ల విధానాన్ని గాడిలో పెట్టడానికి, ప్రభుత్వం కఠిన చర్యలను చేపట్టాలి. అంతేకాకుండా, సంబంధింత ఆదేశాలు, నియమాల స్ఫూర్తిని ఖచ్చితంగా పాటించి, ఈ పి.డి. అకౌంట్లను పూర్తి పారదర్శకతతో నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.*

*(అధ్యాయం 3)*

## ఆంధ్రప్రదేశ్ స్వరూప చిత్రణ

ఆంధ్రప్రదేశ్ 2.75 లక్షల చ.కి.మీ. వైశాల్యంతో భౌగోళికంగా దేశంలో నాల్గవ అతి పెద్ద రాష్ట్రంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 8.47 కోట్లు. గత దశాబ్ద కాలంలో రాష్ట్రం సాధించిన ఆర్థికాభివృద్ధి కొంచెం అధికంగానే ఉంది. 2002-03 నుంచి 2011-12 మధ్యకాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) వార్షిక కాంపౌండ్ వృద్ధి రేటు16.71 శాతంగా ఉంది. సాధారణ వర్గం రాష్ట్రాలలో[1] ఇది 14.46 శాతం. ఇదే కాలంలో రాష్ట్ర జనాభా కూడా 9.72 శాతం పెరగగా, సాధారణ వర్గం రాష్ట్రాలలో జనాభా పెరుగుదల రేటు 13.90 శాతం ఉంది. పర్యవసానంగా, ఈ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (15.52 శాతం) సాధారణ వర్గం రాష్ట్రాల (13.09 శాతం) కన్నా ఎక్కువగా ఉంది.

దారిద్య్రరేఖకు దిగువన ఉన్న జనాభా (15.8 శాతం), శిశు మరణాల రేటు (వెయ్యి సజీవ జననాలకు 46), జీవన పరిమాణం (64.4 సంవత్సరాలు) వంటి కీలకమైన సామాజిక - ఆర్థిక పరామితులు అఖిల భారత సగటుకన్నా మెరుగ్గా ఉన్నాయి. గిని[2] కో-ఎఫిషియెంట్‌లో ప్రతిబింబించిన విధంగా ఆదాయ పంపిణీలో అసమానత కూడా జాతీయ సగటుకన్నా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో (0.29) కొంచెం తక్కువగా ఉంది. కానీ, ఇది పట్టణ ప్రాంతాలలో (0.37) జాతీయ సగటుకు ఇంచుమించు సమానంగా ఉంది (***అనుబంధం 1.1***). రాష్ట్ర స్థూల ఉత్పత్తిలోసగానికి పైగా సేవల రంగం నుండి వస్తోంది.

## 1.1 పరిచయం

ఈ అధ్యాయంలో, ప్రస్తుత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సమగ్ర స్వరూపంతోపాటు, గత ఐదేళ్ళలోని సమగ్ర ధోరణుల నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే ప్రధాన ద్రవ్య మొత్తాల్లోని కీలక మార్పులపై విశ్లేషణలున్నాయి. ఆర్థిక పద్దులు, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగా ఈ విశ్లేషణ చేయడం జరిగింది. ప్రభుత్వ పద్దుల నిర్మాణం, ఆర్థిక పద్దుల స్వరూపం ***అనుబంధం 1.2***లో ఉన్నాయి.

## 1.2 ప్రస్తుత సంవత్సరపు ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరణ

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది (2011-12) లో రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరాలను **పట్టిక 1.1** లోనూ, ప్రస్తుత సంవత్సరపు రాబడులు, చెల్లింపులు, సమగ్ర ద్రవ్య స్థితిని ***అనుబంధం 1.3*** లోనూ ఇవ్వడం జరిగింది.

---

[1] ప్రత్యేక వర్గం రాష్ట్రాలుగా పేర్కొన్న 11 రాష్ట్రాలు (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్ము - కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్) కాకుండా, మిగతా రాష్ట్రాలు

[2] ఇది ఆర్థిక అసమానతకు కొలమానం. సున్నా పరిపూర్ణ సమానతనూ, ఒకటి పరిపూర్ణ అసమానతనూ సూచిస్తాయి

## పట్టిక 1.1 ద్రవ్య లావాదేవీల సంక్షిప్త వివరాలు

(₹ కోట్లలో)

| రాబడులు | | | చెల్లింపులు | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | 2010-11 | 2011-12 | | 2010-11 | 2011-12 | | |
| | మొత్తం | మొత్తం | | మొత్తం | ప్రణాళికేతర | ప్రణాళిక | మొత్తం |
| విభాగం-ఎ- రెవెన్యూ | | | | | | | |
| **రెవెన్యూ రాబడులు** | **80,996** | **93,554** | **రెవెన్యూ వ్యయం** | **78,534** | **66,751** | **23,664** | **90,415** |
| *పన్నుల నుండి రాబడి* | *45,139* | *53,284* | *సాధారణ సేవలు* | *26,708* | *29,722* | *152* | *29,874* |
| *పన్నులు కాని రాబడి* | *10,720* | *11,694* | *సామాజిక సేవలు* | *32,314* | *21,287* | *16,730* | *38,017* |
| *కేంద్ర పన్నులు/సుంకాలలో వాటా* | *15,237* | *17,751* | *ఆర్థిక సేవలు* | *19,346* | *15,527* | *6,782* | *22,309* |
| *కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంటులు* | *9,900* | *10,825* | *సహాయక గ్రాంటులు, విరాళాలు* | *166* | *215* | --- | *215* |
| విభాగం-బి- క్యాపిటల్, ఇతరాలు | | | | | | | |
| వివిధ క్యాపిటల్ రాబడులు | --- | --- | క్యాపిటల్ పరివ్యయం | 11,123 | 35 | 13,687 | 13,722 |
| లోన్లు, అడ్వాన్సుల వసూళ్ళు | 173 | 164* | ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు | 3,315 | 222 | 4,761 | 4,983 |
| ప్రజా ఋణాల రాబడి | 18,722 | 19,450 | ప్రజాఋణం తిరిగి చెల్లింపు | 7,881 | --- | 6,761 | 6,761 |
| ఆకస్మిక ఖర్చుల నిధి | --- | 2 | ఆకస్మిక ఖర్చుల నిధి | 2 | --- | --- | --- |
| ప్రజా పద్దులోకి రాబడి | 76,218 | 86,051 | ప్రజా పద్దునుండి చెల్లింపులు | 72,407 | --- | 82,848 | 82,848 |
| ప్రారంభ నగదు నిల్వ | 5,983 | 8,830 | ముగింపు నగదు నిల్వ | 8,830 | --- | 9,322 | 9,322 |
| మొత్తం | 1,82,092 | 2,08,051 | మొత్తం | 1,82,092 | 67,008 | 1,41,043 | 2,08,051 |

*మూలం : ఆర్థిక పద్దులు;  * బ్యాలెన్సింగ్ కోసం 164.92 ను 164 గా సవరించడమైంది*

నిరుటితో పోలిస్తే రాష్ట్ర ఆర్థిక స్థితిలో 2011-12 లో వచ్చిన గణనీయమైన మార్పులు కింది విధంగా ఉన్నాయి :

**రెవెన్యూ రాబడులు**
- 15.50 శాతం పెరిగాయి
- సొంత పన్నుల ఆదాయం 18.04 శాతం పెరిగింది

**రెవెన్యూ ఖర్చు**
- 15.13 శాతం పెరిగింది
- ప్రణాళికా వ్యయం 20.12 శాతం పెరిగింది
- ప్రణాళికేతర వ్యయం 13.46 శాతం పెరిగింది

**క్యాపిటల్ ఖర్చు**
- 23.37శాతం పెరిగింది

**లోన్లు, అడ్వాన్సులు**
- వసూళ్ళు 5.20 శాతం తగ్గాయి
- చెల్లింపులు 50.32 శాతం పెరిగాయి

**ప్రజా ఋణం**
- రాబడులు 3.88 శాతం పెరిగాయి
- తిరిగి చెల్లించిన మొత్తాలు 14.21 శాతం తగ్గాయి

**నగదు నిల్వ**
- 5.57 శాతం పెరిగింది

*రాష్ట్ర ప్రభుత్వం 2011-12 లో వరుసగా ఆరో సంవత్సరం రెవెన్యూ మిగులును సాధించింది. 2010-11 లో ద్రవ్య లోటు జి.ఎస్.డి.పి. లో 2.08 శాతం ఉండగా ఈ ఏడాది అది 2.27 శాతం ఉంది. ఇది ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం, 13వ ఆర్థిక సంఘం నిర్ణయించిన 3 శాతం పరిమితిలోనే ఉంది.*

## 1.3 బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు

కీలకమైన ద్రవ్యపరామితులకు సంబంధించి బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలను **చార్టు 1.1** లోనూ, ***అనుబంధం 1.4*** లోనూ ఇవ్వడమైంది.

**చార్టు 1.1 : బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు**




దాదాపు అన్ని పరామితుల విషయంలోనూ బడ్జెట్ అంచనాలకు, వాస్తవ విలువలకు మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నాయి. పన్నుల రాబడులు, పన్నులు కాని రాబడులు రెండూ ఈ ఏడాది పెరిగినప్పటికీ ఇవి బడ్జెట్ అంచనాల మేర రాలేదు. బడ్జెట్‌లో చూపిన అంచనాల కంటే రెవెన్యూ వసూళ్ళు 7.37 శాతం మేర, రెవెన్యూ వ్యయం 6.95 శాతం మేర తగ్గాయి. ఫలితంగా రెవెన్యూ మిగులు బడ్జెట్ అంచనాల కంటే 17.98 శాతం తగ్గింది.

*మూలం : సంక్షిప్త బడ్జెటు, ఆర్థిక పద్దులు 2011-12*

రెవెన్యూ వ్యయం బడ్జెట్ అంచనాలకంటే 6.95 శాతం తక్కువగా నమోదయింది. ఈ తగ్గుదల ప్రధానంగా, నీటి సరఫరా - పారిశుద్ధ్యం(46.02 శాతం), జిల్లా పరిపాలన (33.33 శాతం), పట్టణాభివృద్ధి (28.52 శాతం), సాగునీరు-వరదల నియంత్రణ (19.04 శాతం), వడ్డీ చెల్లింపులు (7.66 శాతం ) అంశాలలో నమోదయింది. వడ్డీ చెల్లింపులకు కేటాయింపులో మిగులు ఏర్పడినప్పటికీ, వాస్తవానికి గత ఏడాది కంటే ఈ ఏడాది ₹886 కోట్లు అధికంగా వడ్డీ చెల్లింపులను చేయడం జరిగింది. గత ఏడాదితో పోల్చి చూస్తే 2011-12లో క్యాపిటల్ ఖర్చు పెరిగింది. కానీ బడ్జెట్ అంచనాల కంటే ఇది 23.15 శాతం తక్కువే. బడ్జెట్ అంచనాల కంటే ద్రవ్యలోటు 12.50 శాతం, ప్రాథమిక లోటు 21.46 శాతం తక్కువగా నమోదయ్యాయి.

## 1.4 ద్రవ్య సంస్కరణల పథం

పన్నెండవ ఆర్థిక సంఘం (టి.ఎఫ్.సి.) సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టం - 2005 అనే చట్టాన్ని చేసింది. ఈ చట్టానికి 2011 లో సవరణ చేయడమైంది. ఈ సవరించిన చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, జి.ఎస్.డి.పి.లో తన మొత్తం బకాయిలను 2011-12 సంవత్సరంలో 29.6 శాతానికి పరిమితం చేసుకుంది. 2011లో సవరించిన ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం - 2005 సారాంశం ***అనుబంధం 1.5***లో ఉంది. కొత్త ఢిల్లీలోని కేంద్రీయ గణాంక కార్యాలయం కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ గణక గణాంకాల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) లెక్కింపుకు ప్రాతిపదిక సంవత్సరాన్ని 1999-2000 నుంచి 2004-05 కు మార్చడం జరిగింది. ఫలితంగా, 2007-12 మధ్యగల ఐదేళ్ళ కాలానికి వర్తమాన ధరల ప్రకారం జి.ఎస్.డి.పి. లెక్కింపు, దాని మీద వ్యాఖ్యలలో మార్పులు చోటుచేసుకున్నాయి.

## 1.5 రాష్ట్ర వనరులు

### 1.5.1 వార్షిక ఆర్థిక పద్దుల ప్రకారం రాష్ట్ర వనరులు

రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ, క్యాపిటల్ అనే రెండు రకాల రాబడుల ద్వారా వనరులు సమకూరుతాయి. రెవెన్యూ రాబడులలో పన్నుల వసూళ్ళు, పన్నులు కాని రాబడులు, కేంద్ర పన్నులు, సుంకాల్లో రాష్ట్ర వాటా, భారత ప్రభుత్వం ఇచ్చే సహాయక గ్రాంట్లు ఉంటాయి. క్యాపిటల్ రాబడుల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చే మొత్తాలు, లోన్లు, అడ్వాన్సుల రికవరీలు, అంతర్గత అప్పుల ద్వారా పొందిన మొత్తాలు (మార్కెట్ లోన్లు, ఆర్థిక సంస్థలు, వాణిజ్య బ్యాంకుల నుండి అప్పులు), భారత ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు, ప్రజా పద్దులోకి వచ్చే మొత్తాలు వంటి వివిధ రకాల క్యాపిటల్ స్వభావం కలిగిన రాబడులు ఉంటాయి.




*మూలం : ఆర్థిక పద్దులు*

ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆర్థిక పద్దులలో నమోదైన రాష్ట్ర రాబడులు, చెల్లింపులను **పట్టిక 1.1**లో చూపడమైంది. 2011-12లో రాష్ట్ర రాబడులలోని వివిధ అంశాల సరళిని **చార్టు 1.2** తెలియజేస్తుంది. చార్టు 1.2లో చూపినట్లు రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం రాబడులు 2007-08 లో ₹1,33,404 కోట్లు కాగా, అవి 2011-12 లో ₹1,99,220 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది రాష్ట్ర రాబడుల కూర్పును **చార్టు 1.3**లో చూపడమైంది.

2007-12 మధ్య కాలంలో మొత్తం రాబడుల్లో రెవెన్యూ రాబడుల వాటా 41 నుండి 47 శాతం మధ్య ఉంది. గత ఐదేళ్ళలో క్యాపిటల్ వసూళ్ళ వాటాలో హెచ్చు తగ్గులున్నాయి. ఈ ఏడాది అది 10 శాతంగా ఉంది. గత ఐదేళ్ళలో ప్రజా పద్దు కింద వచ్చిన రాబడులు మొత్తం రాబడులలో 48 శాతం నుండి 43 శాతానికి తగ్గాయి.




*మూలం : ఆర్థిక పద్దులు 2011-12*

## 1.6 రెవెన్యూ రాబడులు

2007-12 మధ్యగల ఐదేళ్ళ కాలంలో రాష్ట్ర రెవెన్యూ రాబడుల సరళి, కూర్పులను ***అనుబంధం 1.6***లో ఇవ్వడమైంది. వీటిని **చార్టులు 1.4, 1.5** లలో కూడా చూపడం జరిగింది :

చార్టు 1.4 : రెవెన్యూ రాబడుల సరళి




మూలం : ఆర్థిక పద్దులు

చార్టు 1.5 : రెవెన్యూ రాబడుల కూర్పు




మూలం : ఆర్థిక పద్దులు

గత ఐదేళ్ళలో (2009-10లో తప్ప) సొంత పన్నుల రాబడి పెరుగుతున్నప్పటికీ, **పట్టిక 1.3**లోని వివరాలను చూస్తే, ఈ ఐదేళ్ళ కాలంలో రెవెన్యూ రాబడుల వృద్ధి హెచ్చు తగ్గులకు లోనయిందని తెలుస్తోంది.

ఈ ఏడాది రాబడుల వృద్ధి రేటు (15.50 శాతం) 2010-11 కంటే చాలా తక్కువగా ఉంది. ఈ సంవత్సరపు రెవెన్యూ రాబడులు (₹93,554 కోట్లు) స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) అంచనాల (₹97,194 కోట్లు) కంటే ₹3,640 కోట్లు (3.75 శాతం) తక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది రాష్ట్ర సొంత పన్నులు, పన్నులు కాని రాబడులు (₹64,978 కోట్లు) గత సంవత్సరం కంటే ₹9,119 కోట్ల మేర పెరిగాయి. ఐతే ఇవి ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. అంచనాల కంటే ₹652 కోట్లు తక్కువగా ఉన్నాయి. 13 వ ఆర్థిక సంఘం, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అంచనాలతో పోలుస్తూ 2011-12 లో వాస్తవంగా వచ్చిన పన్నుల రాబడి, పన్నులు కాని రాబడి **పట్టిక 1.2** లో ఇవ్వడమైంది :

## పట్టిక 1.2 : రెవెన్యూ రాబడులు - అంచనాలు

**(₹ కోట్లలో)**

| | 13 వ ఆర్థిక సంఘం అంచనాలు | ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అంచనాలు | వాస్తవంగా వచ్చిన రాబడి |
|---|---|---|---|
| **పన్నుల రాబడి** | 52,505 | 53,399 | 53,284 |
| **పన్నులు కాని రాబడి** | 7,239 | 12,231 | 11,694 |

*(మూలం : 13వ ఆర్థిక సంఘం సిఫార్సులు; రాష్ట్ర ఆర్థిక పద్దులు 2011-12; 2011-12 లో శాసన సభ ముందుంచిన ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.)*

పన్నులు, పన్నులు కాని ఇతర రాబడుల విషయంలో వాస్తవంగా వచ్చిన రాబడులు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగానే ఉన్నప్పటికీ 13వ ఆర్థిక సంఘం అంచనాల కన్నా ఎక్కువగానే ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరంలో పన్నులు కాని రాబడిలో వడ్డీ రూపేణా వచ్చిన మొత్తం ₹6,279 కోట్లు కాగా ఇందులో ₹5,726 కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించినది. పద్దులలో సర్దుబాటు ద్వారా వచ్చినది కాబట్టి, ఇది కేవలం నామమాత్రపు రాబడి.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) తో సాపేక్షికంగా రెవెన్యూ రాబడుల సరళిని **పట్టిక 1.3** లో చూపడమైంది.

పట్టిక 1.3 : జి.ఎస్.డి.పి.తో సాపేక్షికంగా రెవెన్యూ రాబడుల సరళి

| | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| రెవెన్యూ రాబడులు (₹ కోట్లలో) | 54,143 | 62,858 | 64,678 | 80,996 | 93,554 |
| రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు[3] (శాతం) | 22.37 | 16.10 | 2.90 | 25.23 | 15.50 |
| జి.ఎస్.డి.పి.[4] (₹ కోట్లలో) | 364813 | 415832 | 475267(R) | 567636(Q) | 675798(UA) |
| జి.ఎస్.డి.పి. వృద్ధి రేటు (శాతం) | 21.18 | 13.99 | 14.29 | 19.44 | 19.05 |
| రెవెన్యూ రాబడులు/జి.ఎస్.డి.పి.(శాతం) | 14.84 | 15.12 | 13.61 | 14.27 | 13.84 |
| చలన గుణం నిష్పత్తులు[5] | | | | | |
| జి.ఎస్.డి.పి. తో పోలిస్తే రెవెన్యూ చలన గుణం | 1.06 | 1.15 | 0.20 | 1.30 | 0.81 |
| జి.ఎస్.డి.పి. తో పోలిస్తే రాష్ట్ర సొంత పన్నుల చలన గుణం | 0.96 | 1.13 | 0.38 | 1.46 | 0.94 |

*మూలం : ఆర్థిక పద్దులు*

## 1.6.1 రాష్ట్ర సొంత వనరులు

ఆర్థిక సంఘం సిఫార్సులు, కేంద్ర పన్నుల వసూళ్ళు, ప్రణాళికా పథకాలకు కేంద్రం ఇచ్చే సాయం మొదలైన వాటి ఆధారంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, సహాయక గ్రాంట్లను నిర్ణయిస్తారు. కాబట్టి అదనపు వనరుల సమీకరణలో రాష్ట్రం పని తీరును, రాష్ట్రం సొంత వనరులను అంటే సొంత పన్నుల వసూళ్ళు, పన్నులు కాని ఇతర రాబడులను దృష్టిలో ఉంచుకుని అంచనా వేయాల్సి ఉంటుంది.

### 1.6.1.1 సొంత పన్నుల నుండి రాబడి

రాష్ట్ర అబ్కారీ(16.31 శాతం), అమ్మకాలు-వర్తకాలపై పన్నులు (19.78 శాతం) వాహనాలపై పన్నులు (13.69 శాతం)లో పెరుగుదల వలన ప్రస్తుత సంవత్సరం సొంత పన్నుల రాబడి వృద్ధి రేటు గత ఏడాది కంటే 18.04 శాతం పెరిగింది.

### 1.6.1.2 పన్నులు కాని రాబడులు

గత ఐదేళ్ళలో (2007-12) పన్నులు కాని ఇతర రాబడులు మొత్తం రెవెన్యూ రాబడులలో 12 నుంచి 15 శాతం మధ్య ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఇవి ₹974 కోట్ల మేర పెరిగాయి. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం, శాఖాపరంగా నిర్వహించే ప్రభుత్వరంగ వాణిజ్య సంస్థల నుండి వడ్డీల వసూళ్ళు (₹505 కోట్లు).

## 1.6.2 పన్నుల వసూళ్ళపై వ్యయం

ప్రధానమైన సొంత పన్నుల వసూళ్ళపై అయిన వ్యయం **పట్టిక 1.4** లో ఇవ్వడం జరిగింది.

---

[3] పేజీ 103 లోని పారిభాషిక పదకోశం చూడండి

[4] జి.ఎస్.డి.పి. సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక గణాంక సంచాలకుల కార్యాలయం నుండి పొందడమైంది
**R**: సవరించిన, **Q**: త్వరిత **UA**: ముందుగా వేసిన తాజా అంచనాలు

[5] పేజీ 103 లోని పారిభాషిక పదకోశం చూడండి

పట్టిక 1.4 ః రెవెన్యూ వసూళ్ళపై వ్యయం

(₹ కోట్లలో)

| రెవెన్యూ పద్దు | సంవత్సరం | మొత్తం వసూళ్ళు | వసూళ్ళపై వ్యయం | మొత్తం వసూళ్ళలో ఈ వ్యయ శాతం | వసూళ్ళపై వ్యయ శాతానికి సంబంధించి జాతీయ సగటు |
|---|---|---|---|---|---|
| అమ్మకాలు, వర్తకం, మొదలైన వాటిపై పన్నులు | 2009-10 | 23,640 | 216 | 0.91 | **0.96** |
| | 2010-11 | 29,145 | 262 | 0.90 | **0.75** |
| | **2011-12*** | **34,910** | **283** | **0.81** | -- |
| రాష్ట్ర అబ్కారీ | 2009-10 | 5,848 | 201 | 3.43 | **3.64** |
| | 2010-11 | 8,265 | 234 | 2.83 | **3.05** |
| | **2011-12** | **9,612** | **264** | **2.75** | -- |
| వాహనాలపై పన్నులు | 2009-10 | 1,995 | 65 | 3.26 | **3.07** |
| | 2010-11 | 2,626 | 85 | 3.24 | **3.71** |
| | **2011-12** | **2,986** | **100** | **3.35** | -- |
| స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ రుసుము | 2009-10 | 2,639 | 88 | 3.33 | **2.47** |
| | 2010-11 | 3,834 | 95 | 2.48 | **1.60** |
| | **2011-12** | **4,385** | **102** | **2.33** | -- |

*మూలం ః ఆర్థిక పద్దులు* *గమనిక: 2011-12 సంవత్సరానికి అఖిల భారత సగటు ఇంకా అందలేదు

వసూళ్ళపై వ్యయం గత మూడేళ్ళుగా హెచ్చుతగ్గులకు గురవుతోంది. వాహనాలపై పన్నుల పద్దులో మినహా మిగిలిన అన్ని పద్దులలోనూ గడచిన ఏడాదితో పోల్చిచూస్తే వసూళ్ళపై వ్యయశాతం క్రమేపీ తగ్గుతోంది.

### 1.6.3 కేంద్ర పన్నులనుండి వచ్చిన వాటా

కేంద్రపన్నుల్లో వాటాగా వచ్చిన మొత్తాలు 2010-11లో ₹15,237 కోట్లు కాగా, 2011-12లో ఇవి 16.49 శాతం పెరిగి ₹17,751 కోట్లకు చేరాయి. కస్టమ్స్ సుంకాల నికర వసూళ్ళ వాటాలో పెరుగుదల (15.52 శాతం), సేవా పన్నుల నికర వసూళ్ళ వాటాలో పెరుగుదల (39.45 శాతం) ఈ వృద్ధి కి ప్రధాన కారణం.

### 1.6.4 రాష్ట్రంలో వివిధ పథకాలను అమలుచేస్తున్న సంస్థలకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా, నేరుగా విడుదల చేసిన నిధులు

కీలకమైనవిగా గుర్తించిన సామాజిక, ఆర్థిక రంగాల్లోని వివిధ పథకాలను, కార్యక్రమాలను అమలు చేయడానికి రాష్ట్రంలోని కొన్ని సంస్థలకు భారత ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులను నేరుగా విడుదల చేస్తోంది. ఈ నిధులు రాష్ట్ర బడ్జెట్/రాష్ట్ర ట్రెజరీ వ్యవస్థ ద్వారా రాని కారణంగా వీటి వివరాలు రాష్ట్ర ఆర్థిక పద్దులలో నమోదుకావు. ఫలితంగా, రాష్ట్ర రాబడులు, ఖర్చులనూ, వీటి ఆధారంగా లెక్కించిన ఇతర ద్రవ్య పరామితులు/చలరాశులనూ ఆమేరకు తక్కువగా అంచనా వేయడం జరుగుతుంది. మొత్తం వనరుల లభ్యతకు సంబంధించిన సమగ్ర స్వరూపాన్ని తెలపడం కోసం రాష్ట్రంలో వివిధ పథకాలను అమలు చేస్తున్న సంస్థలకు[6] భారత ప్రభుత్వం నుండి నేరుగా ₹10 కోట్లను మించి నిధులు వచ్చిన కేసులను ***అనుబంధం 1.7***లో ఇవ్వడం జరిగింది.

[6] పథకాలను అమలు చేసే సంస్థలలో ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు కూడా ఉంటాయి. ఏదైనా పథకాన్ని అమలు చేయడం కోసం భారత ప్రభుత్వం నుండి నిధులను పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం వీటికిఅనుమతినిస్తుంది. సర్వ శిక్షా అభియాన్ పథకాన్ని అమలు చేసే రాష్ట్ర స్థాయి అమలు సంస్థ, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని అమలు చేసే రాష్ట్ర ఆరోగ్య మిషన్ వంటివి వీటికి ఉదాహరణ

రాష్ట్రంలో వివిధ కేంద్ర పథకాలు/కార్యక్రమాలను అమలు చేస్తున్న సంస్థలకు, ప్రస్తుత సంవత్సరంలో భారత ప్రభుత్వం ₹9,807 కోట్లను రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా నేరుగా విడుదల చేసింది. బడ్జెట్‌తో సంబంధం లేకుండా అమలు సంస్థలకు నిధులను నేరుగా విడుదల చేయడం పర్యవేక్షణ కొరవడడానికీ, ద్రవ్య బాధ్యతల చట్టం నిర్దేశించిన పారదర్శకతకు ఆటంకం కలగడానికీ , జవాబుదారీతనం లోపించడానికీ దారి తీస్తుంది.

ఈ నిధుల వినియోగాన్ని ఏ ఒక్క సంస్థా పర్యవేక్షించడం లేదు. అంతేకాకుండా, ఏ ఏడాదిలోనైనా ఏదైనా ఒక ప్రధాన పథకంపై గానీ, ఇతర ముఖ్య పథకాలపై గానీ పెట్టిన ఖర్చుల సమాచారం కూడా అందుబాటులో లేదు. ఈ సంస్థలన్నీ జమా-లెక్కల విషయంలో ఒకే విధానాన్ని అనుసరించి, ఖర్చుల నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పిస్తూ వివరాలన్నింటినీ పక్కాగా నమోదు చేస్తే తప్ప నేరుగా విడుదలైన ఈ నిధుల అంతిమ వినియోగాన్ని పర్యవేక్షించడం చాలా కష్టసాధ్యమౌతుంది. ఈ నిధుల విషయంలో జమా ఖర్చుల లెక్కలు సరిగా ఉండేలా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు యంత్రాంగాన్ని నెలకొల్పాల్సి ఉంది.

## 1.7 వనరుల వినియోగం

అభివృద్ధి కార్యక్రమాలపై, ముఖ్యంగా సామాజిక రంగంపై చేసిన ఖర్చులను మేము అధ్యయనం చేసాము. రాష్ట్ర స్థాయిలో కొనసాగుతున్న ద్రవ్య దిద్దుబాటు, పరిపుష్టి ప్రక్రియల ప్రభావం అభివృద్ధి వ్యయంపై ఏవిధంగా ఉందో తెలుసుకునేందుకు మేము చేసిన ఈ విశ్లేషణా ఫలితాలను ఈ కింద చర్చించడమైంది :

### 1.7.1 ఖర్చుల పెరుగుదల, వాటి కూర్పు

2007-12 మధ్య గల ఐదేళ్ళ కాలంలో మొత్తం ఖర్చు సరళిని **చార్టు 1.6** తెలియజేస్తుంది. 'ఆర్థిక వర్గీకరణ', 'కార్యకలాపాల వారీగా ఖర్చు'ల దృష్ట్యా మొత్తం వ్యయం కూర్పును **చార్టులు 1.7, 1.8** లలో చూపడం జరిగింది.

చార్టు 1.6 : మొత్తం వ్యయం సరళి, కూర్పు




మూలం : ఆర్థిక పద్దులు

2011-12 లో మొత్తం వ్యయం (₹1,09,120 కోట్లు) గత ఏడాది (₹92,972 కోట్లు) కంటే ₹16,148 కోట్లమేర (17.37 శాతం) పెరిగింది. లోన్లు, అడ్వాన్సులలోని పెరుగుదల (₹1,668 కోట్లు), రెవెన్యూ వ్యయంలోని పెరుగుదల (₹11,881 కోట్లు) క్యాపిటల్ వ్యయంలోని పెరుగుదల (₹2,599 కోట్లు) కారణంగా మొత్తం వ్యయం పెరిగింది. ప్రస్తుత సంవత్సరం 86 శాతం ఖర్చులకు రెవెన్యూ రాబడులనూ, మిగతా ఖర్చులకు ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులను వినియోగించారు. ఐతే మొత్తం వ్యయం బడ్జెట్‌లో అంచనావేసిన మొత్తం (₹1,15,025 కోట్లు) కన్నా తక్కువగానే ఉంది.

జి.ఎస్.డి.పి.లో 13.37 శాతంగా ఉన్న ప్రస్తుత సంవత్సరపు రెవెన్యూ వ్యయం నిరుటి మీద ₹11,881 కోట్లు పెరిగింది. విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి (₹2,332 కోట్లు); షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన కులాల సంక్షేమం (₹1,046 కోట్లు), సస్యరక్షణ (₹949 కోట్లు), వడ్డీ చెల్లింపులు, ఋణ సర్వీసింగ్ (₹886 కోట్లు); సామాజిక భద్రత మరియు సంక్షేమం (₹690 కోట్లు), విద్యుత్ (₹659 కోట్లు) కింద రెవెన్యూ ఖర్చు గణనీయంగా పెరిగింది.

రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల విషయంలో, ఖర్చుల నాణ్యత ఎల్లప్పుడూ ప్రాధాన్యత గల అంశంగా ఉంటుంది. ప్రస్తుతం, రెవెన్యూ వ్యయం రాష్ట్రం మొత్తం వ్యయంలో సుమారు 83 శాతం ఉంది. ఇది ఆస్తుల కల్పనకూ, మౌలిక వసతులకూ పెట్టుబడి పెట్టేందుకు స్వల్ప ప్రాధాన్యతనిస్తూ, వర్తమాన వినియోగ స్వభావం కలిగి ఉండటంతో రాష్ట్రాభివృద్ధి అవకాశాలను ఆటంకపరుస్తుంది. కనుక అభివృద్ధికీ, ప్రజా సంక్షేమానికీ అంతగా దోహదపడని అనవసర రెవెన్యూ వ్యయాంశాలను గుర్తించవలసి ఉంది.




*మూలం : ఆర్థిక పద్దులు*

2011-12లో క్యాపిటల్ ఖర్చు (₹13,722 కోట్లు) నిరుటి (₹11,123 కోట్లు) కంటే ₹2,599 కోట్లు పెరిగింది. ఇది మొత్తం ఖర్చులో 12.58 శాతం ఉంది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులపై (₹1,147 కోట్లు), చిన్న తరహా ప్రాజెక్టులపై (₹480 కోట్లు) ప్రధానంగా పెరుగుదల ఉంది. జి.ఎస్.డి.పి. లో 2.03 శాతంగా ఉన్న క్యాపిటల్ ఖర్చు, 2011-12 సంవత్సరానికి స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) లోని అంచనాల (₹18,798 కోట్లు) కంటే తక్కువగా ఉంది.

ఈ సంవత్సరం ఇచ్చిన ఋణాలు, అడ్వాన్సులు నిరుటి మీద 50.31శాతం పెరిగాయి. మొత్తం వ్యయంలో ఇవి 4.57 శాతం ఉన్నాయి. 2007-12 మధ్యగల ఐదేళ్ళ కాలంలో ఋణాలు, అడ్వాన్సులుగా ఇచ్చినది మొత్తం వ్యయంలో 2 నుంచి 5 శాతం మధ్య ఉంది.




**అంశాల వారీగా సరళి:** మొత్తం వ్యయంలో సాధారణ సేవల వాటా, నిరుటి కంటే 2011-12లో 1.39 శాతం తగ్గింది. మొత్తం వ్యయంలో సామాజిక సేవల వాటా 0.19 శాతం, ఆర్థిక సేవల వాటా 0.18 శాతం చొప్పున పెరిగింది.

*మూలం : ఆర్థిక పద్దులు*

### 1.7.2 తప్పనిసరి ఖర్చులు

రెవెన్యూ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వ తప్పనిసరి ఖర్చుల్లో ప్రధానంగా వడ్డీ చెల్లింపులు, జీతాలు/వేతనాలు, పింఛన్లు, సబ్సిడీల ఖర్చులు ఉన్నాయి. ఈ అంశాలపై 2007-12 మధ్య కాలంలో అయిన ఖర్చుల సరళిని **పట్టిక 1.5, చార్టు 1.9** లలో చూపడమైంది.

**పట్టిక 1.5: తప్పనిసరి ఖర్చులలోని అంశాలు**

(₹ కోట్లలో)

| తప్పనిసరి ఖర్చుల్లోని అంశం | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | బడ్జెట్ అంచనాలు | వాస్తవంగా అయిన ఖర్చు | శాతంలో వ్యత్యాసం |
| జీతాలు*, వేతనాలపై మొత్తం ఖర్చు, ఇందులో | 13,243(24) | 14,539(23) | 17,721(27) | 23,844(29) | 27,237(28) | 26,823(30) | -1.52 |
| (i) ప్రణాళికేతర పద్దు | 12,171 | 12,883 | 15,706 | 21,128 | 24,155 | 23,828 | -1.35 |
| (ii) ప్రణాళికా పద్దు** | 1,072 | 1,656 | 2,015 | 2,716 | 3,082 | 2,995 | -2.82 |
| వడ్డీ చెల్లింపులు | 7,589 | 8,057 | 8,914 | 9,675 | 11,437 | 10,561 | 7.66 |
| పింఛన్లు | 5,092 | 5,518 | 6,339 | 9,609 | 9,693 | 11,110 | 14.62 |
| సబ్సిడీలు | 3,918 | 6,213 | 6,056 | 6,543 | 7,313 | 7,313 | 0.00 |
| మొత్తం | 29,842(54) | 34,327(55) | 39,030 | 49,671(61) | 55,680( 57) | 55,807(62) | 0.23 |

మూలం : ఆర్థిక పద్దులు బ్రాకెట్లలోని అంకెలు రెవెన్యూ వ్యయం శాతాన్ని తెలియజేస్తాయి

* సహాయక గ్రాంట్ల నుండి చెల్లించిన జీతాలు, వర్క్ ఛార్జ్డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కూడా ఇందులో ఉన్నాయి

** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద చెల్లించిన జీతాలు, వేతనాలు కూడా ప్రణాళికా పద్దులో ఉన్నాయి

2011-12 లో జీతాలు, వేతనాలు, పింఛన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలపై తప్పనిసరి ఖర్చులు ప్రణాళికేతర రెవెన్యూ వ్యయంలో 84 శాతం ఉన్నాయి.

#### 1.7.2.1 జీతాలు, వేతనాలు

ప్రస్తుత సంవత్సరం జీతాలు, వేతనాలపై ఖర్చు గత ఏడాది కంటే 12.49 శాతం పెరిగింది. ఐతే, ఇది బడ్జెట్ అంచనాల కంటే 1.52 శాతం తక్కువగానూ, రాష్ట్ర ప్రభుత్వం ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.లో చూపిన అంచనా (₹26,573 కోట్లు) కంటే ఎక్కువ గానూ, 13వ ఆర్థిక సంఘం అంచనా (₹15,735 కోట్లు) కన్నా ఎక్కువగానూ ఉంది. వడ్డీ, పింఛను చెల్లింపులను మినహాయించగా ఈ సంవత్సరపు రెవెన్యూ వ్యయంలో జీతాలపై ఖర్చు 40 శాతం ఉంది. ఇది పన్నెండవ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన 35 శాతం పరిమితికి మించి ఉంది.

**చార్టు 1.9 : 2007-12 మధ్య ప్రణాళికేతర రెవెన్యూ వ్యయంలో తప్పనిసరి ఖర్చు వాటా**




మూలం : ఆర్థిక పద్దులు

### 1.7.2.2 వడ్డీ చెల్లింపులు

ఈ సంవత్సరం రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపుల వాటా 12 శాతం వద్ద నిలకడగా ఉన్నప్పటికీ, వడ్డీ చెల్లింపులు గత ఏడాది కంటే ₹886 కోట్లు (9 శాతం) పెరిగాయి. ప్రధానంగా, అంతర్గత ఋణాలపై వడ్డీలో పెరుగుదల (₹885 కోట్లు) ఉంది. ఐతే, ఇది స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) అంచనా (₹10,790 కోట్లు) కంటేనూ, పదమూడవ ఆర్థిక సంఘం అంచనా (₹11,025 కోట్లు) కన్నా కూడా తక్కువగానే ఉంది. 8.47 నుంచి 9.25 శాతం వరకూ వడ్డీతో కూడిన మార్కెట్ ఋణాలు (₹15,500 కోట్లు) ఈ సంవత్సరపు ప్రధాన ఋణ వనరు.

### 1.7.2.3 పింఛన్లు

రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదార్లకు ప్రస్తుత సంవత్సరం పింఛన్లు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపుల కోసం అయిన ఖర్చు ₹11,110 కోట్లు. రెవెన్యూ రాబడులలో ఇది 12 శాతం. ఇవి గత సంవత్సరపు చెల్లింపుల (₹9,609 కోట్లు) కంటే ₹1,501 కోట్ల మేర పెరిగాయి. ఈ ఏడాది ఈ అంశంపై అయిన ఖర్చు, బడ్జెట్ అంచనాలు (₹9693 కోట్లు) కంటే ఎక్కువగానూ, 13వ ఆర్థిక సంఘం అంచనాల (₹8,527 కోట్లు) కంటే ఎక్కువగానూ ఉంది. **ఐతే, రాబోయే సంవత్సరాలలో, ప్రతి ఏటా చెల్లించాల్సి ఉన్న పింఛను మొత్తాలను బీమా గణన (యాక్చూరియల్) ప్రాతిపదికన లెక్కగట్టాలని ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అలా లెక్కించలేదు.**

*కాంట్రిబ్యూటరీ పింఛను పథకం*

రాష్ట్ర ప్రభుత్వం, 2004 సెప్టెంబరు 1 తరువాత నియుక్తులైన ఉద్యోగుల కోసం కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని ప్రవేశ పెట్టింది. మార్గదర్శకాల ప్రకారం, ప్రతి ఉద్యోగి, ప్రతి నెలలోనూ తన మూల వేతనం, కరవు భత్యంల నుండి 10 శాతం తప్పనిసరిగా ఈ పింఛను కోసం చెల్లించాలి. దీనికి సమాన మొత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా చెల్లిస్తుంది. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్.ఎస్.డి.ఎల్.) ఈ పథకానికి సంబంధించిన రికార్డులను భద్రపరచే కేంద్రీయ సంస్థగా వ్యవహరిస్తుంది. ఉద్యోగుల, ప్రభుత్వ వాటాల వివరాలను ఎన్.ఎస్.డి.ఎల్.కూ, చెల్లించిన మొత్తాలను కొత్త పింఛను పథకం ట్రస్టు (ట్రస్టు) నియమించిన ఫండ్ మేనేజర్లకూ పంపించాలి. ప్రభుత్వం, ఎన్.ఎస్.డి.ఎల్.తో 2008 నవంబరు 21న, కొత్త పింఛను పథకం ట్రస్టుతో 2009 సెప్టెంబరు 15న ఒప్పందాలను కుదుర్చుకుంది. ప్రస్తుత సంవత్సరం ఉద్యోగులు తమ వాటాగా చెల్లించిన మొత్తం ₹226.64 కోట్లు కాగా, ప్రభుత్వం తన వాటాగా చెల్లించిన మొత్తం ₹126.84 కోట్లు. ఆర్థిక పద్దుల ప్రకారం, 2012 మార్చి 31 నాటికి దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకూ చెల్లించాల్సిన పూర్తి మొత్తం ₹894 కోట్లు (₹226.64 కోట్లను కూడా కలుపుకుని). ఫండ్ మేనేజర్లకు ప్రభుత్వం ఈ మొత్తాన్ని ఇప్పటికీ బదిలీ చేయలేదు.

ఫండ్ మేనేజరుకు బకాయిలను బదిలీ చేసేనాటి వరకూ, సాధారణ భవిష్య నిధి (జి.పి.ఎఫ్.) జమలకు వర్తించే వడ్డీ రేటుతో, ఈ పథకం కింద చెల్లించే వాటాల మొత్తాలకు కూడా ప్రభుత్వం వడ్డీని చెల్లించాలని 13వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. చెల్లించాల్సిన వడ్డీని లెక్కించి, ఉద్యోగుల అకౌంట్లకు బదిలీ చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 నవంబరు). **వాటాలను ఫండ్ మేనేజరుకు ఇప్పటి వరకూ బదిలీ చేయకపోవడం వలన ఈ పథకం కింద ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు.**

### 1.7.2.4 సబ్సిడీలు

ప్రస్తుత సంవత్సరంలో సబ్సిడీలపై చేసిన మొత్తం వ్యయం ₹7,313 కోట్లు. ఇందులో బియ్యంపై సబ్సిడీ ₹2,280 కోట్లు (31 శాతం), విద్యుత్‌పై సబ్సిడీ ₹4,300 కోట్లు (59 శాతం), ఇతర సబ్సిడీలు ₹733 కోట్లు (10 శాతం) ఉన్నాయి. సబ్సిడీల వ్యయం గత సంవత్సరం కంటే ₹770 కోట్ల (12 శాతం) మేర పెరిగినప్పటికీ, ఎమ్.ఇ.ఎఫ్.ఎస్. అంచనాల (₹10,724 కోట్లు) కంటే తక్కువగానే ఉంది.

### 1.7.3 స్థానిక సంస్థలకూ, ఇతర సంస్థలకూ ఆర్థిక సాయం

#### 1.7.3.1 స్థానిక సంస్థలు, ఇతర సంస్థల గురించి పరిచయం

దేశంలో భాగస్వామ్య పాలనావ్యవస్థను పెంపొందించడానికి పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల వంటి స్థానిక స్వయం పాలక సంస్థలకు అధికారాలను అప్పగించాలని భారత ప్రభుత్వం 73వ, 74వ రాజ్యాంగ సవరణలను చేసింది. అంతేకాకుండా, ఆర్థిక సంఘాల ద్వారా భారత ప్రభుత్వం నిధులను అందజేస్తూ, కీలకమైన సాంఘిక-ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించింది. ఈ స్థానిక సంస్థలు స్వయం పాలక సంస్థలుగా కార్యకలాపాలు నిర్వహించేందుకూ, భారత రాజ్యాంగంలోని 11వ, 12వ షెడ్యూళ్ళలో పేర్కొన్న వాటితో సహా ఆర్థికాభివృద్ధికీ, సామాజిక న్యాయానికీ దోహదపడే పలు పథకాలను అమలు చేసేందుకు తగిన అధికారాలు, విధులు, బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు అప్పగించాలి.

రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994 ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో మూడంచెల పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో నగరపాలక సంస్థల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థల చట్టం-1994ను చేసింది. పురపాలక సంస్థల పాలనా వ్యవహారాలు ఆంధ్రప్రదేశ్ పురపాలక సంస్థల చట్టం-1965 ప్రకారం జరుగుతాయి.

ప్రతి ఐదేళ్ళకొకసారి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని పైన పేర్కొన్న చట్టాలన్నీ నిర్దేశిస్తున్నాయి. రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలకు 2006 జూలై-ఆగస్టులోనూ, పట్టణ స్థానిక సంస్థలకు 2005 సెప్టెంబరులోనూ చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. ఫలితంగా, స్థానిక సంస్థలకు కనీస అవసరాల గ్రాంట్లు, పనితీరు ప్రాతిపదికన ఇచ్చే గ్రాంట్ల రూపేణా భారత ప్రభుత్వం ₹1044 కోట్లను మంజూరు చేసినప్పటికీ, కేవలం ₹420 కోట్లు మాత్రమే రాష్ట్రానికి అందాయి.

#### 1.7.3.2 స్థానిక సంస్థలకు నిధులు, విధులు, అధికారాల బదిలీ

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసేందుకు, వాటికి బదిలీ చేయడానికి 29 అంశాలను 73వ రాజ్యాంగ సవరణ చట్టం, 1992లోని 11వ షెడ్యూల్‌లో చేర్చారు. 2007-08లో రాష్ట్ర ప్రభుత్వం 10 అంశాలకు[7] సంబంధించిన విధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేసింది.

పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేయడానికి, 74వ రాజ్యాంగ సవరణ చట్టం గుర్తించిన 18 అంశాలకు సంబంధించిన విధులను , రాజ్యాంగపు 12వ షెడ్యూలులో చేర్చారు. అగ్ని మాపక సేవలు తప్ప, ఈ షెడ్యూలులో చేర్చిన అన్ని విధులూ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ అయ్యాయి.

#### 1.7.3.3 జమా ఖర్చుల లెక్కల ఏర్పాటు

పంచాయతీరాజ్ సంస్థలు అకౌంట్లను నగదు ప్రాతిపదికన నిర్వహిస్తాయి. భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌తో సంప్రదించి, భారత ప్రభుత్వం ఒక నమూనా అకౌంటింగ్ విధానాన్ని నిర్దేశించింది. పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి కమీషనరు 2011 ఫిబ్రవరిలో తెలిపిన సమాచారం ప్రకారం, ఎన్.ఐ.సి. అభివృద్ధి చేసిన "పంచాయతీరాజ్ సంస్థల అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ (పి.ఆర్.ఐ.ఎ.సాఫ్ట్)"ను అనుసరించాలని 2010 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. మొదట జిల్లా ప్రజా పరిషత్‌లలోనూ, ఆతర్వాత మండలాల్లోనూ, ఇ-పంచాయతీలుగా ప్రకటించిన 475 గ్రామ పంచాయతీలలోనూ ఈ సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయాలని అనుకున్నారు.

---

[7] (i) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ, ( ii) పశు సంవర్ధకం, పాడి, కోళ్ళ పరిశ్రమ, ( iii) మత్స్య పరిశ్రమ, (iv ) గ్రామీణాభివృద్ధి, ( v) తాగు నీరు, పారిశుద్ధ్యం, ( గ్రామీణ నీటి సరఫరా), (vi ) ప్రాథమిక, మాధ్యమిక, వయోజన విద్య, (vii ) ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డిస్పెన్సరీలు, కుటుంబ సంక్షేమం, (viii ) సాంఘిక సంక్షేమం, (ix) వెనుకబడిన తరగతుల సంక్షేమం, (x) మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం

భారత ప్రభుత్వపు పట్టణాభివృద్ధి, పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ, భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్, అకౌంట్లలో పారదర్శకత, వాటిపై నియంత్రణ ఉండడానికి 2004 డిసెంబరులో 'డబుల్ ఎంట్రీ విధానం'తో కూడిన 'జాతీయ మున్సిపల్ అకౌంట్ల మాన్యువల్'ను రూపొందించారు. రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా మార్పులు చేసుకుని ఈ మాన్యువల్‌ను అనుసరించాల్సిందిగా 2005 మేలో రాష్ట్రాలను కోరడమైంది. తదనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం 2005 మేలో ఒక స్టీరింగ్ కమిటీని నియమించింది. 2006-07లో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అకౌంట్ల మాన్యువల్ ను రూపొందించారు. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలన్నీ దీన్ని అనుసరించాలని 2007 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. అదేవిధంగా, భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ బడ్జెట్ మాన్యువల్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అసెట్ మాన్యువల్‌లను పట్టణ స్థానిక సంస్థల ద్వారా అమలు చేయడానికి 2007 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

### 1.7.3.4 పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆడిట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆడిట్ చట్టం-1989 ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలకు చట్టబద్దమైన ఆడిటర్‌గా వ్యవహరించే రాష్ట్ర ఆడిట్ సంచాలకులు, మొత్తం 22,927 పంచాయతీరాజ్ సంస్థలు, 124 పట్టణ స్థానిక సంస్థలకు ప్రతి ఏటా ఆడిట్ నిర్వహించాలి. ఈ చట్టంలోని సెక్షను 11(2) ప్రకారం, రాష్ట్ర ఆడిట్ సంచాలకులు, రాష్ట్ర ఆడిట్ మరియు సమీక్షల సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్ర శాసన సభకు సమర్పించాలి. రాష్ట్ర ఆడిట్ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి పరిపాలనా నియంత్రణ కింద విధులను నిర్వహిస్తుంది. ఈ ప్రభుత్వ శాఖ పరిధిలో 6 ప్రాంతీయ కార్యాలయాలు, 22 జిల్లా కార్యాలయాలు, 156 ఉప కార్యాలయాలు, పలు రెసిడెంట్ కార్యాలయాలు ఉన్నాయి.

### 1.7.3.5 ఆర్థిక సాయం

గత నాలుగేళ్ళతో పోలిస్తే, ఈ ఏడాది స్థానిక సంస్థలకూ, ఇతర సంస్థలకూ గ్రాంట్లు, లోన్ల రూపేణా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం వివరాలు **పట్టిక 1.6** లో ఉన్నాయి.

**పట్టిక 1.6 : స్థానిక సంస్థలు మొదలగు వాటికి ఆర్థిక సాయం**

(₹ కోట్లలో)

| | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| విద్యా సంస్థలు (ఎయిడెడ్ పాఠశాలలు, ఎయిడెడ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వగైరా) | 1,876 | 1,820 | 1,994 | 2,876 | 7,178 |
| నగర పాలక, పురపాలక సంస్థలు | 2,699 | 4,105 | 3,142 | 3,671 | 3,361 |
| జిల్లా పరిషత్తులు, ఇతర పంచాయితీరాజ్ సంస్థలు | 921 | 2,503 | 1,867 | 1,745 | 3,023 |
| అభివృద్ధి సంస్థలు | 3,715 | 11,791 | 7,481 | 8,363 | 11,341 |
| ఆసుపత్రులు, ఇతర ఛారిటబుల్ సంస్థలు | 600 | 1,152 | 1,393 | 1,721 | 1,192 |
| స్వయంపాలక సంస్థలు | -- | -- | -- | -- | 1,473 |
| సహకార సంస్థలు | -- | -- | -- | -- | 52 |
| ఇతర సంస్థలు[8] | 8,851 | 3,436 | 3,965 | 4,538 | 5390 |
| **మొత్తం** | **18,662** | **24,807** | **19,842** | **22,914** | **33,010** |
| **రెవెన్యూ ఖర్చులో ఈ ఆర్థిక సాయం శాతం** | **34.57** | **40.11** | **31.27** | **29.18** | **36.50** |

*మూలం : ఆర్థిక పద్దులు*

[8] ఇతర సంస్థలలో, ఈ ఏడాది అడహాక్ గ్రాంటు, వన్‌టైమ్ గ్రాంటు పొందిన సంస్థలున్నాయి

2011-12 లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు గ్రాంట్లు, లోన్లతో కలిపి అందించిన ఆర్థిక సాయం (₹33,010 కోట్లు) గత ఏడాది (₹22,914 కోట్లు) కంటే ₹10,096 కోట్లు (44.06 శాతం) పెరిగింది. ఇది రెవెన్యూ వ్యయంలో 37 శాతం ఉంది. పై పట్టికను పరిశీలిస్తే, పంచాయతీరాజ్ సంస్థలకు, విద్యా సంస్థలకు, అభివృద్ధి సంస్థలకు ఇచ్చిన ఆర్థిక సాయం మొత్తాలలో వ్యత్యాసాలున్నట్లు తెలుస్తోంది. 2011-12 లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థల కిచ్చిన ప్రణాళికా గ్రాంట్లు ₹13,190 కోట్లు, ప్రణాళికేతర గ్రాంట్లు ₹15,058 కోట్లు, కాగా లోన్లు రూపేణా ఇచ్చింది ₹4,762 కోట్లు. వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే ఇందిరమ్మ పింఛన్లకు ₹1,105 కోట్లు, డ్వాక్రా బృందాలు తీసుకున్న ఋణాలపై వడ్డీ సబ్సిడీకి ₹710 కోట్లు, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకానికి ₹494 కోట్లు, రాజీవ్ విద్యా మిషన్‌కు ₹974 కోట్లు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు ₹400 కోట్లు, జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ నవీకరణ పథకానికి ₹1,045 కోట్లు, ఇంకా మధ్యాహ్న భోజన పథకానికి ₹697 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులకు ₹277 కోట్లు - ఈ ఆర్థిక సాయాన్ని పొందిన ప్రధాన జాబితాలో ఉన్నాయి.

## 1.8 ఖర్చుల నాణ్యత

### 1.8.1 ప్రజా వ్యయం చాలుబడి

సాంఘిక రంగానికీ, ఆర్థిక మౌలిక వసతులకూ సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిన వ్యయబాధ్యతలు ప్రధానంగా రాష్ట్రాలకే చెందిన అంశాలు. మానవ వనరుల వికాసం కోసం, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఆరోగ్యం వంటి కీలక సామాజిక సేవలపై ఖర్చును పెంచుకోవాల్సి ఉంది. ఒక రంగంలో వ్యయం, మొత్తం వ్యయంతో పోల్చినప్పుడు జాతీయ సగటుకన్నా తక్కువగా ఉంటే ఆ రంగంలో ద్రవ్య ప్రాధాన్యత తక్కువ స్థాయిలో ఉన్నట్లు భావించాలి. 2011-12 లో అభివృద్ధి వ్యయం, సాంఘిక వ్యయం, క్యాపిటల్ వ్యయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య ప్రాధమ్యాలను **పట్టిక 1.7** లో విశ్లేషించడమైంది.

**పట్టిక 1.7 : 2008-09 మరియు 2011-12 లలో రాష్ట్ర ద్రవ్య ప్రాధమ్యాలు**

(శాతంలో)

| రాష్ట్ర ద్రవ్య ప్రాధమ్యాలు | ఎ.ఇ./ జి.ఎస్.డి.పి. | డి.ఇ.# / ఎ.ఇ. | ఎస్.ఎస్.ఇ./ ఎ.ఇ. | సి.ఇ./ ఎ.ఇ. | విద్య/ ఎ.ఇ. | ఆరోగ్యం/ ఎ.ఇ. |
|---|---|---|---|---|---|---|
| @2008-09 లో సాధారణ వర్గం రాష్ట్ర సగటు (నిష్పత్తి) | 17.00 | 67.09 | 34.28 | 16.47 | 15.41 | 3.97 |
| 2008-09 లో ఆంధ్రప్రదేశ్ సగటు (నిష్పత్తి) | 18.19 | 74.62 | 33.49 | 13.71 | 9.58 | 3.87 |
| 2011-12 లో సాధారణ వర్గం రాష్ట్ర సగటు (నిష్పత్తి) | 16.09 | 66.44 | 36.57 | 13.25 | 17.18 | 4.30 |
| 2011-12 లో ఆంధ్రప్రదేశ్ సగటు (నిష్పత్తి) | 16.15 | 70.39 | 35.60 | 12.58 | 13.80 | 4.67 |

@ : సాధారణ వర్గం రాష్ట్రాల సగటు నిష్పత్తిని ఢిల్లీ, గోవా, పుదుచ్చేరి మూడు రాష్ట్రాల మినహా మిగిలిన 16 రాష్ట్రాల (మొత్తం 19కి గాను) సమాచారం ఆధారంగా లెక్కించడమైంది

ఎ.ఇ. : మొత్తం వ్యయం డి.ఇ. : అభివృద్ధి వ్యయం ఎస్.ఎస్.ఇ. : సామాజిక రంగంపై వ్యయం సి.ఇ. : క్యాపిటల్ వ్యయం

# అభివృద్ధి వ్యయంలో అభివృద్ధి రెవెన్యూ వ్యయం, అభివృద్ధి క్యాపిటల్ వ్యయం, చెల్లించిన ఋణాలు, అడ్వాన్సులు ఉన్నాయి

*మూలం : ఆర్థిక పద్దులు; రాష్ట్ర స్థూల ఉత్పత్తికి సంబంధించిన సమాచారం రాష్ట్ర అర్థ-గణాంక సంచాలకుల కార్యాలయం నుండి పొందినది*

ఆంధ్రప్రదేశ్‌ను సాధారణ వర్గం రాష్ట్రాలతో పోల్చగా ఈ దిగువ విషయాలు తెలిశాయి :

- *2008-09, 2011-12 సంవత్సరాలలో మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం నిష్పత్తి సాధారణ వర్గం రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది.*
- *2008-09 లో రాష్ట్రం సామాజిక రంగంపై చేసిన ఖర్చు (33.49 శాతం), ప్రత్యేకించి ఆరోగ్యం (3.87 శాతం), విద్య (9.58 శాతం) సాధారణ వర్గం రాష్ట్రాల కన్నా తక్కువగా ఉంది. ఐతే, 2011-12 లో సామాజిక రంగం మీద (35.60 శాతం), ముఖ్యంగా, ఆరోగ్యం (4.67 శాతం)పై వ్యయం పెరిగి అనుకూలంగా ఉంది కానీ, విద్య (13.80 శాతం) పై సాధారణ వర్గం రాష్ట్రాల (17.18 శాతం) కన్నా తక్కువగా ఉంది.*
- క్యాపిటల్ వ్యయం వాటా (13.71 శాతం) 2008-09లో సాధారణ వర్గం రాష్ట్రాల (16.47 శాతం) కంటే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువగా ఉంది. ఇది ఈ ఏడాది (12.58 శాతం) తగ్గింది.

విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ద్రవ్య ప్రాధాన్యతను కల్పించాల్సి ఉంది. దీనికి తోడు, పెరుగుతున్న ద్రవ్య బాధ్యతలకు దన్నుగా సంపదలను పెంపొందించుకునేలా క్యాపిటల్ వ్యయం కూడా పెంచాలి.

### 1.8.2 ఖర్చుల వినియోగపు సమర్థత

ప్రణాళికలలో సామాజిక - ఆర్థికాభివృద్ధి పనులపై ప్రభుత్వ వ్యయానికున్న ప్రాధాన్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వాలు తగు వ్యయ హేతుబద్ధీకరణ చర్యలు చేపట్టి, కోర్ పబ్లిక్ గూడ్స్, మెరిట్ గూడ్స్[9]ను సమకూర్చటంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాల్సిన అవసరముంది. అభివృద్ధి వ్యయం[10] కోసం కేటాయింపులను పెంచడమే కాకుండా, క్యాపిటల్ వ్యయం మరియు మొత్తం వ్యయం (మరియు/లేదా జి.ఎస్.డి.పి)ల నిష్పత్తి, దీనికి సరితూగేలా ప్రస్తుతం ఉన్న సామాజిక, ఆర్థిక సేవల ఆపరేషన్ - నిర్వహణ (ఓ&ఎమ్)పై చేస్తున్న రెవెన్యూ వ్యయం వాటాలు కూడా ఖర్చుల వినియోగపు సమర్థతను ప్రతిబింబిస్తాయి. మొత్తం ఖర్చు (మరియు/లేదా జి.ఎస్.డి.పి.) తో ఈ అంశాల నిష్పత్తి ఎంత ఎక్కువగా ఉంటే ఖర్చుల నాణ్యత అంత మెరుగ్గా ఉన్నట్లు అర్థం. ఈ ఏడాది రాష్ట్రం మొత్తం వ్యయాన్ని బడ్జెట్ అంచనాలతోనూ, గత సంవత్సరాల వ్యయాలతోనూ పోలిస్తే అభివృద్ధి వ్యయాల ధోరణులను **చార్టు 1.10** లో చూపడమైంది.

**చార్టు 1.10 : అభివృద్ధి వ్యయం**




*మూలం : ఆర్థిక పద్దులు*

2011-12 లో అభివృద్ధి వ్యయం నిరుటి కంటే ₹12,837 కోట్లు (19.48 శాతం) పెరిగి, మొత్తం వ్యయంలో 71 నుంచి 75 శాతం ఉంది. అభివృద్ధి రెవెన్యూ వ్యయం గత సంవత్సరం కంటే ₹8,666 కోట్ల మేర పెరిగింది. సాంఘిక సేవలు, ఆర్థిక సేవలకు సంబంధించిన అన్ని అంశాలలోనూ పెరుగుదల నమోదు అయ్యింది. ఇది మొత్తం వ్యయంలో 51 నుండి 57 శాతం వరకూ ఉంది.

---

[9] పేజీ 104 లోని పారిభాషిక పదకోశం చూడండి

[10] పేజీ 104 లోని పారిభాషిక పదకోశం చూడండి

ఈ సంవత్సరం అభివృద్ధి క్యాపిటల్ వ్యయం నిరుటి కంటే ₹2,623 కోట్లు (24 శాతం) పెరగగా, అభివృద్ధి లోన్లు, అడ్వాన్సులు ₹1,548 కోట్లు (48 శాతం) పెరిగాయి. అభివృద్ధి క్యాపిటల్ వ్యయంలో పెరుగుదల ప్రధానంగా ఆర్థిక సేవల (₹2,403 కోట్లు)లో నీటిపారుదల, వరదల నియంత్రణ (₹1,708 కోట్లు) కింద ఉంది. 2011-12లో, మొత్తం వ్యయంలో సాంఘిక సేవల వాటా 36 శాతంగానూ, ఆర్థిక సేవల వాటా 32 శాతంగానూ ఉంది.

ఎంపిక చేసిన కొన్ని సామాజిక, ఆర్థిక సేవల నిర్వహణపై క్యాపిటల్ ఖర్చు, రెవెన్యూ ఖర్చులోని అంశాల వివరాలు **పట్టిక 1.8** లో ఉన్నాయి.

### పట్టిక 1.8: ఎంపిక చేసిన కొన్ని సామాజిక, ఆర్థిక సేవలపై ఖర్చుల వినియోగంలో సమర్థత

*(శాతంలో)*

| సామాజిక/ఆర్థిక మౌలిక వసతులు | 2010-11 | | | 2011-12 | | |
|---|---|---|---|---|---|---|
| | టి.ఇ. తో సి.ఇ. నిష్పత్తి | ఆర్.ఇ. లో వాటా | | టి.ఇ. తో సి.ఇ. నిష్పత్తి | ఆర్.ఇ. లో వాటా | |
| | | ఎస్.&డబ్ల్యు. | ఓ.&ఎమ్. | | ఎస్.&డబ్ల్యు. | ఓ.&ఎమ్. |
| **సామాజిక సేవలు (ఎస్.ఎస్.)** | | | | | | |
| సాధారణ విద్య | 0.40 | 68.26 | 0.14 | 0.80 | 73.86 | 0.10 |
| ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | 0.43 | 49.12 | 0.56 | 1.45 | 44.76 | 0.39 |
| నీటి సరఫరా, పారిశుధ్యం, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి | 6.22 | 17.12 | 3.00 | 4.45 | 22.29 | 0.39 |
| **మొత్తం (ఎస్.ఎస్.)** | **1.85** | **38.02** | **0.46** | **2.13** | **39.59** | **0.16** |
| **ఆర్థిక సేవలు (ఇ.ఎస్.)** | | | | | | |
| వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలు | 1.02 | 31.62 | 0.60 | 1.81 | 24.37 | 1.99 |
| నీటిపారుదల, వరదల నియంత్రణ | 58.16 | 4.86 | 9.46 | 61.00 | 5.87 | 11.41 |
| విద్యుచ్ఛక్తి, ఇంధనం | 0.57 | 0.30 | 0.11 | 0.74 | 0.35 | 0.12 |
| రవాణా | 50.77 | 2.67 | 66.54 | 42.37 | 7.00 | 74.31 |
| **మొత్తం (ఇ.ఎస్.)** | **34.97** | **12.60** | **6.81** | **36.47** | **12.19** | **10.21** |
| **మొత్తం (ఎస్.ఎస్. + ఇ.ఎస్.)** | **12.28** | **18.75** | **1.87** | **18.43** | **29.46** | **3.88** |

టి.ఇ.: మొత్తం వ్యయం; సి.ఇ.: క్యాపిటల్ వ్యయం; ఆర్.ఇ.: రెవెన్యూ వ్యయం; ఎస్.&డబ్ల్యు.: జీతాలు మరియు వేతనాలు; ఓ.&ఎమ్.: ఆపరేషన్ మరియు నిర్వహణ.

*మూలం : ఆర్థిక పద్దులు*

క్యాపిటల్ వ్యయం ప్రాధాన్యత గురించి రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దిష్టమైన నియమాలేవీ లేనప్పటికీ, 2011-12 లో క్యాపిటల్ ఖర్చు పెరగడం రాష్ట్రంలో ఆస్తుల కల్పనకు ప్రాధాన్యతనివ్వడాన్ని సూచిస్తోంది. సాధారణ విద్య, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా-పారిశుధ్యం అంశాలకింద సామాజిక సేవలపై వ్యయ శాతం 2.13 శాతం మాత్రమే. సామాజిక రంగంలోని నిర్దిష్ట కార్యక్రమాలకు కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడమూ లేదా అసలే విడుదల చేయకపోవడమూ జరిగింది. ఫలితంగా, అధ్యాయం-2లో వివరించిన విధంగా, నిధులను కేటాయించిన ప్రయోజనాలు నెరవేరలేదు. 2011-12 లో ఆపరేషన్-నిర్వహణ ఖర్చు (₹2,495 కోట్లు) రెవెన్యూ వ్యయంలో 2.76 శాతం ఉంది.

## 1.9 ప్రభుత్వం చేసిన ఖర్చులు, పెట్టుబడులపై ఆర్థిక విశ్లేషణ

ద్రవ్య బాధ్యతల చట్టాన్ని అమలు చేయటం మొదలుపెట్టిన తర్వాతి కాలంలో, రాష్ట్ర ప్రభుత్వం తన ద్రవ్యలోటును (మరియు ఋణాలను) స్వల్ప స్థాయిల్లో ఉంచుతూనే, క్యాపిటల్ ఖర్చు/పెట్టుబడుల (లోన్లు, అడ్వాన్సులతో సహా) అవసరాలను కూడా నెరవేర్చవలసి ఉంది. అంతే కాకుండా, మార్కెటు ఆధారిత వనరుల పైనే పూర్తిగా ఆధారపడే క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం, తన పెట్టుబడులపై తగిన ప్రతిఫలం వచ్చేలాగానూ, ఋణాల రూపంలో తెచ్చిన నిధులపై చేసే ఖర్చు భారాన్ని పరోక్షంగా అవ్యక్త సబ్సిడీల రూపంలో బడ్జెట్‌పై మోపకుండా ఆ ప్రతిఫలం నుండే రాబట్టుకునే లాగానూ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాదిలోనూ, గత సంవత్సరాల్లోనూ ప్రభుత్వ పెట్టుబడులు, ఇతర క్యాపిటల్ ఖర్చులపై విస్తృతమైన ఆర్థిక విశ్లేషణను ఈ విభాగంలో ఇవ్వడమైంది.

### 1.9.1 అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు

అసంపూర్తిగా ఉన్న పనుల్లో నిధులు స్తంభించిపోవటం ఖర్చులలోని నాణ్యత లేమిని సూచిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం 2012 మార్చి 31 నాటికి పూర్తి కావలసిన **228 ప్రాజెక్టులు/పనులు (గత ఏడాది 188 ప్రాజెక్టులు/పనులు) అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు/పనులపై 2012 మార్చి 31 నాటికి మొత్తం ₹49,516 కోట్లు (గత ఏడాది ₹46,330 కోట్లు) ఖర్చయ్యింది.** ఇంతే కాక, అసంపూర్తిగా ఉన్న మొత్తం 228 ప్రాజెక్టులు/ పనులలో, ప్రభుత్వం 54 ప్రాజెక్టులు/పనుల తొలి అంచనాలను సవరించి, అంచనా వ్యయాన్ని ₹87,559 కోట్లకు పెంచింది. ఈ ప్రాజెక్టులు/పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయకపోవటంతో ఖర్చు పెరగటమే కాకుండా ఆశించిన ప్రయోజనాలు చాలా కాలంగా రాష్ట్రానికి ఒనగూరడం లేదు.

₹కోటి కంటే ఎక్కువ ఖర్చుతో కూడినవాటిలో, అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టుల వివరాలు, శాఖల వారీగా **పట్టిక 1.9**లో ఇవ్వడమైంది. భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల వివరాలు ***అనుబంధం 1.8*** లో ఉన్నాయి.

**పట్టిక 1.9 : శాఖల వారీగా అసంపూర్ణ ప్రాజెక్టులు/పనుల వివరాలు**

(₹ కోట్లలో)

| పనుల స్వభావం | అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల సంఖ్య | తొలి అంచనా | సవరించిన అంచనా | అదనపు భారం | 2012 మార్చి 31నాటికి మొత్తం వ్యయం |
|---|---|---|---|---|---|
| *నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ* # | | | | | |
| సాగునీటి ప్రాజెక్టులు | 72 | 57,670 | 86,512 | 20,142 (16 ప్రాజెక్టులు) | 48,156 |
| *రోడ్లు, వంతెనల శాఖ* # | | | | | |
| రోడ్లు, వంతెనలు | 42 | 645 | 751 | 59 (8 పనులు) | 441 |
| *పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ* * | | | | | |
| రోడ్లు | 99 | 252 | 296 | --- | 101 |
| *గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం శాఖ* * | | | | | |
| నీటి సరఫరా - పారిశుధ్యం | 15 | 1,387 | --- | --- | 818 |
| **మొత్తం** | **228** | **59,954** | **87,559** | **20,201** | **49,516** |

*మూలం: # నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇచ్చిన సమాచారం; * ఆర్థిక పద్దులు 2011-12*

వీటిలో కొన్ని ప్రాజెక్టులను మచ్చుకు తనిఖీ చేయగా, భూసేకరణ ప్రక్రియ, డిజైనులు-డ్రాయింగులను ఖరారు చేయడం, ఆమోదించడం, టెండరు ప్రక్రియలు మొదలైన వాటికి సుదీర్ఘ సమయం తీసుకోవడం వలన ప్రాజెక్టు పనులు పూర్తికావడానికి చాలా ఎక్కువ సమయం పడుతోందనీ, చాలా కేసులలో సకాలంలో పనులు పూర్తి కాని కారణంగా క్యాపిటల్ పనులకు కేటాయించిన నిధులు ఏడాదిలోపు ఖర్చవకుండా నిరుపయోగంగా మిగిలిపోయాయని వెల్లడైంది.

### 1.9.2 పెట్టుబడులు- ప్రతిఫలం

రాష్ట్ర ప్రభుత్వం 2012 మార్చి 31 నాటికి చట్టబద్ధమైన కార్పొరేషన్లు, ప్రభుత్వ కంపెనీలు, జాయింట్ స్టాకు కంపెనీలు, సహకార సంస్థలలో ₹6,093 కోట్లను పెట్టుబడిగా పెట్టింది. ఈ కార్పొరేషన్లు/కంపెనీలలో పెట్టిన పెట్టుబడిపై వచ్చిన ప్రతిఫలం వివరాలను **పట్టిక 1.10**లో ఇవ్వడమైంది.

**పట్టిక 1.10 : పెట్టుబడులపై ప్రతిఫలం**

| పెట్టుబడి/ప్రతిఫలం/ఋణాలపై ఖర్చు | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| ఏడాది ముగిసే నాటికి పెట్టుబడి (₹కోట్లలో) | 5,931 | 5,979 | 6,003 | 6,046 | 6,093 |
| ప్రతిఫలం (₹కోట్లలో) | 12 | 19 | 23 | 39 | 52 |
| ప్రతిఫలం (శాతం) | 0.20 | 0.32 | 0.38 | 0.65 | 0.85 |
| ప్రభుత్వం తీసుకున్న ఋణాలపై సగటు వడ్డీ రేటు (శాతం) | 8.25 | 7.88 | 7.86 | 7.60 | 7.40 |
| వడ్డీ రేటు, ప్రతిఫలాల మధ్య వ్యత్యాసం (శాతం) | 8.05 | 7.57 | 7.48 | 6.95 | 6.55 |

*మూలం : ఆర్థిక పద్దులు*

ప్రభుత్వం 2011-12లో వివిధ కార్పొరేషన్లు/కంపెనీలలో పెట్టిన ₹6,093 కోట్ల పెట్టుబడుల మీద ₹52 కోట్ల ప్రతిఫలం పొందింది. **2007-12 మధ్య కాలంలో పెట్టుబడుల మీద సగటు ప్రతిఫలం రేటు 0.48 శాతం కాగా, ఇదే సమయంలో చెల్లించిన సగటు వడ్డీ రేటు 7.8 శాతం.**

2012 మార్చి నాటికి 50 కంపెనీలు/కార్పొరేషన్లు (47 ప్రభుత్వ కంపెనీలు, 3 చట్టబద్ధమైన కార్పొరేషన్లు) పనిచేస్తున్నాయి. పద్దులు ఖరారు అయిన సంవత్సరం వరకూ 11[11] కంపెనీలు/కార్పొరేషన్లు ₹957 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. పేరుకు పోయిన నష్టం ₹5,979 కోట్లు ఉంది. అధిక నష్టాలను చవిచూసిన సంస్థల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (₹3,554 కోట్లు), ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (₹1,984 కోట్లు) ఉన్నాయి. ఏడు కంపెనీలు/కార్పొరేషన్లు ₹3,805 కోట్ల ప్రతికూల నికర మూల్యం కలిగి ఉన్నాయి. అంతేకాకుండా, సి.ఏ.జి. ఆడిట్ వ్యాఖ్యలనూ, చట్టబద్ధ ఆడిటర్ల వ్యాఖ్యలనూ పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 50 కంపెనీలు/కార్పొరేషన్లకు సంబంధించి పద్దులు ఖరారు అయిన సంవత్సరాంతానికి (2008-09 నుంచి 2011-12) చూపుతున్న మొత్తం ₹280 కోట్ల నికర లాభం ,₹323 కోట్ల నికర నష్టంగా లెక్కతేలుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం1986-87[12] నాటికి, ₹10 విలువ గల 82.80 లక్షల ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడం ద్వారా సికింద్రాబాద్ లోని గోదావరి ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ సంస్థలో ₹8.28 కోట్ల పెట్టుబడిపెట్టింది. ఐతే, ఆ సంస్థలో ప్రభుత్వం తన పెట్టుబడులన్నీ 2002-03లో పూర్తిగా ఉపసంహరించుకున్నప్పటికీ, పెట్టుబడుల ఉపసంహరణ తాలూకు

---

[11] 1. ఏ.పి. గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్, 2. ఫ్యాబ్ సిటీ (ఇండియా) ప్రై. లిమిటెడ్, 3. ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఏ.పి. లిమిటెడ్, 4. దామోదర మినరల్స్ ప్రై. లిమిటెడ్, 5. ఆంధ్రప్రదేశ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ, 6. ది నైజాం షుగర్స్ లిమిటెడ్, 7. వైజాగ్ అపరెల్ పార్క్ ఫర్ ఎక్స్‌పోర్ట్, 8.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, 9.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, 10. ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఏ.పి. లిమిటెడ్, 11. ఏ.పి. అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్

[12] ఆర్థిక పద్దుల్లోని 14వ స్టేట్‌మెంట్‌లోని IV(36)వ అంశం ప్రకారం

మొత్తాలు ప్రభుత్వ పద్దులోకి ఇంకా జమ కాలేదు (2012 సెప్టెంబరు). ఫలితంగా, ప్రభుత్వ పెట్టుబడులను ₹8.28 కోట్ల మేర అధికంగా చూపడం జరిగింది.

రాష్ట్ర స్థాయి ప్రభుత్వ రంగ సంస్థలలో వాటా మూలధనం రూపంలో భారీగా పెట్టుబడులు పెట్టడం వలన ఆయా సంస్థల నుంచి సరైన ప్రతిఫలం ప్రభుత్వ ఖజానాలోకి వస్తుందని ఆశించడం జరుగుతుంది. ఇందుకు విరుద్ధంగా, ఈ సంస్థలలో పెట్టిన పెట్టుబడిమీద సగటు ప్రతిఫలం హీన స్థాయిలోనే కొనసాగుతుండడంవలన ఇవి రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండలుగా మారాయి.

## 1.9.3 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు

సహకార సంఘాలు, కార్పొరేషన్లు, కంపెనీలలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, వీటిలోని పలు సంస్థలకు ప్రభుత్వం లోన్లు, అడ్వాన్సులు కూడా అందజేస్తోంది. 2012 మార్చి 31 నాటికి ప్రభుత్వానికి రావాల్సి ఉన్న లోన్లు, అడ్వాన్సుల బకాయిలు, గత నాలుగేళ్ళలో పరిస్థితి **పట్టిక 1.11** లో ఉన్నాయి.

**పట్టిక 1.11 : రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన లోన్లపై వచ్చిన సగటు వడ్డీ**

**(₹ కోట్లలో)**

| లోన్ల మొత్తం/వడ్డీ రాబడులు/ఋణాలపై ఖర్చు | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | |
|---|---|---|---|---|---|---|
| | | | | | బడ్జెట్ అంచనాలు | వాస్తవ విలువలు |
| ప్రారంభ నిల్వ | 10,648 | 13,378 | 16,421 | 17,868 | -- | 21,011 |
| ఈ సంవత్సరం ఇచ్చిన మొత్తం | 2,921 | 3,413 | 1,590 | 3,315 | 3,808 | 4,983 |
| ఈ సంవత్సరం వసూలైన మొత్తం | 191 | 370 | 143 | 172 | 235 | 165 |
| **ముగింపు నిల్వ** | **13,378** | **16,421** | **17,868** | **21,011** | **4,043** | **25,829** |
| ***ఇందులో*** నిబంధనలు, షరతులు ఖరారైన ఋణాల బకాయిలు | స.లే. | స.లే. | స.లే. | స.లే. | స.లే. | స.లే. |
| నికర పెరుగుదల | 2,730 | 3,043 | 1,447 | 3,142 | 3,573 | 4,818 |
| వడ్డీ రాబడి | 44 | 21 | 32 | 60 | -- | 95 |
| బకాయి ఉన్న లోన్లు, అడ్వాన్సులలో వడ్డీ రాబడుల శాతం | 0.33 | 0.13 | 0.18 | 0.29 | -- | 0.37 |
| బకాయి ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య బాధ్యతలలో వడ్డీ చెల్లింపుల శాతం | 7.79 | 7.54 | 7.44 | 7.17 | -- | 7.02 |
| వడ్డీ రాబడులు, వడ్డీ చెల్లింపుల మధ్య వ్యత్యాసం (శాతం) | (-)7.46 | (-)7.41 | (-)7.26 | (-)6.88 | -- | 6.65 |

*మూలం : ఆర్థిక పద్దులు; స.లే. : సమాచారం లేదు*

పట్టణాభివృద్ధి సంస్థలు (₹1,201 కోట్లు), రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (₹1,111 కోట్లు) ఈ సంవత్సరం అధికంగా ఋణాలు పొందాయి. మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు, పంచాయితీరాజ్ సంస్థలు మొదలైనవాటి నుంచి 2011-12 సంవత్సరాంతానికి ₹22,905 కోట్లు వసూలు కావలసి ఉంది. ఇందులో అసలు ₹17,557 కోట్లు కాగా వడ్డీ ₹5,348 కోట్లు. దీనిలో మూడేళ్ళకు పైగా బకాయిలో ఉన్న మొత్తం ₹15,037 కోట్లు (అసలు : ₹10,372 కోట్లు, వడ్డీ : ₹4,665 కోట్లు). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు 1999 జనవరిలో రెండు కంపెనీలుగా విడిపోయేనాటికి బకాయి ఉన్న ₹2,201 కోట్ల లోన్ల మొత్తంలో ₹561 కోట్ల లోనుకి సంబంధించి చెల్లించాల్సిన గడువు ఇప్పటికే ముగిసిపోయింది. బోర్డు ఆస్తులు, అప్పులను ప్రభుత్వం ఈ రెండు కంపెనీలకూ ఇంకా పంపకాలు చేయవలసి ఉంది. కాబట్టి, ప్రభుత్వం ఆసంస్థకు అప్పుగా ఇచ్చిన మొత్తాన్ని ఏ విధంగా వసూలు చేస్తుందనే విషయంపై స్పష్టత లేదు.

2012 మార్చి 31 నాటికి ప్రభుత్వ శాఖల రికార్డుల ప్రకారం, పెట్టిన పెట్టుబడులు, బకాయి ఉన్న ఋణాల వివరాలను ఇవ్వమని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ & ఎంటైటిల్మెంట్స్) పలుమార్లు కోరినప్పటికీ, సంబంధిత ప్రభుత్వ శాఖలు ఆ సమాచారాన్ని ఇవ్వలేదు. అందువలన, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ & ఎంటైటిల్మెంట్స్) కార్యాలయంలో అందుబాటులో ఉన్న పరిమిత వివరాల మేరకు పైన పేర్కొన్న సమాచారాన్ని సేకరించడం జరిగింది. **నిజానికి, వివిధ ప్రభుత్వ శాఖలు/సంస్థలకు ఇచ్చిన ₹17,337 కోట్ల ఋణాలలో బకాయిలు ఏమేరకు ఉన్నాయనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా రూఢి చేసుకోలేదు.** ఆ విధంగా ధృవీకరణ ఇంకా రాని అత్యంత పాత ఋణం1984-85 నాటిది. 2012 మార్చి 31 నాటికి ఈ విధంగా ఋణ బకాయిల మొత్తాన్ని ఇంకా ధృవీకరించవలసి ఉన్న వాటిలో గృహనిర్మాణ శాఖ (₹10,662 కోట్లు), ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థలకు ఇచ్చిన ఋణాలు (₹981 కోట్లు) ప్రధానమైనవి.

### 1.9.4 నగదు నిల్వలు, నగదు నిల్వల పెట్టుబడి

ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ₹3,486 కోట్లు భారత ప్రభుత్వ ట్రెజరీ బిల్లులలో పెట్టుబడి పెట్టింది. గత సంవత్సరం ఈ పెట్టుబడి ₹4,534 కోట్లు. ఈ సంవత్సరంలో నగదు నిల్వలు, వాటి నుంచి ప్రభుత్వం పెట్టిన పెట్టుబడుల వివరాలు **పట్టిక 1.12** లో ఉన్నాయి.

**పట్టిక 1.12 : నగదు నిల్వలు - వాటి పెట్టుబడి**

(₹ కోట్లలో)

| వివరాలు | 2011 ఏప్రియల్ 1 నాటికి | 2012 మార్చి 31 నాటికి | పెరుగుదల/ తగ్గుదల |
|---|---|---|---|
| నగదు నిల్వలు | 8,830 | 9,322 | 492 |
| నగదు నిల్వల నుంచి పెట్టుబడులు ('ఎ' నుండి 'డి' వరకు) | 4,534 | 3,486 | -1,048 |
| ఎ. భారత ప్రభుత్వ ట్రెజరీ బిల్లులు | 4,534 | 3,486 | -1,048 |
| బి. భారత ప్రభుత్వ సెక్యూరిటీలు | --- | --- | --- |
| సి. ఇతర సెక్యూరిటీలు | --- | --- | --- |
| డి. ఇతర పెట్టుబడులు | --- | --- | --- |
| ప్రత్యేకించిన నిధుల నుంచి పెట్టిన పెట్టుబడుల వివరాలు - నిధుల వారీగా ('ఎ' నుండి 'సి' వరకు) | 4,525 | 5,426 | 901 |
| ఎ. సింకింగ్ ఫండ్ | 3,843 | 4,697 | 854 |
| బి. గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్ | 668 | 715 | 47 |
| సి. ఇతర నిధులు | 14 | 14 | --- |
| వచ్చిన వడ్డీ | 451 | 578 | 127 |

*మూలం : ఆర్థిక పద్దులు 2011-12*

మార్కెట్ ఋణాలపై చెల్లించే సగటు వడ్డీ రేటు 7.40 శాతంకాగా, 2011-12లో, నగదు నిల్వల నుంచి పెట్టిన పెట్టుబడుల నుండి 5.40 శాతం చొప్పున, ప్రత్యేకించిన నిధుల నుంచి పెట్టిన పెట్టుబడుల నుండి 7.18 శాతం చొప్పున వడ్డీని ఆర్జించడమైంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సంవత్సరం ఎలాంటి అడ్వాన్సులూ తీసుకోకుండా, భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద రోజువారీ కనీస నగదు నిల్వ ₹3.32 కోట్లను ఉంచింది. 2011-12 సంవత్సరాంతానికి, రాష్ట్ర ప్రభుత్వ నగదు నిల్వ గత ఏడాది కంటే ₹492 కోట్ల మేర (6 శాతం) పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలో ప్రభుత్వం వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను గానీ ఓవర్ డ్రాఫ్టులను గానీ తీసుకోలేదు.

## 1.10 ఆస్తులు - అప్పులు

### 1.10.1 ఆస్తులు, అప్పుల పెరుగుదల, కూర్పు

ప్రభుత్వ పద్దుల నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత విధానంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములు, భవనాల వంటి స్థిరాస్తులను సమగ్రంగా పద్దుల్లో చూపడం జరగదు. ఐతే ప్రభుత్వ ఆర్థిక బాధ్యతలనూ, చేసిన ఖర్చుల ద్వారా సమకూర్చుకొన్న ఆస్తులను ప్రభుత్వ పద్దుల్లోకి తీసుకోవడం జరుగుతోంది. 2012 మార్చి 31 నాటికి ప్రభుత్వ ఆస్తులు - అప్పుల సంక్షిప్త వివరాలను 2011 మార్చి 31 నాటి స్థితితో పోలుస్తూ ***అనుబంధం 1.9*** లో ఇవ్వడమైంది. అప్పుల జాబితాలో ముఖ్యంగా అంతర్గత ఋణాలు, భారత ప్రభుత్వం నుండి పొందిన లోన్లు, అడ్వాన్సులు, ప్రజా పద్దులు - రిజర్వు నిధులు కింద రాబడులు ఉంటాయి. ఆస్తులలో ప్రధానంగా క్యాపిటల్ పరివ్యయం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు, నగదు నిల్వలు ఉంటాయి.

రాష్ట్ర ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్వచించిన ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం అప్పులంటే - రాష్ట్ర సంచిత నిధి, రాష్ట్ర ప్రజాపద్దుల కింద అప్పులు. ఇంకా ప్రభుత్వరంగ సంస్థలు, ప్రత్యేక ప్రయోజనార్థం ఏర్పరచిన సాధనాల (స్పెషల్ పర్పస్ వెహికల్స్) ఋణాలు, రాష్ట్ర బడ్జెట్ల నుండి అసలు మరియు/లేదా వడ్డీ చెల్లించాల్సిన గ్యారంటీలు, అలాంటి ఇతర ఆర్థిక సాధనాలు కూడా ఉంటాయి.

### 1.10.2 ద్రవ్య బాధ్యతలు

రాష్ట్ర ప్రభుత్వం తీర్చాల్సి ఉన్న ద్రవ్య బాధ్యతల సరళిని ***అనుబంధం 1.6*** లో చూపడమైంది. ఈ ఏడాది ద్రవ్య బాధ్యతల కూర్పు **చార్టు 1.11** లోనూ, గత ఏడాది ద్రవ్య బాధ్యతల కూర్పు **చార్టు 1.12** లోనూ ఉన్నాయి.




మూలం : ఆర్థిక పద్దులు 2011-12




మూలం : ఆర్థిక పద్దులు 2011-12

రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య బాధ్యతలు 2011-12 సంవత్సరాంతానికి ₹1,50,512 కోట్లు. ఇవి గత సంవత్సరం (₹1,34,905 కోట్లు) కంటే ₹15,608 కోట్లు (12 శాతం) ఎక్కువగానూ, రెవెన్యూ రాబడులకు 1.61 రెట్లుగానూ ఉన్నాయి.

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్వచించిన విధంగా లెక్కిస్తే ఈ ఏడాది ముగిసే నాటికి ద్రవ్య బాధ్యతల మొత్తం ₹1,53,849 కోట్లు[13]. ఇది జి.ఎస్.డి.పి. లో 22.27 శాతం ఉంది. ఎఫ్ .ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించిన పరిమితి 29.60 శాతం.

[13] సంచిత నిధి, ప్రజా పద్దులకు సంబంధించిన బాధ్యతలు (₹1,50,512 కోట్లు), రాష్ట్ర బడ్జెట్ నుండి చెల్లించాల్సిన గ్యారంటీల బకాయిలు (₹2,050 కోట్లు), బడ్జెట్ వెలుపలి ఋణ బకాయిలు (₹1,287 కోట్లు)

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంకు అనుగుణంగా ఋణాభారాన్ని తగ్గించుకోవడానికి లేదా వదిలించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిక్షిప్త నిధి (సింకింగ్ ఫండ్)ని, హామీ విమోచన నిధి (గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్)ని ఏర్పాటు చేసింది. భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశించిన రేట్ల ప్రకారం వీటిలో నిధులను జమ చేస్తూ వస్తోంది.

### 1.10.3 గ్యారంటీల స్థితి - ఋణబాధ్యతలుగా మారే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఋణ గ్రహీతలు ఋణాలను తిరిగి చెల్లించని పక్షంలో ఆ గ్యారంటీలు రాష్ట్ర సంచిత నిధిపై ఋణ బాధ్యతలుగా మారుతాయి. ఏదైనా ఒక ఏడాదిలోని వార్షిక ఇంక్రిమెంటల్ రిస్క్ వెయిటెడ్ గ్యారంటీల మొత్తం అంతకుముందు ఏడాదిలోని మొత్తం రెవెన్యూ రాబడుల్లో 90 శాతం మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం తన ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలోనే పరిమితి విధించుకుంది. హామీల విముక్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం హామీ విముక్తి నిధిని (గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్)ని 2002 జనవరిలో ఏర్పాటు చేసింది. ఈ సంవత్సరం ₹70 కోట్లను ఈ నిధికి జమ చేసింది. 2012 మార్చి 31 నాటికి ఉన్న మొత్తం ముగింపు నిల్వను (₹715 కోట్లు) ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టింది.

ఆర్థిక పద్దులలోని 9 వ స్టేట్‌మెంట్ ప్రకారం గత ఐదేళ్ళకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన గరిష్ట మొత్తాలు, అందులో ఇప్పటికీ మిగిలి ఉన్న గ్యారంటీ మొత్తాల వివరాలు **పట్టిక 1.13** లో ఉన్నాయి.

**పట్టిక 1.13 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు**

(₹ కోట్లలో)

| గ్యారంటీలు | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| హామీ ఇచ్చిన గరిష్ట మొత్తం | 18,798 | 29,990 | 20,324 | 29,554 | 23,543 |
| మిగిలి ఉన్న హామీలు | 14,502 | 15,239 | 13,135 | 12,290 | 12,286 |
| మొత్తం రెవెన్యూ రాబడుల్లో హామీ ఇచ్చిన గరిష్ట మొత్తపు శాతం | 34.72 | 47.71 | 31.42 | 36.49 | 25.17 |

*మూలం : ఆర్థిక పద్దులు*

ఈ ఏడాది 37 సంస్థలకు హామీ ఇచ్చిన గరిష్ట మొత్తం ₹23,543 కోట్లు కాగా, ఇది ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం నిర్దేశించిన విధంగా నిరుటి రెవెన్యూ వసూళ్ళ (₹72,896 కోట్లు)లో 90 శాతం పరిమితికి లోబడే ఉంది. 2011-12 సంవత్సరాంతానికి హామీ ఇచ్చిన గరిష్ట మొత్తం గత సంవత్సరం కంటే ₹6,011 కోట్లు తగ్గింది. విద్యుత్ విభాగంలో (₹448 కోట్లు), పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం (₹231 కోట్లు), సహకార సంస్థలు(₹289 కోట్లు) లలో ప్రధానంగా తగ్గుదల ఉంది.

ప్రస్తుత సంవత్సరంలో, సహకార సంస్థలనుండి గ్యారంటీ కమీషను రూపేణా ప్రభుత్వానికి ₹0.90 కోట్లు లభించగా, ఇంకా ₹14 కోట్లు వివిధ సంస్థల నుండి రావలసి ఉంది.

### 1.10.4 బడ్జెట్‌లో వెల్లడించని ఋణాలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఋణాలు భారత రాజ్యాంగపు 293వ అధికరణకు లోబడి ఉంటాయి. **అనుబంధం-1.9** లో చూపిన ద్రవ్య బాధ్యతలే కాకుండా, ప్రభుత్వ కంపెనీలు/కార్పోరేషన్లు తీసుకున్న లోన్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రణాళికా కార్యక్రమాల అమలు కోసం ఈ కంపెనీలు/కార్పోరేషన్లు మార్కెట్/ఆర్థిక సంస్థల నుండి నిధులను అప్పుగా తీసుకున్నాయి. ఐతే, ఈ వివరాలను బడ్జెట్‌లో పొందుపరచలేదు. ఈ కార్యక్రమాలకు నిధులను రాష్ట్ర బడ్జెట్ నుండి ఖర్చు చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి చాలామటుకు సంస్థల ఋణాలు చివరికి రాష్ట్ర ప్రభుత్వపు ద్రవ్య బాధ్యతలుగా మారుతాయి. అలా ఇవి బడ్జెట్ వెలుపలి ఋణాలుగా పరిణమిస్తాయి.

సర్దుబాటు బాండ్ల ద్వారానూ, బ్యాంకుల నుండీ, ప్రైవేటు గానూ ఏ.పి. ట్రాన్స్‌కో 2001-09 మధ్యకాలంలో తీసుకున్న బడ్జెటేతర ఋణం ₹2,231 కోట్లకు గానూ, 2010-11 వరకూ ప్రభుత్వం ₹937 కోట్ల ఋణాన్ని తిరిగి చెల్లించింది. ఈ సంవత్సరం ప్రభుత్వం కొత్తగా బడ్జెటేతర ఋణం తీసుకోలేదు కానీ గత సంవత్సరాల తాలూకు అసలు ₹7 కోట్లు, వడ్డీ ₹111 కోట్లు తీర్చింది.

2012 మార్చి ముగిసే నాటికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం అప్పులు ₹1,64,085 కోట్లు. ఇందులో ద్రవ్య బాధ్యతలు ₹1,50,512 కోట్లు, బడ్జెటేతర ఋణాలు ₹1,287 కోట్లు, వడ్డీతో కలిపి మిగిలి ఉన్న గ్యారంటీలు ₹12,286 కోట్లు ఉన్నాయి. జి.ఎస్.డి.పి. తో వీటి నిష్పత్తి 24.28 శాతం ఉంది. **ఇది 2011-12 సంవత్సరానికి ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో నిర్దేశించిన 29.60 శాతం పరిమితి కన్నా తక్కువ.**

### 1.10.5 ప్రతికూల నిల్వలు

ఆర్థిక పద్దులలో చోటుచేసుకున్న ప్రతికూల నిల్వలు పద్దులలోని నిల్వల స్థితిని వక్రీకరించి చూపుతాయి. లోన్ల కింద ప్రతికూల (ఋణాత్మక) నిల్వలు ఉండడం, ప్రభుత్వం ఇచ్చిన లోన్ల కన్నా తిరిగి చెల్లించిన మొత్తం ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది. లోన్ అకౌంటు కింద ఋణాత్మక నిల్వలు ప్రధానంగా, 6003 (109 - ఇతర సంస్థల నుండి ఋణాలు) కింద ఉన్నాయి. సంస్థాగత ఋణాలను నేరుగా పొందే ప్రభుత్వశాఖలు ఆ ఋణాలను తమ రాబడులుగా వర్గీకరించి చూపుతున్నాయి. స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్.పి.వి.లు), కంపెనీలు/కార్పోరేషన్ల విషయంలో ఈ మొత్తాలు ప్రభుత్వ పద్దుల్లోకి రావు. ఐతే, ఆ ఋణాలను తిరిగి చెల్లించేటప్పుడు సంబంధిత మొత్తాలు ప్రభుత్వ పద్దుల్లో ఎమ్ హెచ్-6003 - అంతర్గత ఋణం కింద డెబిట్‌గా నమోదవుతున్నాయి. ఇది 2011-12లో ₹3,732 కోట్ల ప్రతికూల నిల్వకు దారితీసింది. వ్యవసాయ-సహకార శాఖ, ఆంధ్రప్రదేశ్ రోడ్ల అభివృద్ధి సంస్థ, ఏ.పి. పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్, ఏ.పి.ట్రాన్స్‌కో బాండ్లకు సంబంధించి ఈ ప్రతికూల నిల్వలున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డిశ్చార్జ్‌డ్ బాండ్లకు సంబంధించి తీర్చిన అసలును 6003 - అంతర్గత ఋణం కింద నమోదుచేస్తోంది. ఇది సరైన విధానం కాదు. ఎస్.పి.వి.ల తరఫున ప్రభుత్వం తిరిగి చెల్లించే మొత్తాలు ఆ సంస్థలకు చేసే ఆర్థిక సాయం కిందకు వస్తుంది. కాబట్టి దీన్ని రెవెన్యూ వ్యయం కింద వర్గీకరించాలి. కనుక, ఎస్.పి.వి.ల తరఫున ప్రభుత్వం తిరిగి చెల్లించిన ఋణాలకు సంబంధించిన ప్రతికూల నిల్వలన్నీ కలపగా వచ్చిన మొత్తం మేరకు రెవెన్యూ వ్యయాన్ని తక్కువగా చూపినట్లవుతుంది.

ఆడిట్ లేవనెత్తిన అంశాన్ని ప్రభుత్వం అంగీకరిస్తూ, ఇది గత కొన్నేళ్ళుగా కొనసాగుతున్నదనీ, దీన్ని సరిచేస్తున్నామనీ తెలిపింది (2012 నవంబరు).

## 1.11 ఋణాలను భరించే సామర్థ్యం

రాష్ట్ర ప్రభుత్వపు అప్పుల పరిమాణంతో పాటుగా ప్రభుత్వానికి ఋణాలను భరించే సామర్థ్యం[14] ఏ మేరకు ఉందో తెలియజేసే వివిధ సూచికలను కూడా విశ్లేషించడం అవసరం. ఋణ స్థిరీకరణ[15], ఋణాలు కాని రాబడులు[16] ఎంతమేరకు సరిపోతాయి, ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధుల నికర లభ్యత[17], వడ్డీ చెల్లింపుల భారం (వడ్డీ చెల్లింపులు, రెవెన్యూ రాబడుల మధ్య నిష్పత్తితో లెక్కించినది), రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల మెచ్యూరిటీ ప్రొఫైల్ అనే అంశాల పరంగా రాష్ట్ర ప్రభుత్వ ఋణ భరణ శక్తిని ఈ విభాగంలో అంచనా వేయటం జరిగింది. 2007-12 మధ్య గల ఐదేళ్ళ కాలానికి సంబంధించి, ఈ సూచికల పరంగా రాష్ట్ర ఋణ భరణ సామర్థ్యాన్ని **పట్టిక 1.14** లో విశ్లేషించడం జరిగింది.

---

[14] పేజీ 104 లోని పారిభాషిక పదకోశం చూడండి

[15] పేజీ 104 లోని పారిభాషిక పదకోశం చూడండి

[16] పేజీ 105 లోని పారిభాషిక పదకోశం చూడండి

[17] పేజీ 104 లోని పారిభాషిక పదకోశం చూడండి

### పట్టిక 1.14 : ఋణ భరణ శక్తి : సూచికలు, ధోరణులు

| ఋణ భరణ శక్తి సూచికలు | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| ఋణ స్థిరీకరణ (పరిమాణ విస్తృతి + ప్రాథమిక లోటు) (₹కోట్లలో) | 13,796 | 10,861 | 12,800 | 18,101 | 22,375 |
| ఋణాలు - జి.ఎస్.డి.పి. నిష్పత్తి | 0.27 | 0.26 | 0.25 | 0.24 | 0.22 |
| ఋణాలు కాని రాబడులు సరిపోవడం (వనరుల అంతరం) (₹కోట్లలో) | (-) 3,143 | (-) 3,710 | (-) 1,603 | (+) 2,207 | (-) 3,598 |
| ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధుల నికర లభ్యత (₹కోట్లలో) | (-) 510 | 3,033 | 5,523 | 2,769 | 3,348 |
| ఋణ విమోచనం (అసలు + వడ్డీ)/ఋణాల రూపేణా వచ్చిన మొత్తం రాబడులు | 1.130 | 0.840 | 0.850 | 0.915 | 0.853 |
| వడ్డీ చెల్లింపుల భారం (ఐ.పి./ఆర్.ఆర్. నిష్పత్తి) | 0.14 | 0.13 | 0.14 | 0.12 | 0.11 |

*మూలం : ఆర్థిక పద్దులు*

గత ఐదేళ్ళుగా పరిమాణ విస్తృతి, ప్రాథమిక లోటు రెండింటినీ కలిపిన విలువ ధనాత్మకంగా ఉండడం వలన 2007-08 లో 0.27 గా ఉన్న ఋణం, జి.ఎస్.డి.పి. ల నిష్పత్తి 2011-12 లో 0.22 కు తగ్గింది. ఈ ధోరణులు ఋణ స్థిరీకరణ వైపు పయనాన్ని సూచిస్తున్నాయి. దీని వలన అంతిమంగా రాష్ట్రానికి ఋణాలను భరించే సామర్థ్యం పెరుగుతుంది. మొత్తం ఐదేళ్ళకుగాను నాలుగేళ్ళలో వనరుల అంతరం ఋణాత్మకంగా ఉంది. పెరుగుతున్న ప్రాథమిక వ్యయం, వడ్డీ భారాన్ని భరించేందుకు పెరుగుతున్న ఋణేతర రాబడులు సరిపోకపోవడాన్ని ఇది సూచిస్తోంది. కాబట్టి, ఋణ స్థిరీకరణను కొనసాగించడానికి రాష్ట్ర ప్రభుత్వం వనరుల సమీకరణను వేగవంతం చేసుకోవడమేకాకుండా, అనుత్పాదక వ్యయాన్ని తగ్గించుకోవలసి ఉంది. ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధుల నికర లభ్యత గత ఐదేళ్ళ కాలంలో ప్రతి ఏటా ధనాత్మకం గానే ఉంది. ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులు పాత అప్పులను తీర్చేందుకే కాకుండా, ఇతర ప్రయోజనాలకు కూడా అందుబాటులో ఉండటాన్ని ఇది సూచిస్తుంది. రాష్ట్ర ఋణం తాలూకు మెచూరిటీ ప్రొఫైల్‌ను **పట్టిక 1.15** లో చూపడమైంది.

### పట్టిక 1.15: రాష్ట్ర ఋణపు మెచూరిటీ ప్రొఫైల్

**(₹ కోట్లలో)**

| మెచూరిటీ ప్రొఫైల్ | మొత్తం | శాతం |
|---|---|---|
| 0 - 1 సంవత్సరాలు | 6,056 | 5.71 |
| 1 - 3 సంవత్సరాలు | 10,615 | 10.02 |
| 3 - 5 సంవత్సరాలు | 9,953 | 9.39 |
| 5 - 7 సంవత్సరాలు | 21,577 | 20.36 |
| 7 సంవత్సరాలు, ఆ పైన | 57,785 | 54.52 |
| **మొత్తం** | **1,05,986** | **100.00** |

*మూలం : ఆర్థిక పద్దులు 2011-12*

గత ఐదేళ్ళ కాలంలో, ఏ సంవత్సరంలోనూ ద్రవ్య మిగులు లేనందున, తన వ్యయ బాధ్యతలను నెరవేర్చడానికి ప్రభుత్వం మరింతగా అప్పులు చేయక తప్పదు. 2009-10, 2010-11, 2011-12 సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వ మార్కెట్ ఋణాలు (₹42,883 కోట్లు) గణనీయంగా పెరగడం వలన 2018-19 సంవత్సరం నుంచి చెల్లింపుల భారం బాగా పెరగవచ్చు. రాష్ట్ర అభివృద్ధి ఋణాల (ఎస్.డి.ఎల్.) కు సంబంధించి 2012 మార్చి 31 నాటి నిల్వల మెచూరిటీ ప్రొఫైల్‌ను పరిశీలిస్తే ఈ తరహా ఋణాలలో 55 శాతం ఋణాలు ఏడు సంవత్సరాలు, అంతకు మించిన గడువులో ఉన్నాయి.

అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఋణాల భారం 2015-17 లో ₹9,953 కోట్లు, 2017-19 లో ₹21,577 కోట్లు కావచ్చునని కూడా మెచూరిటీ ప్రొఫైల్ సూచిస్తోంది. దీని వలన ఆ సంవత్సరాలలోని ప్రభుత్వ బడ్జెట్‌పై భారం పడుతుంది. ఈ ఋణాలను తీర్చడానికి ప్రభుత్వం మరిన్ని అప్పులు చేయాల్సి ఉంటుంది. కాబట్టి, ఈ కీలకమైన సంవత్సరాలలో మెచూర్ అయ్యే ఋణాలను తీర్చడానికి మరిన్ని అదనపు అప్పులకు పాల్పడకుండా ఉండేందుకు సముచితమైన చెల్లింపుల వ్యూహాన్ని ప్రభుత్వం రూపొందించుకోవాల్సి ఉంది.

## 1.12 ద్రవ్య అసమతుల్యతలు

ఏదైనా ఒక నిర్దిష్ట కాలంలో రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం ద్రవ్య అసమతుల్యతలు ఏ మేరకు ఉన్నాయనే విషయాన్ని రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు, ప్రాథమిక లోటు అనే మూడు కీలక ద్రవ్యపరామితులు తెలియజేస్తాయి. ప్రభుత్వ పద్దుల్లో లోటు అనేది రాబడులు, ఖర్చుల మధ్య అంతరాన్ని తెలియజేస్తుంది. ఈ లోటు స్వభావం ఆర్థిక నిర్వహణలో ప్రభుత్వ వివేచనను తెలియజేస్తుంది. అంతేకాకుండా, లోటును భర్తీ చేసిన విధానం, సమీకరించిన వనరులను వినియోగించిన వైనం, ప్రభుత్వపు ఆర్థిక పరిపుష్టికి సంకేతాలు. 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఈ లోటులను భర్తీ చేసిన ధోరణి, స్వభావం, పరిమాణం, తీరు, ఇంకా రెవెన్యూ, ద్రవ్యలోటుల విషయంలో ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం/నియమావళి కింద నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి వాస్తవ స్థాయిల విశ్లేషణను ఈ విభాగంలో పేర్కొనడమైంది.

### 1.12.1 వివిధ లోటుల సరళి

2007-12 మధ్య కాలంలో లోటు సూచికల సరళిని **చార్టులు 1.13, 1.14** లలో చూపడమైంది.

**చార్టు 1.13 : లోటు సూచికల సరళి**




మూలం : ఆర్థిక పద్దులు

**చార్టు 1.14 : జిఎస్‌డిపి తో పోలిస్తే లోటు సూచికల సరళి**




మూలం : ఆర్థిక పద్దులు

2011-12 లో వరుసగా ఆరో ఏడాది రెవెన్యూ మిగులు ఏర్పడింది. ప్రస్తుత సంవత్సరపు రెవెన్యూ మిగులు ₹3,138 కోట్లు. ఇది గత ఏడాది (₹2,462 కోట్లు) కంటే ₹676 కోట్లు ఎక్కువ. ద్రవ్య లోటు ప్రతి ఏటా మారుతూ 2010-11 నాటి ₹11,803 కోట్ల నుంచి 2011-12 లో ₹15,401 కోట్లకు పెరిగింది (30 శాతం). 2010-11 లో ₹2,128 కోట్లుగా ఉన్న ప్రాథమిక లోటు ప్రస్తుత సంవత్సరం ₹4,840 కోట్లకు పెరిగింది (127 శాతం).

### 1.12.2 ద్రవ్యలోటులోని అంశాలు, వాటిని భర్తీ చేసిన విధానం

ద్రవ్యలోటును భర్తీ చేయడానికి వినియోగించిన అంశాల కూర్పులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. వివరాలను **పట్టిక 1.16** లో చూపడమైంది.

**పట్టిక 1.16 : ద్రవ్యలోటులోని అంశాలు - వాటిని భర్తీ చేసిన తీరు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | వివరాలు | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | వసూళ్ళు | చెల్లింపులు | నికరం |
| ఎ. | ద్రవ్యలోటు విభజన (1 నుండి 3 వరకు) | (-)8,786 | (-)12,407 | (-)14,010 | (-)11,803 | 93,719 | 1,09,120 | -15,401 |
| | 1. రెవెన్యూ లోటు/మిగులు | 159 | 1,004 | 1,230 | 2,462 | 93,553 | 90,415 | 3,138 |
| | 2. నికర క్యాపిటల్ ఖర్చు | (-)6,216 | (-)10,367 | (-)13,793 | (-)11,123 | 0 | 13,722 | -13,722 |
| | 3. నికర లోన్లు, అడ్వాన్సులు | (-)2,729 | (-)3,044 | (-)1,447 | (-)3,142 | 165 | 4,983 | -4,818 |
| బి. | ద్రవ్య లోటును భర్తీ చేసిన తీరు | | | | | | | |
| | మార్కెట్ ఋణాలు | 6,182 | 10,911 | 13,403 | 10,154 | 16,731* | 5,813 | 10,918 |
| | భారత ప్రభుత్వం నుండి లోన్లు | (-)43 | (-)391 | 73 | 687 | 2,719 | 948 | 1,771 |
| | చిన్న మొత్తాల పొదుపు, భవిష్యనిధి, వగైరా (క్రెడిట్ ) | 940 | 570 | 961 | 1,603 | 3,376 | 2,156 | 1,220 |
| | రిజర్వు నిధులు (క్రెడిట్) | 252 | 271 | (-)113 | 945 | 3,272 | 2,921 | 351 |
| | డిపాజిట్లు, అడ్వాన్సులు (క్రెడిట్) | 3,416 | (-)1,812 | (-)1,437 | 1,703 | 42,963 | 41,617 | 1,346 |
| | అనామతు, వివిధాలు (డెబిట్) | (-)2,828 | 4,405 | (-)1 | (-)2,200 | 1,23,420 | 1,23,083 | 337 |
| | జమలు (క్రెడిట్) | 943 | (-)1,621 | 1,435 | (-)1,351 | 17,524 | 17,427 | 97 |
| | ఇతరాలు (కంటింజెన్సీ ఫండ్) | (-)1 | (-)6 | 7 | (-)1 | 1.54 | 0.40 | 1# |
| | మొత్తం మిగులు/లోటు | (-)75 | 80 | (-)318 | 263 | --- | --- | -638 |

మూలం : ఆర్థిక పద్దులు; * ఇతర సంస్థలనుండి తెచ్చిన ఋణాలతో కలిపి; # దశాంశ స్థానాల సవరణ వలన వ్యత్యాసం వచ్చింది

ఈ సంవత్సరం ద్రవ్యలోటు గత ఏడాది కంటే ₹3,598 కోట్ల మేర పెరిగింది. 2011-12 లో ద్రవ్యలోటును భర్తీ చేయడంలో, మార్కెట్ ఋణాలు (₹15,500 కోట్లు) ప్రధాన వనరుగా ఉపకరించాయి.

### 1.12.3 లోటు/మిగులు నాణ్యత

రెవెన్యూ లోటు, ద్రవ్య లోటుల నిష్పత్తి; ప్రాథమిక లోటును ప్రాథమిక రెవెన్యూ లోటు[18], క్యాపిటల్ ఖర్చులు (లోన్లు, అడ్వాన్సులతో సహా)గా విభజన చేస్తే వచ్చే విలువలు రాష్ట్ర ఆర్థిక స్థితికి సంబంధించిన లోటు నాణ్యతను సూచిస్తాయి. రెవెన్యూ లోటు, ద్రవ్య లోటుల నిష్పత్తి వలన ఋణాల ద్వారా సమీకరించుకున్న నిధులను ఆ ఆర్థిక సంవత్సరపు అవసరాలకు ఎంత మేరకు వినియోగించుకోవడం జరిగిందో తెలుస్తుంది. అంతే కాకుండా, రెవెన్యూ లోటు, ద్రవ్య లోటుల నిష్పత్తి నిలకడగా హెచ్చు విలువను కలిగి ఉండడమనేది రాష్ట్రానికి ఆస్తుల ఆధారం క్రమంగా తగ్గుతూ ఉండటాన్నీ, అప్పులలోని కొంత భాగానికి (ద్రవ్య బాధ్యతలకు) ఆస్తుల దన్ను లేకపోవడాన్నీ సూచిస్తుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు క్యాపిటల్ ఖర్చులో పెరుగుదల వాంఛనీయమే అయినప్పటికీ, ఇది లోటు ఏర్పడటానికి ఎంతమేరకు దోహదపడిందో ప్రాథమిక లోటు విభజన (**పట్టిక 1.17**) తెలియజేస్తుంది.

**పట్టిక 1.17: ప్రాథమిక లోటు/మిగులు - అందులోని అంశాలు**

**(₹ కోట్లలో)**

| సంవత్సరం | ఋణాలుకాని రాబడులు | ప్రాథమిక రెవెన్యూ ఖర్చు | క్యాపిటల్ ఖర్చు | లోన్లు, అడ్వాన్సులు | ప్రాథమిక ఖర్చు[19] | ప్రాథమిక రెవెన్యూ లోటు (-)/ మిగులు (+) | ప్రాథమిక లోటు (-)/ మిగులు (+) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 (3+4+5) | 7 (2-3) | 8 (2-6) |
| 2007-08 | 60,891 | 46,394 | 12,774 | 2,920 | 62,088 | (+)14,497 | (-)1,197 |
| 2008-09 | 63,228 | 53,797 | 10,367 | 3,414 | 67,578 | (+)9,431 | (-)4,350 |
| 2009-10 | 64,821 | 54,534 | 13,793 | 1,590 | 69,917 | (+)10,287 | (-)5,096 |
| 2010-11 | 81,169 | 68,859 | 11,123 | 3,315 | 83,297 | (+)12,310 | (-)2,128 |
| 2011-12 | 93,719 | 79,854 | 13,722 | 4,983 | 98,559 | (+)13,865 | (-)4,840 |

*మూలం : ఆర్థిక పద్దులు*

2007-12 మధ్య కాలంలోని ప్రాథమిక లోటు/మిగులుకు కారకాలైన అంతర్గత అంశాలను విడివిడిగా పరిశీలిస్తే, ప్రతి ఏటా ప్రాథమిక లోటు ఏర్పడడానికి క్యాపిటల్ పద్దు కింద చేసిన ఖర్చులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులే కారణమని తెలుస్తోంది. అంటే, రాష్ట్ర ఋణేతర రాబడులు, ప్రాథమిక రెవెన్యూ ఖర్చుకు సరిపడా ఉండడమే కాకుండా మొత్తం క్యాపిటల్ ఖర్చు లేదా అందులోని కొంత భాగానికి కూడా సరిపోతున్నాయని తెలుస్తోంది. ఐతే, 2007-12 మధ్య గల ఐదేళ్ళ కాలంలోని ప్రతి ఏటా ఋణేతర రాబడులలోని మిగుళ్ళు, మొత్తం ప్రాథమిక వ్యయం, లోన్లు, అడ్వాన్సులకు చాలినంతగా లేవు. ఇది ప్రాథమిక లోటుకు కారణమైంది.

---

[18] పేజీ 105 లోని పారిభాషిక పదకోశం చూడండి

[19] పేజీ 105 లోని పారిభాషిక పదకోశం చూడండి

## 1.13 సారాంశం

ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టాన్ని తీసుకొచ్చిన తరువాతికాలంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆర్థిక సంస్కరణల లక్ష్యాలను సాధిస్తూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 2011-12లో వరుసగా 6వ సంవత్సరం రెవెన్యూ మిగులును సాధించింది. ద్రవ్యలోటు ఎఫ్.ఆర్.బి.ఎమ్.చట్టం నిర్దేశించిన పరిమితికి లోపలే ఉంది. 2011-12 సంవత్సరానికి ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం నిర్దేశించిన పరిమితి ప్రకారం, మొత్తం ద్రవ్య బాధ్యతలు జి.ఎస్.డి.పి.లో 29.60 శాతానికి మించకూడదు. ద్రవ్యబాధ్యతలను జి.ఎస్.డి.పి.లో 22.27 శాతానికి తగ్గించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెరుగ్గానే పని చేసింది.

ఈ ఏడాది రెవెన్యూ రాబడులు నిరుటి కంటే 15.50 శాతం పెరిగాయి. రాష్ట్ర సొంత పన్నులు, పన్నులు కాని ఇతర రాబడులు పెరగడం వలన ఈ వృద్ధి నమోదయ్యింది. క్యాపిటల్ ఖర్చు 23 శాతం పెరిగింది. మొత్తం ఖర్చుతో క్యాపిటల్ ఖర్చు నిష్పత్తి కూడా 12.28 శాతం నుండి 18.43 శాతానికి గణనీయంగా పెరిగింది. నీటి పారుదల, రోడ్ల విభాగాలలో, క్యాపిటల్ పనులు, ప్రాజెక్టులు సకాలంలో పూర్తికానందు వలన ఆశించిన ప్రయోజనాలు ఒనగూరకుండానే వీటికి సంబంధించిన ఖర్చు భారీగా పెరిగింది. అంతేకాకుండా, 2011-12లో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వ్యయానికి తగిన ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, కేటాయించిన నిధులు ఆశించిన ప్రయోజనానికి పూర్తిగా వినియోగించేలా చూడలేదు.

కంపెనీలు, చట్టబద్ధమైన కార్పోరేషన్లలో పెట్టిన పెట్టుబడులపై ప్రతిఫలం ఎప్పటిలా స్వల్పంగానే ఉంది. ప్రభుత్వం తెచ్చిన ఋణాలపై 2011-12లో చెల్లించిన వడ్డీ రేటు 7.40 శాతం కాగా, ప్రభుత్వ పెట్టుబడులపై ఈ ఏడాది వచ్చిన సగటు ప్రతిఫలం రేటు 0.85 శాతం మాత్రమే. ఈ కంపెనీలు, కార్పోరేషన్లలోని చాలావాటికి వార్షిక పద్దులు ఖరారు కాలేదు. పదకొండు సంస్థలకు సంబంధించి, పద్దులు ఖరారైన ఏడాదివరకూ పేరుకుపోయిన నష్టాల మొత్తం₹5,979 కోట్లు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ₹3,554 కోట్ల నష్టంతోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ₹1,984 కోట్ల నష్టంతోనూ ఈ జాబితాలో ముందున్నాయి. .

ఇచ్చిన ఋణాల మొత్తం (₹4,983 కోట్లు), వసూలు చేసిన ఋణాల (₹164 కోట్లు) మధ్య అంతరం బాగా పెరిగి, వసూళ్ల స్థాయి అత్యల్పంగా ఉంది. వాస్తవానికి అలా ఋణాలు పొందిన వివిధ సంస్థల నుంచి ₹17,337 కోట్ల ఋణ మొత్తానికి సంబంధించి ఇప్పటికీ ధృవీకరణలు రాలేదు.

లోన్ల పద్దు కింద ప్రతికూల నిల్వలు (₹3,732 కోట్లు) ఉండడం వలన రాష్ట్ర రెవెన్యూ వ్యయాన్ని ఆర్థిక పద్దులలో తక్కువగా చూపినట్లయింది. రాష్ట్ర ద్రవ్య సూచికలపై దీని ప్రభావం పడింది.

## 2.1 పరిచయం

విధాన స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, దుబారా లేకుండానూ, నిధుల మళ్లింపులు జరగకుండానూ పరిపాలన స్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూడడానికి కార్యసాధక ఆర్థిక నిర్వహణ దోహదపడుతుంది. అంతేకాకుండా, విధాన నిర్ణయం క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలుకావటానికి తగు భరోసాను కూడా ఇది కల్పిస్తుంది. బడ్జెట్ ప్రక్రియల్లోని పారదర్శకత, సాఫల్యతలతోపాటు, బడ్జెట్ కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలను ఈ అధ్యాయంలో సమీక్షించడం జరిగింది.

## 2.2 బడ్జెట్ విషయంలో పారదర్శకత

### 2.2.1 బడ్జెట్ చక్రం

ఆర్థికపరమైన విషయాల్లోనూ, బడ్జెట్ సంబంధిత విషయాల్లోనూ అనుసరించవలసిన విధానాలను ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్, ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ నిర్దేశిస్తాయి. సాధారణంగా, రాష్ట్రంలో బడ్జెట్ రూపకల్పన, దీనికి సంబంధించిన బడ్జెట్ క్యాలెండర్ ప్రకారమే జరుగుతుంది. ప్రతి ఏటా అక్టోబరులో తదుపరి ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్ అంచనాల రూపకల్పన మొదలవుతుంది. ఐతే, వివిధ శాఖలను మేము తనిఖీ చేసినప్పుడు, అతిక్రమణలకు తావులేకుండానూ, ఏడాది చివర్లో ఆశ్చర్యకర పరిస్థితులు తలెత్తకుండానూ చూసే విధంగా ఆర్థిక శాఖకు ఖర్చుల వివరాలను ప్రతి నెలా సమర్పించే కేంద్రీకృత వ్యయ నియంత్రణ యంత్రాంగం లేదని వెల్లడైంది.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ ప్రకారం, బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో కింది స్థాయి నుండి పై స్థాయి వరకూ పాల్గొనాలి. అంటే, యూనిట్ స్థాయిలో వారికి అవసరమైన నిధుల వివరాలను తెలియజేస్తే, వాటిని జిల్లా స్థాయిలోనూ, తదుపరి సంబంధిత శాఖ స్థాయిలోనూ క్రోడీకరించాలి. ఐతే, ఈ ఏడాది ఆడిట్ చేసిన ప్రభుత్వ శాఖల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్న దాఖలాలేవీ కనబడలేదు. ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న వివిధ పథకాలనూ, లావాదేవీలనూ తనిఖీ చేసినప్పుడు, యూనిట్/జిల్లా స్థాయిలోకానీ సంబంధిత శాఖ స్థాయిలోకానీ ప్రతిపాదిత ఆర్థిక వనరులకూ, వాటి తాలూకు భౌతిక ఫలితాలకూ పొంతన లేదని వెల్లడైంది. వాస్తవంగా కావలసిన నిధుల ఆవశ్యకతను విశ్లేషించటంలోనూ, అంచనా వేయటంలోనూ తగిన కృషి జరగలేదు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఫలితాల బడ్జెట్‌ను వెలువరిస్తున్నప్పటికీ, ప్రభుత్వ శాఖలు, ఒక ఏడాదికి నిర్ణయించిన లక్ష్యాలను ఎంతమేరకు సాధించిందీ ఆ తదుపరి సంవత్సరానికి సమర్పించే బడ్జెట్ ప్రతిపాదనల్లో నివేదించడం లేదు.

## 2.3 ఆర్థికపరమైన జవాబుదారీతనం, బడ్జెట్ నిర్వహణ

ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ, అప్రోప్రియేషన్ చట్టానికి అనుబంధంగా ఉన్న షెడ్యూళ్లలో నిర్దేశించిన వివిధ ప్రయోజనాల కోసం ఓటుచేసిన గ్రాంట్లు, ఛార్జి చేసిన అప్రోప్రియేషన్ల మొత్తాలతో పోల్చి చూసినపుడు, వాస్తవంగా అయిన ప్రభుత్వ ఖర్చుల పద్దులను అప్రోప్రియేషన్ అకౌంట్లు (వినిమయ పద్దులు) అంటారు. తొలి బడ్జెట్ అంచనాలు, అనుబంధ గ్రాంట్లు, సరెండర్లు, రీ-అప్రోప్రియేషన్ల మొత్తాలను ఈ అకౌంట్లు స్పష్టంగా తెలుపుతాయి. అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలకు ప్రతిగా నిర్దేశించిన వివిధ సర్వీసులపై వాస్తవంగా అయిన క్యాపిటల్, రెవెన్యూ ఖర్చుల వివరాలు ఈ పద్దుల్లో ఉంటాయి. ఆర్థిక వనరుల వినియోగం, బడ్జెట్ కేటాయింపుల పర్యవేక్షణల గురించి అర్థం చేసుకోవడంలో అప్రోప్రియేషన్ అకౌంట్లు ఉపకరిస్తాయి. ఆ విధంగా, ఇవి ఫైనాన్స్ అకౌంట్లకు (ఆర్థిక పద్దులకు) అనుబంధంగా ఉంటాయి.

వివిధ గ్రాంట్ల కింద వాస్తవంగా చేసిన ఖర్చులు అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలను అతిక్రమించలేదనీ రాజ్యాంగపు నిబంధనల ప్రకారం ఛార్జి చేయాల్సిన విధంగానే ఖర్చులను ఛార్జి చేసారనీ నిర్ధారించుకోవడానికి భారత

కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఏ.జి.) అప్రోప్రియేషన్ పద్దులను తనిఖీ చేస్తారు. అంతేకాకుండా, చేసిన ఖర్చులు చట్టాలు, సంబంధిత నియమ నిబంధనలు, ఆదేశాలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని కూడా నిర్ధారించుకోవడం జరుగుతుంది.

## 2.4 వినిమయ పద్దుల సంగ్రహం

నలభై గ్రాంట్లు/అప్రోప్రియేషన్లకు సంబంధించి 2011-12లో వాస్తవంగా అయిన ఖర్చుల వివరాలను సంక్షిప్తంగా పట్టిక 2.1 లో ఇవ్వటం జరిగింది.

**పట్టిక 2.1 : తొలి కేటాయింపులు, అనుబంధ కేటాయింపులకు ప్రతిగా వాస్తవంగా అయిన ఖర్చుల సంక్షిప్త స్థితి**

(₹ కోట్లలో)

| | ఖర్చుల స్వభావం | తొలి గ్రాంటు/ అప్రోప్రియేషన్ | అనుబంధ గ్రాంటు/ అప్రోప్రియేషన్ | మొత్తం | వాస్తవంగా అయిన ఖర్చు[1] | మిగులు (-)/ అదనం (+) |
|---|---|---|---|---|---|---|
| ఓటు చేసినవి | I రెవెన్యూ | 86,042.35 | 9,997.95 | 96,040.30 | 81,135.89 | (-)14,904.41 |
| | II క్యాపిటల్ | 18,030.72 | 1,164.36 | 19,195.08 | 14,145.28 | (-)5,049.80 |
| | III ఋణాలు, అడ్వాన్సులు | 3,808.10 | 1,840.15 | 5,648.25 | 4,983.20 | (-)665.05 |
| మొత్తం ఓటు చేసినవి | | 1,07,881.17 | 13,002.46 | 1,20,883.63 | 1,00,264.37 | (-)20,619.26 |
| ఛార్జి చేసినవి | IV రెవెన్యూ | 11,552.25 | 21.25 | 11,573.50 | 10,685.28 | (-)888.22 |
| | V క్యాపిటల్ | 72.15 | 5.19 | 77.34 | 22.11 | (-)55.23 |
| | VI ప్రజా ఋణం తిరిగి చెల్లింపు | 9,709.75 | --- | 9,709.75 | 6,761.01 | (-)2,948.74 |
| మొత్తం ఛార్జి చేసినవి | | 21,334.15 | 26.44 | 21,360.59 | 17,468.40 | (-)3,892.19 |
| పూర్తి మొత్తం | | 1,29,215.32 | 13,028.90 | 1,42,244.22 | 1,17,732.77 | (-)24,511.45 |

*మూలం : 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

***గమనిక :*** *ఆకస్మిక ఖర్చుల (ఎ.సి.) బిల్లులపై 2011-12 లో డ్రా చేసిన ₹ 671 కోట్ల మేర మొత్తానికి నియమాల అనుసారం అధికారుల (డి.డి.ఓ.ల) నుంచి రావల్సిన వివరణాత్మక కంటింజెంట్ (డి.సి.) బిల్లులు అందలేదు. వివరణాత్మక కంటింజెంట్ బిల్లులు లేని కారణంగా ఈ ఖర్చుల యదార్థతను ధృవీకరించలేము.*

రెవెన్యూ విభాగం కింద 38 గ్రాంట్లు, 11 అప్రోప్రియేషన్లు, క్యాపిటల్ విభాగం కింద 26 గ్రాంట్లు, మూడు అప్రోప్రియేషన్లు, లోన్లు విభాగం కింద 9 గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్ (ప్రజా ఋణం) లలో ₹24,700 కోట్ల మిగులు ఏర్పడింది. ఐతే, రెవెన్యూ విభాగం కింద రెండు గ్రాంట్లు[2], రెండు అప్రోప్రియేషన్లు[3], క్యాపిటల్ విభాగం కింద ఒక గ్రాంటు[4], లోన్లు విభాగం కింద రెండు గ్రాంట్లలో[5] ₹189 కోట్లు అధికంగా ఖర్చయింది. ఫలితంగా ₹24,511 కోట్ల నికర మిగులు ఏర్పడింది. ఈ ఏడాది చేసిన అనుబంధ కేటాయింపులకు ఈ మిగుళ్లు 1.88 రెట్లు ఉన్నాయి. బడ్జెట్ అంచనాల్లో ఖచ్చితత్వం లేదనీ, ఖర్చులపై పర్యవేక్షణ తగినంతగా లేదనీ ఇది సూచిస్తోంది.

---

[1] ఈ సంఖ్యలు స్థూల విలువలను సూచిస్తాయి. రెవెన్యూ వ్యయం కింద ₹1,406 కోట్లు, క్యాపిటల్ వ్యయం కింద ₹445 కోట్లు చొప్పున ఖర్చులో తగ్గుదలగా పద్దులలో సర్దుబాటు చేసిన రికవరీలను వీటిలో పరిగణించలేదు

[2] X - ఆంతరంగిక పరిపాలన (₹54.73 కోట్లు), XXIV - మైనారిటీ సంక్షేమం (₹31.16 కోట్లు)

[3] XXIII - వెనుకబడిన తరగతుల సంక్షేమం (₹912), XXV - స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం (₹51,238)

[4] XVII - మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (₹1.69 కోట్లు)

[5] IX - ద్రవ్యపాలన, ప్రణాళిక, సర్వే, గణాంకాలు (₹98.21 కోట్లు), XV - క్రీడలు, యువజన సేవలు (₹2.79 కోట్లు)

వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు తీసుకొనకపోవటం, కేంద్రం నిధులను తక్కువగా ఇవ్వటం, అప్పులు, రాష్ట సొంత ఆదాయం తగ్గటం ఈ సంవత్సరం ఏర్పడిన భారీ మిగుళ్లకు కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది.

ఆమోదం పొందిన బడ్జెట్‌నుండి ఆ ఏడాదిలో ఎన్ని అతిక్రమణలు జరిగాయి, అనుబంధ డిమాండ్లు, రీ-అప్రోప్రియేషన్లు ఏ మేరకు ఉన్నాయి, చివరకు ఎంతమేర అధిక ఖర్చు లేదా మిగులు జరిగిందనే విషయాలపై ఆ బడ్జెట్ విశ్వసనీయత ఆధారపడి ఉంటుంది. నిధుల లభ్యత లేకుండానే ఖర్చుచేసేసిన కేసులు, సంబంధిత అధికారి నుండి ఆమోదం పొందకుండానే ఖర్చుచేసిన పలు కేసులను ప్రతి ఏడాదీ సి.ఎ.జి. తన ఆడిట్ నివేదికలలో వెల్లడించడం జరుగుతోంది. ఖర్చులు చేసేముందు నిధుల లభ్యత, ఆమోదం రూఢి చేసుకొనేందుకూ, అతిక్రమణలను అదుపు చేసేందుకూ పటిష్ఠమైన యంత్రాంగాన్ని ప్రభుత్వం రూపొందించవలసి ఉంది.

### 2.4.1 కేటాయింపుల ప్రాథమ్యాలకనుగుణంగా వినిమయం

2011-12 ఆర్థిక సంవత్సరంలో, రాబడులు, ఖర్చులు రెండింటి విషయంలోనూ బడ్జెట్ కేటాయింపులతో వైరుధ్యం ఏర్పడింది. ఇది బడ్జెట్ ప్రక్రియ, బడ్జెట్‌పై పర్యవేక్షణ ప్రక్రియ, నిర్వహణ సమాచార వ్యవస్థల విశ్వసనీయతపై సందేహాలకు తావిస్తోంది.

మేము చేసిన వినిమయ పద్దుల తనిఖీలో, 22 గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్ కేసుల్లో ఒక్కొక్క కేసులోనూ ₹100 కోట్ల కంటే అధికంగానూ, మొత్తం కేటాయింపుల్లో 20 శాతంకంటే అధికంగానూ మిగుళ్లేర్పడ్డాయని వెల్లడైంది. మొత్తం మిగుళ్ళు ₹24,700 కోట్లలో ఇవి 54 శాతంగా ఉన్నాయి ***(అనుబంధం 2.1)***. ఇందులో 8 గ్రాంట్లు ఒక అప్రోప్రియేషన్‌లోనే ₹10,133 కోట్లు మిగులు (41 శాతం) ఏర్పడింది. ఈ వివరాలు **పట్టిక 2.2** లో ఉన్నాయి. ఈ గ్రాంటులన్నింటిలోని మిగుళ్ళు ₹500 కోట్లు దాటిపోయి వ్యయంలో 20 శాతంకన్నా ఎక్కువగా ఉండటంతో ఇది బడ్జెట్ ప్రతిపాదనల్లోని మాన్యతపట్ల సందేహాలు రేకెత్తిస్తోంది.

**పట్టిక 2.2 : అధికంగా మిగుళ్ళు ఏర్పడిన గ్రాంట్లు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య | గ్రాంటు/అప్రోప్రియేషన్ పేరు | తొలి గ్రాంటు | అనుబంధ గ్రాంటు | మొత్తం | వాస్తవంగా అయిన ఖర్చు | మిగులు |
|---|---|---|---|---|---|---|---|
| **రెవెన్యూ - ఓటు చేసింది** | | | | | | | |
| 1 | XIII | ఉన్నత విద్య | 2,472 | 106 | 2,578 | 1,950 | 628 |
| 2 | XVII | మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 3,951 | 283 | 4,234 | 2,680 | 1,554 |
| 3 | XXI | సాంఘిక సంక్షేమం | 2,040 | 378 | 2,418 | 1,712 | 706 |
| 4 | XXIII | వెనుకబడిన తరగతుల సంక్షేమం | 2,074 | ,1628 | 3,702 | 2,753 | 949 |
| 5 | XXV | స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం | 1,914 | 93 | 2,007 | 1,500 | 507 |
| 6 | XXXI | పంచాయతీరాజ్ | 3,918 | 182 | 4,100 | 2,901 | 1,199 |
| | | | | | | మొత్తం | 5,543 |
| **క్యాపిటల్ - ఓటు చేసింది** | | | | | | | |
| 7 | XI | రోడ్లు, భవనాలు, ఓడ రేవులు | 2,264 | 347 | 2,611 | 1,728 | 883 |
| 8 | XXXIV | చిన్నతరహా నీటి పారుదల | 2,031 | 0 | 2,031 | 1,273 | 758 |
| | | | | | | మొత్తం | 1641 |
| **ఋణాలు - ఛార్జీ చేసినది (ప్రజాఋణం)** | | | | | | | |
| 9 | IX | ద్రవ్య పాలన, ప్రణాళిక, సర్వే, గణాంకాలు | 9,710 | 0 | 9,710 | 6,761 | 2,949 |
| | | | | | | మొత్తం | 2,949 |
| పూర్తి మొత్తం | | | | | | | 10,133 |

*మూలం : 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

భారీ మిగుళ్లకు ప్రభుత్వం ఈ దిగువ కారణాలు తెలిపింది :

***ఉన్నత విద్య* :** ఉద్యోగాలలో ఖాళీలను భర్తీ చేయక పోవటం, నిధుల కోసం యూనిట్ కార్యాలయాల నుంచి అభ్యర్థనలు రాకపోవటం, యు.జి.సి. గ్రాంట్లు రాకపోవటం, కాంట్రాక్టు ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవటం, సాధికారిక ఆమోదాలు రాకపోవటం.

***మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి*:** 'మంజూరు ఉత్తర్వులు' అందకపోవడం, పనులలో పురోగతి మందకొడిగా ఉండడంవల్ల మిగులు ఏర్పడింది.

***సాంఘిక సంక్షేమం* :** బోధన రుసుము, మెట్రిక్యులేషన్ అనంతర ఉపకార వేతనాలు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆలస్యంగా అందటం, పదవీ విరమణ తదుపరి ఖాళీలను భర్తీ చేయకపోవటం, నిర్వహణ పనుల్లో పురోగతి కొరవడటం, సంబంధిత సంస్థలనుంచి బిల్లులు రాకపోవటం.

***వెనుకబడిన తరగతుల సంక్షేమం* :** కేంద్ర ప్రభుత్వం మెట్రిక్యులేషన్ అనంతర ఉపకార వేతనాలు విడుదల చేయకపోవటం, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు బోధన రుసుము రీఇంబర్స్‌మెంట్ వ్యయాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేయటం.

***స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం* :** సమీకృత శిశు వికాస సేవలలో నిర్వహణ పనులు వాయిదా వేయటం, పోషకాహార పథకానికి రాష్ట్రం తన వాటా నిధులు ఆలస్యంగా ఇవ్వటం, రాజీవ్ గాంధీ కిశోర బాలికా వికాస పథకం (సబల) నిధులను కేంద్రం ఆలస్యంగా ఇవ్వటం, పర్యవసానంగా రాష్ట్రం తన వాటా నిధులు విడుదల చేయకపోవటం.

***పంచాయతీరాజ్* :** నిధులకోసం అభ్యర్థనలు, అనుమతి ఉత్తర్వులు రాకపోవటం, టి.ఎఫ్.సి. పనులను ఉన్నత స్థాయి కమిటీ ఆలస్యంగా అనుమతించటం, పనులలో జాప్యం, నిర్వహణ పనులు వాయిదావేయటం.

***రోడ్లు, భవనాలు, ఓడ రేవులు* :** పనులలో పురోగతి తక్కువగా ఉండటం, అధికారుల నుంచి అనుమతి ఉత్తర్వులు రాకపోవటం.

***చిన్న నీటి పారుదల* :** పనులలో జాప్యం, బిల్లులు రాకపోవటం, ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవటం వంటివి మిగుళ్లకు కారణాలుగా తెలిపారు.

***ద్రవ్య పాలన, ప్రణాళిక, సర్వే, గణాంకాలు* :** 2011-12లో రిజర్వు బ్యాంకు నుంచి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సు తీసుకొనకపోవటం.

మిగుళ్లు 20 శాతంలోపే ఉన్నాగానీ, ఈ దిగువ పేర్కొన్న మూడు గ్రాంట్లలో కూడా ₹1,000 కోట్లకు పైగా భారీ మిగుళ్లు ఏర్పడ్డాయి.

### పట్టిక 2.3 : ₹1,000 కోట్లకు మించిన మిగుళ్లు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు నెంబరు | గ్రాంటు పేరు | మిగులు | కారణాలు |
|---|---|---|---|---|
| 1 | XII | పాఠశాల విద్య (రెవెన్యూ - ఓటు చేసినది) | 2,324 | ఉద్యోగాలలో ఖాళీలను భర్తీ చేయకపోవటం, కేంద్రంనుంచి నిధులు రాకపోవటం, యూనిట్ల నుంచి అభ్యర్థనలు రాకపోవటం. |
| 2 | XXXIII | భారీ, మధ్యతరహా నీటి పారుదల (క్యాపిటల్ - ఓటు చేసినది) | 2,165 | పాలనాపరమైన అనుమతులు రాకపోవటం, స్థల సేకరణలో ఆలస్యం, పనుల్లో ఆలస్యం, నష్టపరిహారం చెల్లించకపోవటం, ఉద్యోగాల్లో ఖాళీలు భర్తీ చేయకపోవటం, నిర్వహణ పనులు కొన్ని వాయిదావేయటం, ఏపి ట్రాన్స్‌కో నుంచి బిల్లులు రాకపోవటం. |
| 3 | XXXIII | భారీ, మధ్యతరహా నీటి పారుదల (రెవెన్యూ - ఓటు చేసినది) | 1,482 | నిర్వహణ పనులు వాయిదావేయటం, బిల్లులు రాకపోవటం, పాలనాపరమైన అనుమతులు రాకపోవటం |

*మూలం : 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

### 2.4.2 నిరంతరం మిగుళ్లేర్పడటం

ఎనిమిది కేసుల్లో గత ఐదేళ్లలో ప్రతి కేసులోనూ ₹20 కోట్ల కంటే ఎక్కువగానూ, మొత్తం గ్రాంటు/అప్రోప్రియేషన్‌లో 20 శాతం లేదా అంతకంటే ఎక్కువగా మిగుళ్లేర్పడ్డాయి. వివరాలను ఈ కింది పట్టికలో ఇవ్వడం జరిగింది :

### పట్టిక 2.4 : 2007-12 మధ్యకాలంలో నిరంతరంగా మిగుళ్లేర్పడిన గ్రాంట్లు, అప్రోప్రియేషన్లు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు/అప్రోప్రియేషన్ సంఖ్య, పేరు | మిగుళ్ల మొత్తం | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
| రెవెన్యూ - ఓటు చేసినది | | | | | | |
| 1. | XVIII - గృహ నిర్మాణం | 342 | 802 | 374 | 189 | 436 |
| 2. | XXXIV - చిన్న నీటి పారుదల | 107 | 289 | 270 | 113 | 161 |
| 3. | XXXVI - పరిశ్రమలు, వాణిజ్యం | 165 | 288 | 582 | 389 | 478 |
| 4. | XXXVII - పర్యాటకం, కళలు, సంస్కృతి | 74 | 55 | 38 | 41 | 73 |
| క్యాపిటల్ - ఓటు చేసినది | | | | | | |
| 5. | V - రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం | 37 | 60 | 23 | 101 | 91 |
| 6. | XVI - వైద్యం, ఆరోగ్యం | 37 | 62 | 32 | 38 | 36 |
| 7. | XXI - సాంఘిక సంక్షేమం | 109 | 434 | 102 | 75 | 114 |
| క్యాపిటల్ - ఛార్జి చేసినది | | | | | | |
| 8. | XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల | 69 | 112 | 97 | 56 | 43 |

*మూలం : వినిమయ పద్దులు*

ఈ గ్రాంట్లు గృహ నిర్మాణం, నీటిపారుదల, వైద్యం-ఆరోగ్యం, సంక్షేమ రంగాలకు చెందిన అభివృద్ధి పథకాలకు సంబంధించినవి కావటంతో లక్షిత లబ్ధిదారులకు అందవలసిన ప్రయోజనాలు సక్రమంగా అందుతున్నాయని ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేదు.

నిరంతర మిగుళ్లకు ప్రభుత్వం ఈ దిగువ కారణాలు పేర్కొంది.

***గృహ నిర్మాణం :*** గత ఐదు సంవత్సరాలుగా (2007-12) మిగులు మొత్తం హెచ్చు తగ్గులవుతోంది. ఇందిరమ్మ కార్యక్రమం కింద బలహీన వర్గాల గృహ నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతి రాకపోవటంతో ఈ సంవత్సరం నిధులు మిగిలిపోయినట్లు ప్రభుత్వం తెలిపింది.

***చిన్న నీటి పారుదల :*** పనులలో పురోగతి నెమ్మదించటం, అనుమతులు రాకపోవటం, నిర్వహణ పనులు వాయిదా వేయటం.

***పరిశ్రమలు, వాణిజ్యం :*** కొనుగోలు పన్ను ప్రోత్సాహకం రీఇంబర్స్‌మెంట్ కోసం నిధులు అవసరం లేకపోవటం, వైమానిక ఇంధనంపై అమ్మకం పన్ను (వ్యాట్) రీఇంబర్స్‌మెంట్ కోసం రవాణా, రోడ్లు, భవనాల శాఖ కింద చేసిన కేటాయింపులను 2007-11 కాలంలో వినియోగించుకోకపోవటం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవటంతో కేంద్రం నిధులివ్వకపోవటం, పారిశ్రామికవేత్తలకు ఇవ్వవలసిన ప్రోత్సాహకాలను రాష్ట్రస్థాయి కమిటీ ఖరారు చేయకపోవటం, అధికారులు కొన్ని అనుమతులు మంజూరు చేయకపోవటం, విద్యుత్తు సబ్సిడీ ఖరారు చేయకపోవటం, ఉద్యోగాలలో ఖాళీలు భర్తీ చేయకపోవటం వంటివి ఈ సంవత్సరం మిగుళ్లకు కారణాలుగా చెప్పారు.

***పర్యాటకం, కళలు, సంస్కృతి :*** కార్యాచరణ ప్రణాళిక అమలు కాకపోవటం, పాలనాపరమైన అనుమతులు రాకపోవటం, పురావస్తు పరిరక్షణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో జాప్యం జరగటం, కడప, నెల్లూరులలో బహుళ ప్రయోజన సాంస్కృతిక సముదాయాల నిర్మాణం జరగకపోవటం మొదలైనవి.

***రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం :*** భవనాలు, వంతెనలు, తుపాను ఆశ్రయాలు, రోడ్ల నిర్మాణం జరగకపోవటం, తుపాను ప్రమాద ఉపశమనానికి సంబంధించిన జాతీయ పథకం కింద నిర్మాణ పనులు చేపట్టకపోవటం, పనులలో ప్రగతి లోపించటం, పనులకు అనుమతులు రాకపోవటం, ఉద్యోగాలలోనూ, పొరుగు సేవలలోనూ ఖాళీలను భర్తీ చేయకపోవటం.

***వైద్యం, ఆరోగ్యం :*** పాలనాపరమైన అనుమతులు రాకపోవటం, పనులలో జాప్యం, నిర్మాణ పనులు చేపట్టేందుకు సంస్థలను ఖరారు చేయకపోవటం.

***సాంఘిక సంక్షేమం :*** కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవటం, పనులలో మందగమనం, ఆర్.ఐ.డి.ఎఫ్. కింద (హడ్కో ఋణంతో) సమీకృత హాస్టల్ భవన నిర్మాణాలకు నాబార్డు ఒప్పందం కుదుర్చుకోకపోవటం.

***భారీ, మధ్యతరహా నీటి పారుదల (క్యాపిటల్-ఛార్జి చేసినది):*** 2007-12 సంవత్సరాలలో మిగుళ్లేర్పడటానికి నిర్దిష్ట కారణాలేవీ ప్రభుత్వం తెలుపలేదు. ఈ సంవత్సరంలో మిగుళ్లకు కారణాలుగా భూసేకరణ అవార్డులు పరిష్కరించకపోవటం, కోర్టు కేసులు, కోర్టులో సొమ్ము జమ చేసేందుకు పాలనాపరమైన అనుమతులు రావటంలో జాప్యం వంటివి ఉదహరించారు.

### 2.4.3 అధిక ఖర్చు

బడ్జెట్ కేటాయింపులను మించి చేసిన అధిక ఖర్చులు 2010-11లో ₹842 కోట్లు కాగా, అది 2011-12లో ₹189 కోట్లకు తగ్గిపోయింది. ఇది ప్రోత్సహించదగిన పరిణామం. ఐదు గ్రాంట్లు, రెండు అప్రోప్రియేషన్లలో ఈ సంవత్సరం జరిగిన అదనపు వ్యయం భారత రాజ్యాంగంలోని 205వ అధికరణం ప్రకారం క్రమబద్ధీకరించాల్సి ఉంది.

మూడు కేసుల్లో, ప్రతీ కేసులోనూ కేటాయించిన నిధుల కంటే ₹20 కోట్లు లేదా అంతకంటే అధికంగా ఖర్చు జరిగింది. ఈ మూడు కేసుల్లోనూ కలిపి, బడ్జెట్ కేటాయింపులకన్నా ₹184 కోట్లు అధికంగా ఖర్చయ్యింది. ఆ వివరాలు ఈ దిగువ పట్టికలో ఉన్నాయి.

### పట్టిక 2.5 ః అధిక ఖర్చు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య | గ్రాంటు పేరు | మొత్తం గ్రాంటు | ఖర్చు | అధిక ఖర్చు |
|---|---|---|---|---|---|
| 1. | IX | ద్రవ్యపాలన, ప్రణాళిక, సర్వే, గణాంకాలు (లోన్లు - ఓటు చేసినది) | 124 | 222 | 98 |
| 2. | X | ఆంతరంగిక పరిపాలన (రెవెన్యూ - ఓటు చేసినది) | 4,290 | 4,345 | 55 |
| 3. | XXIV | అల్పసంఖ్యాక సంక్షేమం (రెవెన్యూ - ఓటు చేసినది) | 334 | 365 | 31 |
| | | **మొత్తం** | **4,748** | **4,932** | **184** |

*మూలం ః 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

ఆంతరంగిక పరిపాలన (హోం అడ్మినిస్ట్రేషన్)లో అధిక ఖర్చుకు కారణాలు (i) కరువు భత్యం బకాయిల చెల్లింపు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ పథకం, ఇంకా ఇతర అలవెన్సుల చెల్లింపు, (ii) పౌరుగు సేవల సిబ్బంది పారితోషికం, (iii) ప్రభుత్వ భవనాలు, క్వార్టర్లపై ఆస్తి పన్ను చెల్లింపు.

### 2.4.4 కేటాయింపులు లేకుండా ఖర్చు చేయడం

బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 20.3.1 ప్రకారం, సాధారణంగా, నిధుల కేటాయింపు జరగకుండా ఏదైనా పథకం/సేవపై ఖర్చు చేయకూడదు. ఐతే, 2011-12 సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు లేకుండానే ఆరు కేసుల్లో మొత్తం ₹326 కోట్లు (ఒక్కొక్క కేసులోనూ ₹10 కోట్ల కంటే అధికంగా) ఖర్చు చేసారు. వివరాలు **పట్టిక 2.6** లో ఉన్నాయి.

### పట్టిక 2.6 ః 2011-12 లో కేటాయింపులు లేకుండానే చేసిన ఖర్చులు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | పద్దు | ఖర్చు | కారణాలు |
|---|---|---|---|---|
| 1 | IX - ద్రవ్య పాలన, ప్రణాళిక సర్వే, గణాంకాలు | 2071-01-110-(09) | 53 | సవరించిన పింఛను, కుటుంబ పింఛను చెల్లింపులు, ఎప్పటికప్పుడు కరువు ఉపశమన చెల్లింపులు చేసినందువలన |
| 2 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 3054-04-797-(04) | 198 | కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన మొత్తాన్ని రోడ్డు నిధికి బదలీ చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపు చేయకపోవటంవలన |
| 3 | XII - పాఠశాల విద్య | 2202-01-789-(30) | 23 | ప్రాథమిక, సెకండరీ విద్యార్థులకు 'పోషకాహార పథకం' కింద ఖర్చుచేశారు. బడ్జెట్ కేటాయింపు లేకుండా ఇలా ఖర్చు పెట్టటానికి గల కారణాలు తెలుపలేదు. |
| 4 | | 2202-02-789-(13) | 15 | |
| 5 | XVII - మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 2217-80-001-(75) | 25 | బడ్జెట్ కేటాయింపులు లేకుండా 'గంపగుత్త' ఉపపద్దు కింద ఖర్చు చేయటానికి కారణాలు తెలియచేయలేదు. |
| 6 | XXXII - గ్రామీణాభివృద్ధి | 2501-01-003-(25) | 12 | 'మహిళా కిసాన్ శశక్తికరణ్ పరియోజన'(ఎం.కె.ఎస్.పి.) అనే కొత్త పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా నిధులు వెచ్చించింది. |
| | | **మొత్తం** | **326** | |

*మూలం ః 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

### 2.4.5 గత సంవత్సరాల్లో కేటాయింపులను మించి చేసిన ఖర్చుల్లో ఇంకా క్రమబద్ధీకరించాల్సినవి

భారత రాజ్యాంగంలోని 205 వ అధికరణం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ఒక గ్రాంటు/అప్రోప్రియేషన్ కంటే అధికంగా చేసిన ఖర్చును ఆ రాష్ట్ర శాసన సభ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలి. అలా క్రమబద్ధీకరించుకోవడానికి ఎటువంటి గడువునూ ఈ అధికరణంలో నిర్దేశించకపోయినప్పటికీ, ప్రజా పద్దుల సంఘం (పి.ఎ.సి.) అప్రోప్రియేషన్ అకౌంట్లపై చర్చ పూర్తిచేసిన తరువాత అధిక ఖర్చులను క్రమబద్ధీకరించడం జరగాలి. ఐతే, సంబంధిత పరిపాలనా శాఖలు, ఆర్థిక శాఖ వివరణాత్మక నివేదికలు ఇవ్వని కారణంగా 2004-11 మధ్య సంవత్సరాలలో కేటాయింపులను మీరి చేసిన వ్యయం మొత్తం ₹2,687 కోట్లు 2012 జూలై నాటికి ఇంకా క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఆ వివరాలు ***అనుబంధం 2.2*** లో ఉన్నాయి. అలా క్రమబద్ధీకరించవలసిన అధిక ఖర్చుల మొత్తాలు సంవత్సరాలవారీగా **పట్టిక 2.7** లో పేర్కొనటం జరిగింది.

**పట్టిక 2.7 : గత సంవత్సరాలలో కేటాయింపుల కంటే అధికంగా చేసిన ఖర్చుల్లో క్రమబద్ధీకరించాల్సి ఉన్నవి**

(₹ కోట్లలో)

| సంవత్సరం | సంఖ్య | | కేటాయింపు కంటే అధికంగా చేసిన ఖర్చు | క్రమబద్ధీకరణ విషయంలో ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|
| | గ్రాంట్లు | అప్రోప్రియేషన్లు | | |
| 2004-05 | 5 | 1 | 15 | ఈ 61 గ్రాంట్లు, 18 అప్రోప్రియేషన్లకుగాను, 2012 జూలై నాటికి, 18 గ్రాంట్లు, 6 అప్రోప్రియేషన్లకు సంబంధించి వివరణాత్మక నివేదికలు అందాయి. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సాధారణ, సామాజికరంగాల తనిఖీ) వాటి పరిశీలన కూడా పూర్తిచేశారు.<br>మిగతా 43 గ్రాంట్లు, 12 అప్రోప్రియేషన్ల విషయంలో, వివరణాత్మక నివేదికలు పరిపాలనా శాఖలు/ఆర్థిక శాఖ నుండి రావలసి ఉంది. |
| 2005-06 | 10 | 3 | 586 | |
| 2006-07 | 7 | 1 | 199 | |
| 2007-08 | 7 | 3 | 201 | |
| 2008-09 | 11 | 3 | 709 | |
| 2009-10 | 10 | 2 | 110 | |
| 2010-11 | 11 | 5 | 867 | |
| **మొత్తం** | **61** | **18** | **2,687** | |

*మూలం : 2004-05 నుంచి 2011-12 సంవత్సరాల వినిమయ పద్దులు సంగ్రహం*

### 2.4.6 అనవసరపు అనుబంధ కేటాయింపులు

ఈ సంవత్సరం 33 కేసుల్లో, ప్రతి కేసులోనూ కోటి రూపాయలు లేదా అంతకంటే అధికంగా చేసిన అనుబంధ కేటాయింపులు అనవసరమని తేలింది. తొలుత కేటాయించిన నిధులే పూర్తిగా ఖర్చు కాకపోవటం వలన ఈ కేసుల్లో చేసిన మొత్తం ₹3,822 కోట్ల అనుబంధ కేటాయింపులూ అనవసరమని తెలుస్తోంది. వివరాలు ***అనుబంధం 2.3*** లో ఉన్నాయి.

ఈ దిగువ పేర్కొన్న శాఖలలో తొలి కేటాయింపులే ₹100 కోట్లకుపైగా మిగిలిపోవటంతో అనుబంధ నిధులు అక్కరలేదని తేలింది.

### పట్టిక 2.8: అనవసరపు అనుబంధ గ్రాంటుల జాబితా

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | తొలి కేటాయింపు | అసలు వ్యయం | తొలి కేటాయింపులో మిగులు | అనుబంధ కేటాయింపు |
|---|---|---|---|---|---|
| | **రెవెన్యూ - ఓటు చేసినది** | | | | |
| 1 | III - న్యాయ పాలన | 648.80 | 526.04 | 122.76 | 35.96 |
| 2 | XII - పాఠశాల విద్య | 13934.11 | 12147.23 | 1786.88 | 537.58 |
| 3 | XIII - ఉన్నత విద్య | 2472.63 | 1950.05 | 522.58 | 105.83 |
| 4 | XIV - సాంకేతిక విద్య | 794.51 | 692.52 | 101.99 | 27.88 |
| 5 | XVII - మునిసిపల్ పరిపాలన - పట్టణాభివృద్ధి | 3951.48 | 2680.01 | 1271.47 | 282.71 |
| 6 | XXI - సాంఘిక సంక్షేమం | 2040.36 | 1712.07 | 328.29 | 378.17 |
| 7 | XXII - గిరిజన సంక్షేమం | 1069.73 | 944.98 | 124.75 | 279.28 |
| 8 | XXV - స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం | 1914.58 | 1500.17 | 414.41 | 92.88 |
| 9 | XXVIII - పశుసంవర్ధక, మత్స్య | 909.22 | 704.85 | 204.37 | 57.95 |
| 10 | XXX - సహకారం | 306.72 | 165.89 | 140.83 | 2.15 |
| 11 | XXXI - పంచాయతీరాజ్ | 3918.23 | 2900.62 | 1017.61 | 181.98 |
| 12 | XXXVI - పరిశ్రమలు, వాణిజ్యం | 802.26 | 375.74 | 426.52 | 51.28 |
| 13 | XXXVIII - పౌరసరఫరా పరిపాలన | 2784.50 | 2450.74 | 333.76 | 2.50 |
| | **క్యాపిటల్-ఓటుచేసినది** | | | | |
| 14 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 2264.25 | 1727.90 | 536.35 | 346.34 |
| | **ఋణాలు-ఓటుచేసినది** | | | | |
| 15 | XVIII - గృహనిర్మాణం | 1339.63 | 1216.99 | 122.64 | 150.00 |

*మూలం : 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

### 2.4.7 అనవసరంగా చేసిన నిధుల పునః కేటాయింపులు

ఏదైనా ఒక గ్రాంటులోని, ఒక అంశంలో మిగిలిపోతాయని ముందుగా ఊహించిన నిధులను అదే గ్రాంటులో అదనపు నిధులు అవసరమైన మరో అంశానికి బదిలీ చేయటాన్ని పునః కేటాయింపు (రీ-అప్రోప్రియేషన్) అంటారు. 2011-12 సంవత్సరానికి 103 కేసులలో, నిధులను అధికంగానో, అనవసరంగానో, అసమగ్రంగానో రీ-అప్రోప్రియేషన్ చేయటం జరిగింది. దీనివలన నిధులను వినియోగించకపోవటంగానీ కేటాయింపులకంటే అధికంగా ఒక్కొక్క కేసులోనూ ₹10 కోట్లు, అంతకుమించి ఖర్చు చేయటంగానీ జరిగింది. ఆ వివరాలు ***అనుబంధం 2.4 లో*** ఉన్నాయి.

### 2.4.8 వివరణలు లేని పునః కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 20.17.2 ప్రకారం, అదనపు ఖర్చు లేదా మిగులుకు గల కారణాలను రీ-అప్రోప్రియేషన్ స్టేట్‌మెంట్లలో వివరించాల్సి ఉంది. 'వాస్తవ అవసరాలు/ఖర్చుల ఆధారంగా,' 'ఊహించిన మిగులు,' 'పొదుపు చర్యలు,' 'తొలి కేటాయింపు సరిపోదని లేదా అధికంగా ఉందని తేలింది', 'వాస్తవ పురోగతిని బట్టి' వంటి అస్పష్టమైన కారణాలను తెలుపకూడదు. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పునః కేటాయింపు ఆదేశాలను పరిశీలించగా, 13,248 అంశాలకుగాను 6,940 పునః కేటాయింపులలో (52 శాతం) మాత్రమే నిర్దిష్ట కారణాలను తెలిపారని వెల్లడైంది. మిగుళ్లకుకానీ, అధికవ్యయానికి కానీ సంబంధిత పాలనా శాఖలు, ఆర్థిక శాఖ ఉదహరించిన కారణాలలో పొంతనలేదు.

### 2.4.9 పెద్ద మొత్తంలో నిధులను తిరిగి అప్పగించడం

183 ఉప పద్దుల విషయంలో, ప్రతి కేసులోనూ ₹10 కోట్లకంటే అధికంగానూ, మొత్తం కేటాయింపులో 50 శాతం కంటే ఎక్కువగానూ నిధులను పెద్ద మొత్తంలో తిరిగి అప్పగించటం (సరెండరు చేయడం) జరిగింది. దీనికి ప్రధాన కారణాలు - (i) రిజర్వు బ్యాంకు నుంచి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు తీసుకోకపోవటం, (ii) పాలనాపరమైన కారణాలవలన నిధులు విడుదల చేయకపోవటం, (iii) పనుల పురోగతి మందగించటం, పనులు వాయిదాపడటం, (iv) కేంద్రం నుంచి గ్రాంట్లు రాకపోవటం, (v) ఉద్యోగాలలో ఖాళీలు భర్తీ చేయకపోవటం, (vi) ఆర్.ఐ.డి.ఎఫ్.[6] కింద నాబార్డు పనులకు ఒప్పందం చేసుకొనకపోవటం, (vii) పాలనాపరమైన అనుమతులు రాకపోవటం (viii) భూసేకరణ అవార్డులు పరిష్కరించకపోవటం.

183 ఉప పద్దులలో కేటాయింపుల మొత్తం ₹15,873 కోట్లు కాగా, అందులో నుండి ₹13,362 కోట్లను (84 శాతం) తిరిగి అప్పగించటం జరిగింది. వీటిలోని 62 ఉప పద్దులలో, నూటికి నూరు శాతం కేటాయింపులను (₹6,556 కోట్లను) సరెండరు చేశారు. వంద కోట్ల రూపాయల కంటే ఎక్కువగానూ, కేటాయింపుల్లో 90 శాతానికంటే అధికంగానూ సరెండరు చేసిన కేసుల వివరాలను ***అనుబంధం 2.5*** లో ఇవ్వడమైంది. ప్రభుత్వం ఈ కేటాయింపుల ఆవశ్యకతను మరింత వాస్తవికంగా అంచనా వేసి ఉండాల్సింది.

### 2.4.10 గంపగుత్తగా కేటాయించడం

బడ్జెట్ అంచనాల్లో గంపగుత్త కేటాయింపులు చేయరాదని బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 16.12 లో నిర్దేశించినప్పటికీ, ఇందుకు విరుద్ధంగా, బడ్జెట్ అంచనాల్లో ₹1,205 కోట్ల మొత్తాన్ని ఇలా గంపగుత్తగా కేటాయించారు. ఐతే, సంవత్సరాంతానికి ఈ మొత్తం కేటాయింపులలో ₹1,130 కోట్లు (94 శాతం) వినియోగం కాకుండా మిగిలి పోయాయి. దీనికి సంబంధించిన వివరాలను ఈ దిగువ పట్టికలో చూడవచ్చును.

[6] ఆర్.ఐ.డి.ఎఫ్ : గ్రామీణ మౌలికాభివృద్ధి నిధి; నాబార్డు; గ్రామీణ, వ్యవసాయాభివృద్ధికి జాతీయ బ్యాంకు

### పట్టిక 2.9 : గంపగుత్త కేటాయింపులు

(₹ కోట్లలో)

| వరుస సంఖ్య | గ్రాంటు సంఖ్య - పేరు | పద్దు | బడ్జెట్ కేటాయింపులు | సరెండరు చేసిన మొత్తం |
|---|---|---|---|---|
| 1 | IX - ద్రవ్య పాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 2052-090-75 - గంపగుత్త కేటాయింపు | 700.00 | 700.00 |
| 2 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 5054-04-789-36 - పి.పి.పి. ప్రాజెక్టుల కోసం గంపగుత్త కేటాయింపు | 32.40 | 32.40 |
| 3 | | 5054-04-796-36 - పి.పి.పి. ప్రాజెక్టుల కోసం గంపగుత్త కేటాయింపు | 13.20 | 13.20 |
| 4 | | 5054-04-800-36 - పి.పి.పి. ప్రాజెక్టుల కోసం గంపగుత్త కేటాయింపు | 154.40 | 79.72 |
| 5 | XII - పాఠశాల విద్య | 2202-01-800-75 - గంపగుత్త కేటాయింపు | 15.05 | 15.05 |
| 6 | XIII - ఉన్నత విద్య | 2202-03-001-75 - గంపగుత్త కేటాయింపు | 35.65 | 35.65 |
| 7 | | 2202-03-102-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా చేయాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకు గల కాలానికి 20 శాతం బకాయిలు) | 77.20 | 77.20 |
| 8 | | 2202-03-102-75 - గంపగుత్త కేటాయింపు | 141.97 | 141.97 |
| 9 | | 2202-03-104-75 - గంపగుత్త కేటాయింపు | 4.06 | 4.06 |
| 10 | | 2202-03-789-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి త ప్పనిసరిగా చేయాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకు గల కాలానికి 20 శాతం బకాయిలు) | 16.20 | 16.20 |
| 11 | | 2202-03-796-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా చేయాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకు గల కాలానికి 20 శాతం బకాయిలు) | 6.60 | 6.60 |
| 12 | XVI - వైద్యం, ఆరోగ్యం | 2210-01-001-75 - గంపగుత్త కేటాయింపు | 7.92 | 7.92 |
| | | మొత్తం | 1,204.65 | 1,129.97 |

*మూలం : 2011-12 సంవత్సరపు వినిమయ పద్దులు*

పైన పేర్కొన్న వివరాలు పరిశీలించగా, ఐదు గ్రాంట్ల కింద ఉన్న 12 ఉప పద్దులకు గాను 11 ఉప పద్దులలో కేటాయించిన మొత్తం నిధులు వినియోగం కాలేదు. తొమ్మిది ఉప పద్దులకు (క్రమ సంఖ్యలు 1, 5 నుండి 12) సంబంధించిన ₹1,005 కోట్ల నిధులను ఆర్థిక సంవత్సరం చివరి రోజుననే సరెండరు చేశారు.

ఆడిట్ వ్యాఖ్యలను ప్రభుత్వం అంగీకరిస్తూ, తగు దిద్దుబాటు చర్యలు చేపడతామని హామీ ఇచ్చింది (2012 నవంబరు).

### 2.4.11 వాస్తవ మిగుళ్లకంటే అధికంగా నిధులను తిరిగి అప్పగించడం

బడ్జెట్ మాన్యువల్ నిబంధనల (పేరా 20.2.2) ప్రకారం ఏవైనా గ్రాంట్లు/అప్రోప్రియేషన్లలో మిగుళ్లు ఏర్పడతాయని ముందుగానే తెలిస్తే ఆ నిధులను ఖర్చుచేసే శాఖలు అలాంటి మిగుళ్లను వెంటనే ఆర్థిక శాఖకు తిరిగి అప్పగించాలి. ముందుగా ఊహించిన మిగుళ్లను సరెండర్ చేసి ఆ తరవాత సంబంధిత నియంత్రణాధికారులు మళ్లీ నిధులను ఖర్చు చేయటం వలన ఆయా గ్రాంటు/అప్రోప్రియేషన్‌లలో మొత్తమ్మీద అంతిమంగా ఏర్పడిన మిగులు కంటే అధిక మొత్తాన్ని సరెండర్ చేసినట్లవుతోంది.

21 కేసుల్లో, వాస్తవంగా మిగిలిన మొత్తంకన్నా అప్పగించిన మొత్తం (ప్రతి కేసులోనూ ₹50 లక్షలు, ఆపైన) ఎక్కువగా ఉంది. ఇది ఆయా శాఖలలో ఆర్థికపరమైన నియంత్రణ, పర్యవేక్షణ లోపించటాన్ని సూచిస్తోంది. వాస్తవంగా ఏర్పడిన మిగుళ్లు ₹6,886 కోట్లు కాగా ₹8,204 కోట్లను (₹1,318 కోట్లు అధికంగా) సరెండర్ చేసారు. వివరాలు ***అనుబంధం 2.6*** లో ఉన్నాయి.

### 2.4.12 మిగుళ్లను అప్పగించకపోవడం

2011-12 సంవత్సరం ముగిసే నాటికి, 4 గ్రాంట్లు, 4 అప్రోప్రియేషన్లలో మొత్తం ₹290 కోట్లు మిగిలిపోయినా సంబంధిత శాఖలు వాటిని సరెండర్ చేయలేదు. **(*అనుబంధం 2.7*).**

అదే విధంగా, 30 గ్రాంట్లు/అప్రోప్రియేషన్ల కింద ₹12,762 కోట్ల మిగుళ్లు ఏర్పడగా, ₹5,024 కోట్ల మిగుళ్లను (ప్రతి కేసులోనూ ₹5 కోట్లు అంతకుమించి ఉన్నవి) సరెండరు చేయలేదు. మొత్తం మిగుళ్ల (₹24,700 కోట్లు) లో ఇవి 20 శాతం ఉన్నాయి. ఆ వివరాలు ***అనుబంధం 2.8*** లో చూడవచ్చును.

అంతేకాకుండా, 79 కేసుల్లో (ప్రతి కేసులోనూ ₹10 కోట్ల కంటే ఎక్కువ నిధులను సరెండరు చేసిన కేసులు), ₹20,522 కోట్లు (మొత్తం ₹24,700 కోట్ల మిగుళ్లలో 83 శాతం) 2012 మార్చి నెలలోని చివరి రెండు పని దినాలలో సరెండరు చేశారు **(*అనుబంధం 2.9*)**. ఆర్థిక నియంత్రణ తగినంతగా లేదనీ, వ్యయ సామర్థ్యం చాలా తక్కువగా ఉందనీ దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

### 2.4.13 హడావిడి ఖర్చులు

ఖర్చులు ఏడాది పొడవునా సమంగా ఉండాలనీ, ఏదైనా అప్రోప్రియేషన్ మురిగిపోకుండా ఉండేందుకు మార్చి నెలలో అనవసరపు హడావిడి ఖర్చులు చేయకూడదనీ ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని 39 వ అధికరణం నిర్దేశిస్తోంది.

చార్టు 2.1 : నెలవారీ వ్యయం




ఐతే, ఈ నిబంధనలకు విరుద్ధంగా, 2011 ఏప్రిల్ నుంచి 2012 ఫిబ్రవరి వరకూ ప్రతి నెలలో చేసిన ఖర్చు మొత్తం ఖర్చు ₹1,04,137 కోట్లు (రెవెన్యూ, క్యాపిటల్ రెండు విభాగాల్లో కలిపి) లో 5 నుంచి 9 శాతం వరకు ఉండగా, 2012 మార్చి నెలలో మాత్రం ఇది 19 శాతం ఉంది. ఆర్థిక సంవత్సరం చివర్లో హడావిడి ఖర్చులు చేసారని దీనిని బట్టి స్పష్టమౌతోంది.

*మూలం : ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఎ.& ఇ.) రూపొందించిన సివిల్ పద్దులు*

## 2.5 ప్రధానమైన విధాన నిర్ణయాలు

2011-12 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలోనూ, వార్షిక ప్రణాళికలోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన విధాన నిర్ణయాలు, పథకాలలో కొన్నింటిని మచ్చుకు తనిఖీచేసి వాటి అమలు తీరును ఆడిట్‌లో పరిశీలించగా ఈ దిగువ విషయాలు వెలుగు చూశాయి.

**2.5.1** నేత కార్మిక సహకార సంఘాలనూ, నేత కార్మికులనూ అప్పుల బారినుంచి తప్పించేందుకు ప్రభుత్వం "నేత కార్మికుల ఋణ మాఫీకి సహాయం" పేరిట ఒక పథకం ప్రవేశపెట్టి 2011-12 బడ్జెట్‌లో ₹200 కోట్లు కేటాయించింది. కానీ, ఈ సంవత్సరం కేవలం ₹32.88 కోట్లు (16 శాతం) మాత్రమే ఇందుకు విడుదల చేసింది.

**2.5.2** "రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్" అనే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం రాష్ట్రంలో అమలవుతున్నది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75 : 25 వంతున నిధులు సమకూరుస్తాయి. మాధ్యమిక విద్యను 14 నుంచి 18 సంవత్సరాల ప్రాయం వారికి అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రతి మాధ్యమిక పాఠశాలకూ అవసరమైన మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బందినీ సమకూర్చటంతోపాటు ప్రభుత్వం/స్థానిక సంస్థ/ఎయిడెడ్ పాఠశాలలకు ఆర్థిక సాయం కూడా అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 2011-12 లో తన వంతు వాటాగా ₹300 కోట్లు కేటాయించింది. మొత్తం విడుదల చేసిన ₹322.05 కోట్లకు (కేంద్రం వాటా ₹227.90 కోట్లు, రాష్ట్రం వాటా ₹94.15 కోట్లు)గానూ ₹225.52 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రాష్ట్ర ప్రాజెక్టు కార్యనిర్వాహక కమిటీ ఆమోదించక పోవటంతో ₹96.53 కోట్ల మేర ఖర్చు చేయలేదని చెప్పారు. వినియోగం కాకుండా మిగిలిన నిధులు (గతంలో మిగిలిన నిల్వలతో కలిపి) కాలపరిమితి స్వీప్ డిపాజిట్లలో పెట్టారు.

**2.5.3** మాధ్యమిక స్థాయిలో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో "శ్రేష్ఠతకు ప్రమాణంగా బ్లాకుస్థాయిలో ఆదర్శ పాఠశాలల స్థాపన" పేరుతో కేంద్ర ప్రాయోజిత పథకాన్నొకదాన్ని చేపట్టారు. దీని వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75 : 25 వంతున భరించాలి. రాష్ట్రం తన వాటాగా 2011-12 బడ్జెట్‌లో ₹200 కోట్లు కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం తన వంతుగా ₹412.09 కోట్లు 2011 జూలైలోనే ఇచ్చినాగానీ రాష్ట్రం తన వాటా ₹137.36 కోట్లు విడుదల చేయలేదు. అంతేకాకుండా, కేంద్రం నుంచి వచ్చిన నిధుల నుంచి కేవలం ₹6.33 కోట్లు మాత్రం ఖర్చుచేసి, ₹400 కోట్లు కాలపరిమితి డిపాజిట్లలో పెట్టింది.

**2.5.4** కిశోరప్రాయ బాలికలలో స్వయంవికాసం పెంపొందించేందుకు, 11 నుంచి 18 సంవత్సరాల వయసు ఆడపిల్లల కోసం వారికి అవగాహన కల్పించి, వారి పోషణ, ఆరోగ్యం మెరుగుపరచే దిశగా కేంద్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ కిశోర బాలికల సమున్నతి (సబల) పథకాన్ని ప్రవేశపెట్టింది. 2011-12 సంవత్సరం బడ్జెట్ కేటాయింపు ₹124.91 కోట్లు కాగా, కేవలం ₹20.25 కోట్లు (16 శాతం) మాత్రమే ఖర్చయింది.

**2.5.5** బాలింతలకు, చూలింతలకు ప్రసవసాయంగా నగదు ప్రోత్సాహకం నేరుగా అందచేసే విధంగా "ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజన" అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2010 అక్టోబరులో ప్రవేశ పెట్టింది. ఇది నూరు శాతం కేంద్ర ప్రాయోజిత పథకం. పథకాన్ని 2011-12 లో పశ్చిమ గోదావరి, నల్గొండ జిల్లాలలో చేపట్టి కేంద్రం ₹10.32 కోట్లు అందచేసింది. ఐతే, 2012 మార్చి నాటికి ₹1.26 కోట్లు మాత్రమే ఖర్చయింది.

**2.5.6** బడ్జెటింగ్, అకౌంటింగ్ ప్రక్రియలో భాగస్వాముల మధ్య లోపరహిత అనుసంధానం కల్పించేందుకుగాను ప్రభుత్వం ఒక సమీకృత ఆర్థిక నిర్వహణ వ్యవస్థను రూపొందించి 2011-12 బడ్జెట్‌లో ₹100 కోట్లు కేటాయించింది. అయితే, ప్రతిపాదనలకు అభ్యర్థన పంపకపోవటం, సిస్టం ఇంటిగ్రేటర్‌ను నియమించకపోవటం వలన 2011-12 లో ₹1.65 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

**2.5.7** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారి ప్రాజెక్టు (ఏ.పి.ఎస్.హెచ్.పి.) కింద రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేసి, నిర్వహించేందుకు గాను ఏ.పి. రోడ్ సెక్టార్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు ఆమోదించాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ₹3,165 కోట్లు కాగా 2011-12 బడ్జెట్‌లో ₹600 కోట్లు కేటాయించారు. సంబంధిత

రికార్డులు పరిశీలించగా సాధారణ అంశం కింద ఇచ్చిన ₹463.20 కోట్ల బడ్జెట్ కేటాయింపు నుంచి ₹221.27 కోట్లు (48 శాతం) మాత్రమే ఖర్చు చేశారు.

**2.5.8** ప్రభుత్వం 2011-12 లో 'ఇందిరమ్మ' గ్రామీణ పథకం కింద 2,93,000 ఇళ్లనూ, 'ఇందిరమ్మ' పట్టణ పథకం కింద 50,000 ఇళ్లనూ నిర్మించ తలపెట్టి ₹571.25 కోట్లు (గ్రామీణ పథకానికి ₹514.12 కోట్లు, పట్టణ పథకానికి ₹57.13 కోట్లు) బడ్జెట్‌లో కేటాయించింది. ఐతే, ఇందులో కేవలం ₹142.81 కోట్లు మాత్రమే (గ్రామాలకు ₹128.53 కోట్లు, పట్టణాలకు ₹14.28 కోట్లు)సబ్సిడీగా ఇచ్చింది. నిధులు ఆమేరకే ఖర్చయ్యాయి.

**2.5.9** జాతీయ గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా ₹100 కోట్లు కేటాయించినా, 2011-12 లో నిధులేవీ విడుదల చేయలేదు.

**2.5.10** ఉద్యోగార్థులకు తగిన నైపుణ్యం కల్పించి, వారు ప్రైవేటు సంస్థలలో ఉద్యోగావకాశాలు పొందేలా చేసేందుకు ప్రభుత్వం ఉద్యోగ కల్పన కార్యక్రమాన్నొకదాన్ని చేపట్టి "రాజీవ్ ఉద్యోగశ్రీ సొసైటీని" స్థాపించింది. ఇందు కోసం 2011-12 బడ్జెట్‌లో ₹40 కోట్లు కేటాయించింది. అయితే, ₹10 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. రెండవ, మూడవ, నాలుగవ త్రైమాసికాలకు ప్రభుత్వం నిధులు (₹30 కోట్లు) విడుదల చేయలేదు.

**2.5.11** గ్రామీణ పారిశుధ్యం కోసం పంచాయతీరాజ్ సంస్థలకు సహాయం కింద ప్రభుత్వం ₹100 కోట్లు కేటాయించింది. ఐతే, ఈ పథకం కింద ₹28 కోట్లు మాత్రమే వెచ్చించింది. లక్ష్యంగా పెట్టుకున్న 9.28 లక్షల వ్యక్తిగత మరుగు దొడ్లకుగాను 0.91 లక్షలు (9.8 శాతం) మాత్రమే పూర్తి చేశారు.

**2.5.12** పేద పిల్లలకు 'మధ్యాహ్న భోజనం' సమకూర్చేందుకు కేటాయించిన ₹1,112 కోట్లకుగాను ప్రభుత్వం ఈ పథకం కింద ఈ సంవత్సరం ₹673 కోట్లు (61 శాతం) మాత్రమే ఖర్చుచేసింది.

## 2.6 ఆకస్మిక ఖర్చుల నిధి నుండి అడ్వాన్సులు

భారత రాజ్యాంగపు అధికరణాలు - 267(2), 283(2) లలోని నిబంధనలననుసరించి, ఆంధ్రప్రదేశ్ కంటింజెన్సీ ఫండ్ చట్టం - 1957 ప్రకారం రాష్ట్ర ఆకస్మిక ఖర్చుల నిధి (కంటింజెన్సీ ఫండ్) ఏర్పాటయింది. ముందుగా ఊహించని అత్యవసరమైన ఖర్చుల కోసం మాత్రమే ఈ నిధి నుండి అడ్వాన్సులను తీసుకోవచ్చు. ఎప్పటికప్పుడు తిరిగి భర్తీ చేసే రీతిలో ₹50 కోట్ల నిల్వ ఉండే విధంగా ఈ నిధిని ఏర్పరచారు.

2011-12 సంవత్సరంలో ఈ నిధినుంచి డ్రాచేసేందుకు ₹4.02 కోట్ల మేర 73 అనుమతులు ఇచ్చారు. వీటిలో ₹3.96 కోట్లు ఖర్చు చేసి, ₹3.75 కోట్లు తిరిగి జమచేశారు. ఇంకా ₹21 లక్షలు జమ చేయవలసి ఉంది. ఇంతేకాక, 2010-11 సంవత్సరానికి సంబంధించిన ₹1.54 కోట్లు కూడా ఈ సంవత్సరం జమచేశారు.

ఈ నిధినుంచి 2011-12 లో తీసుకొన్న ₹4.02 కోట్ల ₹2.72 కోట్లు (68 శాతం) డిక్రీ ఛార్జీల చెల్లింపులు. ఈ డిక్రీ ఛార్జీలు 2011-12కు ముందు న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలకు సంబంధించినవి. మచ్చుకు ఐదు అనుమతులు (₹1.51 కోట్లు) పరిశీలించగా గతంలో (2006 సెప్టెంబరు నుంచి 2010 జులై వరకు) గౌరవ న్యాయస్థానాలు ఆదేశించినాగానీ, ప్రభుత్వ ఆస్తులను జప్తు చేసేవరకూ, కోర్టు ధిక్కరణ కేసులను ప్రారంభించే వరకూ ప్రభుత్వం ఈ చెల్లింపులను వాయిదా వేసింది. ఈ చెల్లింపులు అత్యవసరమైనవిగానీ ముందు ఊహించలేనివిగానీ కాదు కాబట్టి వీటి కోసం వార్షిక బడ్జెట్‌లో కానీ, అనుబంధ అంచనాలలో కానీ నిధులు కేటాయించి ఉండ వచ్చును.

## 2.7 బడ్జెట్ ప్రక్రియలో లోపాలు

రాష్ట్ర ప్రభుత్వపు బడ్జెట్ ప్రక్రియలో ఈ కింది లోపాలను/తప్పులను గమనించడమైంది :

**2.7.1** ***సవరణలను పొందుపరచకపోవటం :*** బడ్జెట్ ప్రక్రియలోని లోపాలు, తప్పులను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఎ.&ఇ.) ఏటా ఆర్థిక శాఖకు సూచిస్తూనే ఉన్నారు. ఐతే, మేజర్ హెడ్, మైనర్ హెడ్‌ల జాబితాకు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్, ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న సవరణలను తర్వాత సంవత్సరాల్లోని బడ్జెట్ అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం పొందుపరచటం లేదు. వివరాలను ***అనుబంధం 2.10*** లో ఇవ్వటం జరిగింది.

**2.7.2** ***అనధికార సబ్ మేజర్ హెడ్/మైనర్ హెడ్‌ల నిర్వహణ:*** 2501 - గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం అనే పద్దు కింద సబ్ మేజర్ హెడ్ 01 ఇంకా దాని కింది అన్ని మైనర్ హెడ్‌లను 2003 లోనే తొలగించటంతో ఇప్పుడవి వాడుకలోలేవు. కానీ, సబ్ మేజర్ హెడ్ 01ను ఇంకా నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో దిద్దుబాటు చర్యకు ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 నవంబరు).

**2.7.3** ***రాబడిని తప్పుగా నమోదు చేయడం :*** కారాగార ఉత్పత్తులను అమ్మగా వచ్చిన సొమ్మును లెక్కరాసేందుకుగాను కారాగారాల ప్రధాన పద్దు 0056 కింద ఉప పద్దు 102 ను ప్రత్యేకించారు. కానీ ఈ మొత్తం ఆదాయాన్ని "యూజర్ ఛార్జీలు" గా పరిగణించి 0056-800 - ఎస్.హెచ్. (02) కారాగార ఉత్పత్తుల అమ్మకం - 800 యూజర్ ఛార్జీలుగా చూపుతున్నారు. అదేవిధంగా, 0051 - పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రధాన పద్దు కింద పరీక్షా రుసుము మొత్తాన్ని యూజర్ ఛార్జీ వసూళ్లుగా పరిగణిస్తున్నారు.

ఇటువంటి ఆదాయాన్ని యూజర్ ఛార్జీలుగా జమ చేసేందుకు కారాగారాల శాఖను, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌నూ అనుమతించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం తెలియజేసింది.

**2.7.4** ***వర్గీకరణ దోషాలు:*** సబ్సిడీలను 330 - సబ్సిడీలు అనే వివరణాత్మక పద్దు బదులు 310 - సహాయక గ్రాంట్లు కింద నమోదు చేస్తున్నారు. వ్యవసాయ సంబంధిత సబ్సిడీ కోసం ఏ.పి. ట్రాన్స్‌కోకు ఇచ్చిన ₹4,300 కోట్లను ప్రధాన పద్దు 2801-05-800 - ఉప పద్దు (06) కింది 310 - సహాయక గ్రాంట్లుగా చూపుతున్నారు. ప్రభుత్వం ఈ పొరపాటుని అంగీకరించి సవరిస్తామని చెప్పింది (2012 నవంబరు).

**2.7.5** అధిక ఓల్టేజీ పంపిణీ వ్యవస్థ కోసం ఏ.పి. ట్రాన్స్‌కో సంస్థకు ఋణ రూపేణా 2011-12లో ఇచ్చిన మొత్తం ₹148 కోట్లు తిరిగి సూపర్ క్రిటికల్ తాప విద్యుత్ కేంద్రం, కృష్ణపట్నం కోసం ఏ.పి. జెన్‌కో సంస్థకు ఋణంగా రీ-అప్రోప్రియేట్ చేశారు. ఇంకా 2009-10, 2010-11 సంవత్సరాలలో ₹1.00 కోటి చొప్పున చేసిన మొత్తం కేటాయింపును ఏ.పి. జెన్‌కో సంస్థకు రీ-అప్రోప్రియేట్ చేయటం వలన బడ్జెట్ కేటాయింపుల ప్రయోజనం నెరవేరలేదు.

**2.7.6** అలాగే, కృష్ణపట్నం తాప విద్యుత్ ప్రాజెక్టు కోసం ఏ.పి. ట్రాన్స్‌కో సంస్థకు 2010-11, 2011-12 సంవత్సరాలకు అప్పు కింద కేటాయించిన ₹330 కోట్లు మొత్తం సూపర్ క్రిటికల్ తాప విద్యుత్ కేంద్రం, కృష్ణపట్నం కోసం ఏ.పి. జెన్‌కో సంస్థకు ఋణంగా రీ-అప్రోప్రియేట్ చేశారు. ఇంతేకాక, కృష్ణ పట్నం థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం ఏ.పి. ట్రాన్స్‌కోకి అప్పు కింద ఇచ్చిన ₹150 కోట్లు 2009-10లో వినియోగించుకోలేదు.

**2.7.7** ***బడ్జెట్ అంచనాలలో వర్గీకరణ దోషాలు:*** '530-ప్రధాన పనులు' అనే వివరణాత్మక పద్దును క్యాపిటల్ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా రెవెన్యూ విభాగం కింద నిర్వహిస్తున్నారు. ఇందుకు నిదర్శనగా కొన్ని కేసులను ***అనుబంధం-2.11***లో వివరించటం జరిగింది. ప్రభుత్వం ఈ దోషాలను అంగీకరించి, సవరణ చర్యలకు హామీ ఇచ్చింది (2012 నవంబరు).

**2.7.8** అదేవిధంగా 270 - చిన్న తరహా పనులు, 310 - సహాయక గ్రాంట్లు అనే వివరణాత్మక పద్దులను రెవెన్యూ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా, XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు, XVII - మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల, XXXIV - చిన్నతరహా నీటిపారుదల పద్దులలో క్యాపిటల్ విభాగాల కింద గ్రాంట్లుగా చూపటం జరుగుతోంది. ఇటువంటి కొన్ని సందర్భాలను ***అనుబంధం-2.12, 2.13***లలో విశదీకరించటం జరిగింది.

## 2.8 సారాంశం

*2010-11లో మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రక్రియలో పలు లోపాలు గోచరించాయి. బడ్జెట్ రూపకల్పనలో తప్పులున్నాయి. వర్గీకరణ దోషాలు కొనసాగాయి. ఆవశ్యకతపై స్పష్టత లేకుండానే (చివరకి తిరిగి ఇచ్చేందుకే) గంపగుత్తగా కేటాయింపులు జరిగాయి. కేటాయింపులను మించిన వ్యయం, బడ్జెట్ కేటాయింపు లేకుండానే ఖర్చు చేయటం వంటివీ చోటు చేసుకున్నాయి. తగు వివరణ ఇవ్వకుండానే రీఅప్రోప్రియేషన్లకు పాల్పడటం, నిధుల ఏర్పాటు లేకుండానే ఖర్చు పెట్టటం వంటి విధానాలతో పలు ప్రభుత్వ శాఖలు ఆర్థిక నియమాలను అవహేళన చేశాయి. కొన్ని గ్రాంట్లలో నిరంతరంగా ఏర్పడుతున్న మిగుళ్ళు, మరికొన్నిగ్రాంట్లలో ₹500 కోట్లకు పైగానూ, బడ్జెట్ కేటాయింపులో 20 శాతం కంటే ఎక్కువ మిగిలిపోవటం వంటివి బడ్జెట్ రూపకల్పన విషయమై పలు సందేహాలకు తావిస్తున్నాయి.*

*బడ్జెట్ కేటాయింపులో ఆరవ వంతుకు మించి నిధులు ఖర్చుకాకపోవటం, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులు వినియోగంకాకపోవటం బడ్జెట్‌ను రూపొందించే ప్రక్రియపట్ల అనుమానాలను రేకెత్తిస్తోంది. ద్రవ్య సూచీలకు సంబంధించినంత వరకూ ఇది ఆరోగ్యవంతమైన ధోరణిని కనబరచినా, ప్రభుత్వం ప్రకటించిన/చేపట్టిన వివిధ విధాన నిర్ణయాల అమలుమీద ప్రతికూల ప్రభావం చూపుతుంది.*

## 3.1 పరిచయం

పటిష్టమైన అంతర్గత నియంత్రణలు కలిగి ఉండడం, నియమాలూ, పద్ధతులను పాటించడం సుపరిపాలనకు ప్రముఖంగా తోడ్పడతాయి. యుక్తమైన, విశ్వసనీయమైన, సత్వర ఆర్థిక విషయాల నివేదన జరిగేలా భరోసానివ్వడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం తన మౌలిక కార్య నిర్వాహక బాధ్యతలను నిర్వర్తించడంతోపాటు, వ్యూహాత్మక ప్రణాళికా రచనలోనూ, తగు నిర్ణయాలను తీసుకోవడంలో కూడా ఇవి సహాయపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వివిధ ఆర్థిక నియమాలు, పద్ధతులు, నిర్దేశాలను అనుసరించిన వైనం ఈ అధ్యాయంలో పరిశీలించటం జరిగింది.

## 3.2 వినియోగ ధృవపత్రాలు

వివిధ సామాజిక, ఆర్థికాభివృద్ధి పథకాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వినియోగ ధృవపత్రాలను (యు.సి.లు) పంపించాలి. అలాగే, ఏదైనా నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఇచ్చిన గ్రాంట్ల విషయంలో సంబంధిత శాఖాధికారులు ఆయా గ్రాంట్లను పొందిన సంస్థలనుండి వినియోగ ధృవపత్రాలను తెప్పించుకొని, వాటిని పరిశీలించి పి.ఎ.జి. (ఎ&ఇ)కి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు[1] నిర్దేశిస్తున్నాయి. ఐతే, 1992-93 నుంచి 2011-2012 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ₹85 కోట్లకు సంబంధించిన 214 యూ.సి.లు ***అనుబంధం 3.1 లో*** చూపినట్లు ఒకటి నుండి 18 సంవత్సరాలుగా బకాయిల్లో ఉన్నాయి (2012 మార్చి 31 నాటికి ).

## 3.3 స్వయంపాలక సంస్థల పద్దులు/ఆడిట్ నివేదికల సమర్పణ

వైద్య విద్య, గిరిజన సంక్షేమం, పట్టణాభివృద్ధి మొదలైన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు స్వయంపాలక సంస్థలను ఏర్పరచింది. ఇలాంటి 18 సంస్థల పద్దుల తనిఖీని భారత కంప్ట్రోలర్-ఆడిటర్ జనరల్ (సి.ఎ.జి.) కి అప్పగించడం జరిగింది. ఐతే, 2011-12 నాటికి వార్షిక పద్దుల విషయంలో, మొత్తం 18 సంస్థలూ బకాయి ఉన్నాయి. తనిఖీ కోసం పద్దులను సమర్పించడంలో జరిగిన జాప్యం (2012 జూన్ నాటికి) మూడు నెలల నుండి 99 నెలల వరకూ ఉంది. ఈ బకాయిల వివరాలు ***అనుబంధం 3.2*** లో ఉన్నాయి.

ఆర్థికపరమైన అవకతవకలు ఏమైనా జరిగి ఉంటే వాటిని గుర్తించేందుకుగాను నిర్దిష్ట కాలపరిమితిలో పద్దులను సంకలనం చేసి తనిఖీకి సమర్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

అంతేగాక, కంప్ట్రోలర్-ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనలు) చట్టం, 1971లోని 14, 15 సెక్షన్ల కింద ఏఏ సంస్థలు ఆడిట్ పరిధిలోకి వస్తాయో గుర్తించడానికిగాను ఆయా సంస్థలకు ఇచ్చిన ఆర్థిక సహాయం మొత్తం, ప్రయోజనం, సంస్థల మొత్తం వ్యయం మొదలైన వివరాలను ప్రభుత్వం/శాఖాధిపతులు విధిగా ప్రతి సంవత్సరం ఆడిట్‌కు తెలియచేయాలి. ఐతే, 2011-12 సంవత్సరం వరకు ఆర్థిక సహాయం పొందిన 358 సంస్థలు 2012 జూన్ వరకు తమ పద్దులు (మొత్తం 1,983) ఆడిట్‌కు సమర్పించలేదు. ఈ పద్దుల వివరాలు ***అనుబంధం 3.3*** లో ఇవ్వడమైంది.

ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌కు వార్షిక పద్దులు అందజేయాల్సిందిగా స్వయంపాలక సంస్థలను ఆదేశించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

---

[1] ఆంధ్ర ప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని అధికరణం 211 ఎ (2) కింద నోటు 1

## 3.4 రికన్సిలియేషన్ చేయని ఖర్చులు, రాబడులు

ఖర్చును బడ్జెట్ గ్రాంట్ల పరిధిలోనే ఉంచుతూ, వాటి పద్దుల ఖచ్చితత్వానికి భరోసాయిస్తూ, ప్రభావవంతంగా నియంత్రించుటకు గాను వివిధ శాఖల నియంత్రణాధికారులను సమాయత్తం చేయడానికి వారి పుస్తకాలలో, ఆ ఆర్థిక సంవత్సరంలో నమోదైన నెలవారీ ఖర్చును పిఏజి (ఏ&ఇ) పుస్తకాలలోని ఖర్చుతో సరిపోల్చుకోవాలని ఆర్థిక నియమాలు[2] నిర్దేశిస్తున్నాయి. ప్రభుత్వ శాఖలు తమ పద్దులను సరిపోల్చుకోకపోవడాన్ని ఆడిట్ రిపోర్టులలో పదేపదే ఆక్షేపించినాగానీ, ఈ విషయంలో నియంత్రణాధికారుల లోపాలు 2011-12 సంవత్సరంలో కూడా కొనసాగాయి.2011-12 లో అయిన మొత్తం ఖర్చు[3] ₹1,09,120 కోట్లకుగాను ₹25,118 కోట్ల ఖర్చును (23 శాతం) 263 మంది నియంత్రణాధికారులు 2012 జూన్ నాటికి రికన్సయిల్ చేయలేదు. 14 మంది నియంత్రణాధికారులకు సంబంధించి ప్రతి కేసులోనూ ₹500 కోట్లు, అంతకు మించిన రికన్సయిల్ చేయని ఖర్చు వివరాలు ***అనుబంధం 3.4*** లో ఇవ్వడమైంది.

అంతేగాక, ప్రతీ నియంత్రణాధికారి, తమ కింది అధికారులనుండి వారు పొందిన/ఖజానాలో జమచేసిన సొమ్ముకు సంబంధించిన పద్దులను, నివేదికలను క్రమం తప్పకుండా తెప్పించుకొని పిఏజి (ఏ&ఇ) ఖాతాలతో సరిపోల్చుకొని, ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు వీలైనంత త్వరగా లెక్కలలో తేడాలను రికన్సయిల్ చేసుకోవాలి. అయినప్పటికీ 2011-12 సంవత్సరంలో 50 పద్దుల కింద ₹57,342 కోట్లు (₹93,718 కోట్లమొత్తం రాబడులలో 61శాతం) రాబడులను[4] సంబంధిత నియంత్రణాధికారులు రికన్సయిల్ చేయలేదు.

2012-13 సంవత్సరంలో అమలుచేస్తున్న సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానం (సి.ఎఫ్.ఎమ్.ఎస్) వల్ల, రికన్సిలియేషన్ అంశాలను కనిష్ట స్థాయికి తేవడం ద్వారా ఈ సమస్యను అధిగమించ వచ్చని ప్రభుత్వం తెలిపింది.

## 3.5 ఖజానాల పనితీరు

### 3.5.1 పింఛను/కుటుంబ పింఛనుల అధిక చెల్లింపులు

పింఛను/కుటుంబ పింఛను చెల్లింపులకు సంబంధించి 2011-12 లో మొత్తం 23 జిల్లా ట్రెజరీలు, 138 సబ్ ట్రెజరీలు, 11 సహాయ పింఛను చెల్లింపు కార్యాలయాల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయగా 410 కేసుల్లో ₹2.7 కోట్ల మేర అధిక చెల్లింపులు జరిగినట్లు వెల్లడైంది. ఆడిట్ ప్రేరణతో 2012 మార్చి 31 నాటికి 36 కేసులకు సంబంధించి ₹0.27 కోట్లు రికవరీ చేయగా, ఇంకా 374 కేసులకు సంబంధించి ₹2.4 కోట్లు రికవరీ చేయవలసిన బకాయిలున్నాయి. వివరాలు ***అనుబంధం 3.5*** లో ఇవ్వడమైంది.

## 3.6 నిధుల అక్రమ పార్కింగ్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు 9వ నిబంధన ప్రకారం, బోర్డు తన కరెంట్ ఖాతా/సేవింగ్స్ ఖాతా లేదా మరే ఇతర ఖాతానైనా భారతీయ స్టేటు బ్యాంకు లేదా ఇతర జాతీయ బ్యాంకులో మాత్రమే నిర్వహించాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు దానికి విరుద్ధంగా ఉంటే కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. పై నిబంధనలకు విరుద్ధంగా, అప్పటి బోర్డు చైర్మన్ ఆదేశానుసారం ₹1.05 కోట్ల మొత్తాన్ని శ్రీ లక్ష్మీ మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ అనే లిక్విడేట్ అయిన (2000 అక్టోబరు) ఒక ప్రైవేటు బ్యాంకులో జమ చేయడం జరిగింది (1998 ఆగస్టు). దాదాపు ఒక దశాబ్ద కాలంగా ₹2.15 కోట్లు మొత్తం (₹0.59 కోట్లు అసలు, ₹1.56 కోట్లు వడ్డీ) వసూలుకాక పెండింగులో వుంది.

[2] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని ఆర్టికల్ 9

[3] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోన్లు, అడ్వాన్సులుతో కలిపి

[4] రెవెన్యూ, క్యాపిటల్ మరియు లోన్లు, అడ్వాన్సులుతో కలిపి

## 3.7 వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలు

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్సియల్ కోడ్ (ఏ.పి.ఎఫ్.సి.)[5] ప్రకారం, ప్రభుత్వం ప్రత్యేక శాసనం ద్వారా ఉత్పన్నమయ్యే తన బాధ్యతలను నిర్వర్తించేందుకు వీలుగా, సంచిత నిధికి డెబిట్ చేసి పి.డి. ఖాతాలు తెరుచుకునే సదుపాయాన్ని కల్పించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల[6] ప్రకారం, ఒక నిర్దిష్ట ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన నిధులు తదుపరి ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి మురిగిపోతాయి (క్యాటగిరి ' సి ' కింది కాలదోషం పట్టిన డిపాజిట్లు). పి.డి. ఖాతాల నిర్వహణాధికారులు కాలదోషం పట్టిన ఖాతాలను మూసివేసి వాటిలోని ఖర్చుకాని మిగులు నిధులను తిరిగి ప్రభుత్వ ఖాతాకు విధిగా బదిలీచేయాలి.

వ్యక్తిగత పి.డి. ఖాతాను ప్రారంభించేందుకు పి.ఏ.జి.(ఎ.&ఇ.) ముందస్తు అనుమతి పొందాలనే షరతును రాష్ట్ర ప్రభుత్వం 2005 సంవత్సరంలో తొలగించింది. అంతేగాక, పి.డి. ఖాతా నిర్వహణాధికారివారీగా వివరాలు పి.ఏ.జి. (ఎ.&ఇ.)కు సమర్పించకపోవడం వల్ల, ఈ ఖాతాకు బదిలీ చేసిన నిధుల ఖర్చును, ఖర్చుకాక ప్రభుత్వ ఖాతాకు బదిలీచేసిన మిగులు నిధులను, పి.డి. ఖాతాలు/బ్యాంకు ఖాతాలతో ఎ.సి. బిల్లులకున్న పొంతన నిర్ధారించలేము.

2012 మార్చి 31 నాటికి ₹22,272 కోట్ల ముగింపు మిగులుతో 90,573 పి.డి. ఖాతాలు నిర్వహణలో ఉన్నట్లు జిల్లా ఖజానాల అధికారులు (డి.టి.ఓ.లు) పి.ఏ.జి. (ఎ.&ఇ.)కు తెలియజేశారు. వివరాలు **పట్టిక 3.1** లో వున్నాయి

**పట్టిక 3.1: 2012 మార్చి 31నాటికి పి.డి. ఖాతాల స్థితి**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | వివరాలు | పి.డి.ఖాతాల సంఖ్య | మొత్తం |
|---|---|---|---|
| 1 | 2011-12 సంవత్సరం మొదట్లోఉన్న పి.డి.ఖాతాలు | 90,188 | 21,738 |
| 2 | 2011-12 సంవత్సరంలో తెరిచిన పి.డి.ఖాతాలు | 536 | 535 |
| 3 | 2011-12 సంవత్సరం చివర్లో మూసివేసిన పి.డి.ఖాతాలు | 151 | 1 |
| 4 | 2011-12 సంవత్సరాంతంలో ఉన్న పి.డి.ఖాతాలు | 90,573 | 22,272 |

*మూలం : 2011-12 ఆర్థిక పద్దులు*

**2010-11 సంవత్సరపు ముగింపు మిగులుకు, 2011-12 సంవత్సరపు ప్రారంభ మిగులుకు 4,355 పి.డి. ఖాతాలకు సంబంధించి ₹11,121 కోట్ల వ్యత్యాసం ఉంది (పెరిగింది).** దీన్ని సంబంధిత శాఖలు రికన్సయిల్ చేసుకోలేదు. జిల్లా ఖజానా అధికారులు చెప్పిన దాని ప్రకారం 2012 మార్చి 31 నాటికి రాష్ట్రంలోని 23 జిల్లాల్లో పదకొండు జిల్లాల ఖజానాలు మాత్రమే ₹14,917 కోట్ల (పి.డి. ఖాతాల్లో నిల్వవున్న మొత్తంలో 67 శాతం) కు సంబంధించిన 53,913 (మొత్తం పి.డి. ఖాతాల్లో 60 శాతం) పి.డి. ఖాతాల్లోని మిగిలియున్న మొత్తాలను రికన్సయిల్ చేసుకున్నాయి.

ఐతే, తమవద్ద 2012 మార్చి 31 నాటికి ₹23,483 కోట్ల నిల్వతో 1,16,638 పి.డి. ఖాతాలు (రుణాత్మక మిగుళ్లు కాకుండా) ఉన్నట్లు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ & అకౌంట్స్ (డి.టి.ఏ.), ఒక ప్రశ్నకు సమాధానంగా పి.ఏ.జి. (జి.ఎస్.ఎస్.ఏ.)కు తెలియజేశారు (2012 జూలై). ***పి.ఏ.జి. (ఎ.&ఇ.)కి తెలిపిన వివరాలకు, పి.ఏ.జి. (జి.ఎస్.ఎస్.ఏ) కు అందించిన వివరాలకు మధ్య పి.డి. ఖాతాల సంఖ్యలోను (26,065 ) వాటిల్లోని మిగులు మొత్తంలోనూ (₹1,211 కోట్లు) అధిక వ్యత్యాసం ఉన్నందున వాటిని రికన్సయిల్ చేసుకోవలసిన అవసరం ఉంది.***

---

[5] ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని 271(4) అధికరణం

[6] జి.ఓ.ఎమ్ఎస్.నెం.43, ఆర్థిక మరియు ప్రణాళిక (డబ్ల్యూ. & ఎమ్.) శాఖ, తేది 22.04.2000

536 పి.డి. ఖాతాలు కొత్తవికాదనీ, ప్రస్తుతం ఉన్న పి.డి.ఖతా నిర్వహణాధికారులకు సంబంధించిన ప్రత్యేక ఖాతా సంఖ్యలనీ ప్రభుత్వం తెలిపింది (2012 నవంబరు).

కొంతమంది నిర్వహణాధికారుల పి.డి.ఖాతాలను మచ్చుకు తనిఖీ చేయగా కింది అక్రమాలు వెలుగుచూశాయి.

- ***పౌర సరఫరాల శాఖ కమిషనరు (పి.డి. ఖాతా నం.7)*** - ఐదు[7] జిల్లాల్లోని వరద బాధితులకు బియ్యం, కిరసనాయిలు సరఫరా చేయడానికి ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి నుండి ప్రభుత్వం ₹100 కోట్లను విడుదల చేయగా (2009 అక్టోబరు) అందులో ₹61 కోట్లు (61శాతం) వినియోగించకపోవడంవల్ల జిల్లా ఖజానాధికారి (పట్టణ), హైదరాబాదు ఈ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖాతాలో జమచేయడం జరిగింది.

  అంతేగాక, భారత ప్రభుత్వ విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యు.ఐ.డి.ఎ.ఐ.)[8] యొక్క విశిష్ట గుర్తింపు కార్యక్రమం కింద, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దేశవాసులకు విశిష్ట గుర్తింపు (యు.ఐ.డి.) నంబరులను జారీ చేయుటకు, తొలి విడత ప్రోత్సాహకంగా ₹13 కోట్ల పదమూడవ ఆర్థిక సంఘం గ్రాంటును భారత ప్రభుత్వం విడుదల చేసింది (2010 జూలై). మంజూరు ఉత్తర్వులు జారీ అయి (2010 డిసెంబరు), నిధులు డ్రాచేసి, 2011 సెప్టెంబరులోనే పి.డి.ఖాతాకు జమ చేసినప్పటికీ, 2012 జూలైనాటికి కూడ ఆ మొత్తాలు నిరుపయోగంగా ఉన్నాయి.

  సంక్షేమ హాస్టళ్లకు బియ్యం సేకరించడానికి 2008 అక్టోబరులో ₹8 కోట్లు విడుదల చేయగా వాటిని 2009 మార్చి నెలలో డ్రాచేసికూడా ఖర్చుపెట్టకపోవడంవల్ల హైదరాబాదు జిల్లా ఖజానాధికారి (పట్టణ) వాటిని 2011 జూన్ నెలలో తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమచేయడం జరిగింది.

- ***ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (పి.డి.ఖాతా నం.75)*** - 2009 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు[9] విరుద్ధంగా, బియ్యం సబ్సిడీకి సంబంధించిన ₹2,280 కోట్లు పి.డి. ఖాతానుండి డ్రాచేసి (2011-12) బ్యాంకు ఖాతాలో పెట్టి, అందులో ₹163 కోట్లను దారి మళ్లించి మూడు చమురు కంపెనీలకు[10] ఎల్.పి.జి. సబ్సిడీ కింద చెల్లించడం జరిగింది.

  అంతేగాక, పి.ఏ.జి. (ఎ.&ఇ.), పి.డి. ఖాతా నిర్వహణాధికారి పుస్తకాల్లోని రాబడులు, ఖర్చుల మొత్తాలమధ్య భారీ వ్యత్యాసం ఉన్నందువల్ల దీన్ని రికన్సయిల్ చేసుకోవలసిన అవసరం ఉంది ***(అనుబంధం 3.6).***

- ***గ్రామీణ పేదరిక నిర్మూలనా సమితి (ఎస్.ఇ.ఆర్.పి.) (పి.డి. ఖాతా నం.277)*** - ఏ.ఏ.బి.వై., పావలా వడ్డీ, ఎయిడ్స్ రోగులకిచ్చే పెన్షను, ఎ.పి.ఆర్.పి.ఆర్.పి. వంటి పలు పథకాలకు చెందిన ₹1,647 కోట్ల నిధులను పి.డి. ఖాతాలనుండి డ్రాచేసి (2011-12) అనేక బ్యాంకులలో జమచేశారు. పి.డి. ఖాతాకు సంబంధించి ప్రత్యేక నగదు పుస్తకంకాని, పథకాల వారీగా లెడ్జర్లు కాని నిర్వహించలేదు.

  దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి గణన నిమిత్తం తన పి.డి. ఖాతానుండి ₹10 కోట్లను ఎస్.ఇ.ఆర్.పి. 2012 మార్చిలో డ్రాచేసింది. 2012 ఆగస్టు వరకూ ఈ నిధులు బ్యాంకు ఖాతాలో నిరుపయోగంగా వున్నాయి.

---

[7] కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణా, గుంటూరు మరియు నల్గొండ

[8] యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా

[9] సర్క్యులర్ మెమో నం. ఎం2/17836/2009, తేది.2009 నవంబరు 16

[10] హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మరియు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్

ఎయిడ్స్ రోగులకు పెన్షన్లు యివ్వడానికి ఉద్దేశించిన ₹9.79 కోట్ల మొత్తాన్ని పి.డి. ఖాతానుండి డ్రాచేసి (2011-12) తన బ్యాంకు ఖాతాలో ఉంచింది. ఈ మొత్తంనుండి ₹0.45 కోట్లను విత్‌డ్రా చేసింది. ఐతే ఎస్.ఇ.ఆర్.పి. డ్రాచేసిన మొత్తానికి, 2012 ఆగస్టు వరకు ఆడిట్‌కు లెక్కలు చూపలేకపోయింది. అలాగే మిగిలిన మొత్తం ₹9.36 కోట్లు (వడ్డీతో కలిపి) బ్యాంకు ఖాతాలో నిరుపయోగంగా వున్నాయి.

ఎస్.ఇ.ఆర్.పి. విషయంలో కూడా, పి.ఏ.జి. (ఎ.&ఇ.) మరియు పి.డి. పుస్తకాల్లో చూపిన వివరాల మధ్య రాబడులు మరియు ఖర్చుల విషయంలో భారీ వ్యత్యాసం ఉంది. దీన్ని రికన్సయిల్ చేసుకోవలసిన అవసరం ఉంది **(*అనుబంధం 3.6*).**

- **సాంఘిక ప్రయోజనాల నిర్వహణ వ్యవస్థ (ఎస్.బి.ఎమ్.ఎస్.) :** రాష్ట్రంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు, ఎస్.సి., ఎస్.టి. మరియు వికలాంగ విద్యార్థుల బోధనా రుసుము వాపసు మరియు నిర్వాహక బోధనా ఫీజులను 2008 జూలైలో బట్వాడా చేయడానికుద్దేశించిన 'ఎస్.బి.ఎమ్.ఎస్.' పథకానికి చెందిన ₹63.69 కోట్లు మొత్తం 2012 సెప్టంబరు నాటికి 29 పి.డి. ఖాతాల్లో చెల్లింపులు కాకుండా ఉంది.

- 21 ప్రభుత్వ కార్పొరేషన్లు ఇతర సంస్థలు తమ పి.డి. ఖాతాలనుండి ₹141 కోట్లు విత్‌డ్రా చేసి (2011 డిసెంబరు మరియు 2012 జనవరి)అనేక బ్యాంకు ఖాతాల్లో ఉంచినట్లు మచ్చుకు చేసిన ఆడిట్‌లో వెల్లడైంది.

- నిబంధనల[11] ప్రకారం, 2010-11 లో ₹119 కోట్లు (క్యాటగిరి 'సి' కింద కాలదోషం పట్టిన డిపాజిట్లు) ప్రభుత్వ ఖాతాకు తిరిగి చెల్లించవలసి ఉంది. ఐతే, పి.డి. ఖాతాలో ₹94 కోట్లు నిల్వ ఉంచుకొని కేవలం ₹25 కోట్లు మొత్తం మాత్రమే ప్రభుత్వ ఖాతాలో జమచేయడం జరిగింది.

- 2012 మార్చి నాటికి, నిర్వహణలో లేని 336 పి.డి. ఖాతాల్లో ₹155 కోట్లు (క్యాటగిరి 'సి' కింద కాలదోషం పట్టిన డిపాజిట్లు) మొత్తం నిరుపయోగంగా పడివుంది. 563 పి.డి. ఖాతాల్లో ₹4,409 కోట్లు (2012 ఆగస్టు నాటికి) రుణాత్మక నిల్వ ఉండగా, 1053 పి.డి. ఖాతాల్లో 'సున్న' నిల్వలు ఉన్నాయి. ఒకే నిర్వహణాధికారి అనేక పి.డి. ఖాతాలను తెరవడం వల్లకానీ, ఒక పనికి ఉద్దేశించిన నిధులను వేరొక పద్దుకింద ఖర్చుచేయడంవల్లకానీ, అనుమతించిన దానికంటే ఎక్కువ మొత్తాన్ని డ్రా చెయ్యడంవల్లకానీ రుణాత్మక నిల్వలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

- అంతేగాక, సెల్ఫ్ చెక్కుల ద్వారా పి.డి. ఖాతాలనుండి బ్యాంకులకు నిధుల బదిలీని ప్రభుత్వం నిషేధిస్తున్నప్పటికీ, పలువురు పి.డి. ఖాతా నిర్వాహణాధికారులు పి.డి. ఖాతాలనుండి పెద్ద మొత్తాలను వాణిజ్య బ్యాంకులకు బదిలీచేశారు.

***పి.డి. ఖాతాల అవసరం కాదనలేనిదే అయినప్పటికీ, వీటి నిర్వహణ పారదర్శకంగానూ, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించే విధంగానూ ఉండేలా ప్రభుత్వం శ్రద్ధచూపాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా, ఆరవ వంతు బడ్జెట్ నిధులు ఈ ఖాతాలలో ఇలా ఉండిపోవటం, ప్రభుత్వ పద్దుల పరిధిలో లేకపోవటంతో ఈ ఖాతాల నిర్వహణ, నిధుల వినియోగం, ముగింపు నిల్వల వివరాలు పి.ఏ.జి. (ఎ.&ఇ.)కి తెలియచేయకపోవటం తీవ్రంగా పరిగణించవలసిన విషయమైంది .***

ఆడిట్ ఆందోళనను అర్థంచేసుకున్న ప్రభుత్వం పి.డి. ఖాతాల నిర్వహణ తీరుని సమీక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామనీ, త్వరలోనే మొత్తం విధానాన్ని గాడిన పెడతామనీ పేర్కొంది (2012 నవంబరు).

---

[11] జి.ఓ.ఎమ్ఎస్.నెం.43, ఆర్థిక మరియు ప్రణాళిక (డబ్ల్యూ. & ఎమ్.) శాఖ, తేది 22.04.2000

## 3.8 నిధులను ప్రభుత్వ ఖాతా వెలుపల ఉంచడం

కాల పరిమితి డిపాజిట్లలో పెట్టే ఉద్దేశంతో నిధులను డ్రా చేయరాదని ప్రభుత్వ ఆదేశాలు[12] స్పష్టం చేస్తున్నాయి. (బ్యాంకులు అందిస్తున్న ఫ్లెక్సీ ఇంటరెస్ట్ పథకాలకు ఈ నిబంధనలు వర్తించవు). ఐతే, ఎంపిక చేసిన కొన్ని కేంద్ర పథకాల రికార్డులను మచ్చుకు తనిఖీచేయగా, అలాంటి విత్‌డ్రాయల్స్ కొన్ని వెలుగుచూశాయి.

### 3.8.1 ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా చేయదగు సేవలు (ఇ.డి.ఎస్.)

నాలుగు సంవత్సరాల కాల పరిమితికి జాతీయ ఇ-పాలన పథకం కింద ఆరు మండళ్లలో సాధారణ సేవా కేంద్రాలు (సి.యస్.సి.లు) ఏర్పాటు చేయడంకోసం ఇ.డి.ఎస్. సంచాలకునికి కేంద్ర ప్రభుత్వం ₹18.58 కోట్లు విడుదల చేసింది (2007 ఆగస్టు, నవంబరు). ఐతే, 2012 ఆగస్టు నాటికి, ₹24 కోట్లను (₹8 కోట్ల వడ్డీతో కలిపి) ఇండియన్ బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలో ఉంచారు. ఈ మొత్తాన్ని నిర్దేశించిన ప్రయోజనాలకు వినియోగించనే లేదు.

## 3.9 వివరణాత్మక కంటింజంట్ బిల్లుల బకాయిలు

సంక్షిప్త ఆకస్మిక (ఎ.సి.) బిల్లులపై తీసుకున్న మొత్తాలతో చేసిన ఖర్చులకు ప్రభుత్వ[13] ఆదేశాలననుసరించి వివరణాత్మక బిల్లులను, (డి.సి. బిల్లులు) ఓచర్లతోసహా, ఒక నెలలోపు పి.ఏ.జి.(ఎ.&ఇ.)/పి.ఏ.ఓ.కు సమర్పించి, సర్దుబాటు చేయాలి. ఐతే ఈ విషయాన్ని పి.ఏ.జి. ప్రభుత్వ దృష్టికి అనేక పర్యాయములు తీసుకువచ్చినప్పటికీ, 2012 మార్చి 31 నాటికి ₹3,124 కోట్ల విలువైన ఎ.సి. బిల్లులకు గాను ₹1,838 కోట్ల (59 శాతం) విలువైన డి.సి. బిల్లులు మాత్రమే సమర్పించారు. సంవత్సరవారీ వివరాలు **పట్టిక 3.2** లో ఉన్నాయి.

**పట్టిక 3.2 : ఎ.సి. బిల్లులపై పొందిన సొమ్ము**

(₹ కోట్లలో)

| సంవత్సరం | డ్రా చేసిన ఎ.సి. బిల్లులు | | సమర్పించిన డి.సి. బిల్లులు | | సర్దుబాటైన సొమ్ము (శాతంలో) | బకాయిలో ఉన్న డి.సి. బిల్లులు | |
|---|---|---|---|---|---|---|---|
| | సంఖ్య | సొమ్ము మొత్తం | సంఖ్య | సొమ్ము మొత్తం | | సంఖ్య | సొమ్ము మొత్తం |
| 2006-07 వరకు | 79,378 | 635 | 58,549 | 462 | 73 | 20,829* | 173* |
| 2007-08 | 10,459 | 158 | 8,292 | 123 | 78 | 2,167 | 35 |
| 2008-09 | 7,383 | 158 | 5,674 | 139 | 88 | 1,709 | 19 |
| 2009-10 | 4,447 | 458 | 3,501 | 341 | 74 | 946 | 117 |
| 2010-11 | 3,158 | 774 | 2,366 | 503 | 65 | 792 | 271 |
| 2011-12 | 2,546 | 941 | 1,683 | 270 | 29 | 863 | 671 |
| మొత్తం | 1,07,371 | 3,124 | 80,065 | 1,838 | 59 | 27,306 | 1,286 |

*మూలం : పి.ఏ.జి.(ఎ.&ఇ.) ఇచ్చిన సమాచారం*

* 2002-03 సంవత్సరం వరకు డ్రా చేసిన ₹222 కోట్ల విలువైన 82,130 ఎ.సి. బిల్లులుకాక (వీటి వివరాలు అందుబాటులో లేవు)

**గమనిక :** 2004-12 మధ్యకాలానికి పి.ఏ.ఓ. (హైదరాబాదు)కు సంబంధించిన ₹66 కోట్ల విలువైన 316 ఎ.సి. బిల్లులు రికన్సిలియేషన్‌లో ఉన్నందున వాటిని పరిగణనలోకి తీసుకోలేదు.

[12] జి.ఓ.ఎమ్ఎస్.నెం.113, ఆర్థిక (వేస్ & మీన్స్) శాఖ, తేది 10.05.2007

[13] జి.ఓ.ఎమ్ఎస్.నెం.285, ఆర్థిక (టి.ఎఫ్.ఆర్.-II) శాఖ, తేది 15.10.2005

సర్దుబాటుకాని మొత్తం ఎ.సి. బిల్లుల విలువ ₹1,286 కోట్లు కాగా, ఇందులో 67 శాతం (₹866 కోట్లు) ఒక్క వ్యవసాయశాఖకు చెందినవే. డి.సి. బిల్లులు పెండింగులోవున్న ఏ.సి. బిల్లుల వివరాలు శాఖలవారీగా **అనుబంధం 3.7** లో ఇవ్వబడ్డాయి.

మచ్చుకు చేసిన తనిఖీలో వెలుగుచూసిన కొన్ని కేసులు కింద వివరించాము. ***ఈ కేసులన్నింటిలోనూ, ఎ.సి. బిల్లుల రూపంలో డ్రా చేసిన మొత్తాలను డి.సి. బిల్లులద్వారా 2012 జూలై నాటికి సర్దుబాటు చేయలేదు.***

- ***భూపరిపాలన ప్రధాన కమిషనరు (సి.సి.ఎల్.ఏ.) :*** తన కార్యాలయ ప్రాంగణంలోని పాత భవనానికి మరమ్మతులు చేసేందుకూ, కొత్త భవన నిర్మాణం కోసం 2006 ఫిబ్రవరిలో కోటి రూపాయలు ఎ.సి. బిల్లుద్వారా డ్రాచేసి, పని ప్రారంభించడానికిగాను ప్రధాన కార్యనిర్వాహకుడు, హేబ్‌టెక్, హైదరాబాదుకు చెక్కు ఇచ్చారు.

- ***ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషను (ఎ.పి.పి.ఎస్.సి.) :*** గ్రూపు-I మెయిన్ పరీక్షల నిర్వహణ సందర్భంగా రహస్య పత్రాలను బట్వాడా చేసినందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు చెల్లించేందుకు మరియు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో బోధకుల ఎంపికలో పనిచేసిన పాత్యాంశ నిపుణులకు గౌరవ వేతనం చెల్లించుటకు₹5.44 లక్షలకు రెండు ఎ.సి. బిల్లులను డ్రా చేశారు (2011 సెప్టెంబరు, నవంబరు).

- ***గ్రేటర్ హైదరాబాదు నగరపాలక సంస్థ (జి. హెచ్.ఎం.సి) :*** పార్లమెంటు, విధాన సభ, విధాన పరిషత్తులకు సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం 2009-10లో ₹4.81 కోట్ల విలువైన 7 ఎ.సి. బిల్లులను, 2010-11లో ₹16 లక్షల విలువైన రెండు ఎ.సి. బిల్లులను డ్రాచేశారు.

- ***హైదరాబాదు పోలీసు కమిషనరు :*** 2011 సెప్టెంబరు, అక్టోబరుల్లో వినాయక చవితి తదితర పండగల సందర్భంగా బందోబస్తు నిర్వహించడానికిగాను ₹4.33 కోట్ల విలువైన 5 ఎ.సి. బిల్లులను డ్రా చేయగా, అందులో ₹4.11 కోట్ల విలువైన నాలుగు ఎ.సి. బిల్లులకు ఇంకా డి.సి. బిల్లులు సమర్పించలేదు.

- ***సాంకేతిక విద్యాశాఖ కమిషనరు :*** 2004లో "ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని" నిర్వహించడం కోసం అదే సంవత్సరం నవంబరులో డ్రా చేసిన ₹31 లక్షల ఎ.సి. బిల్లుకు, 2012 జూలై నాటికి డి.సి. బిల్లు సమర్పించలేదు.

- ***వ్యవసాయ సంయుక్త సంచాలకులు :*** 50 శాతానికి పైగా పంటలు నష్టపోయిన సన్న, చిన్నకారు రైతులకు 'ఇన్‌పుట్ సబ్సిడి' చెల్లించడానికి మహబూబ్‌నగర్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు డ్రా చేసిన ₹40 కోట్ల (2010 జనవరి, 2011 జనవరి, జూన్) విలువైన 7 ఎ.సి. బిల్లులకు. 2011 జనవరి, జూన్ నెలల్లో పశ్చిమ గోదావరి వ్యవసాయ సంయుక్త సంచాలకులు డ్రా చేసిన ₹61 కోట్ల విలువైన మూడు ఎ.సి. బిల్లులకు 2012 జూలై నాటికీ డి.సి. బిల్లులు సమర్పించలేదు.

ఇప్పటికే ₹419 కోట్ల విలువైన ఏ.సి. బిల్లులను సంబంధిత డి.సి. బిల్లుల ద్వారా సర్దుబాటు చేసినట్టూ, మిగిలిన ఏ.సి. బిల్లులను కూడ సర్దుబాటు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది (2012 నవంబరు).

## 3.10 సస్పెన్స్ పద్దు (ప్రధాన పద్దు 8658) కింద నిల్వవున్న మిగులు మొత్తాలు

ఏ కారణంచేతైనా, లావాదేవీ జరిగిన వెంటనే ప్రభుత్వ ఖాతాలో సంబంధిత పద్దుకింద బుక్ చెయ్యలేని పరిస్థితివుంటే అటువంటి లావాదేవీల కోసం సస్పెన్స్ ఖాతాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ మొత్తాలను సంబంధిత పద్దులకింద సర్దుబాటు చేసేటప్పుడు సస్పెన్స్ ఖాతాకు మైనస్ డెబిట్ లేక మైనస్ క్రెడిట్ ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ ఈ సస్పెన్స్ ఖాతాలో మొత్తాలు కనుక సర్దుబాటు కాకుండా ఉండిపోతే, ఈ పద్దులకింద నిల్వ మొత్తాలు పెరిగి, ఆమేరకు ప్రభుత్వ రాబడులు, ఖర్చులు తక్కువచేసి చూపబడతాయి. సస్పెన్స్ ఖాతాలకు సంబంధించిన లెడ్జర్‌ను వివరణాత్మక పద్దులవారీగా నిర్వహించవలసిన అవసరం ఉంది.

2012 మార్చి 31 నాటికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక పద్దులలో ప్రధాన సస్పెన్స్ పద్దు 8658 కింద ₹250.18 కోట్ల (డెబిట్) నికర మొత్తం నిల్వ ఉంది. ఆర్థిక పద్దులు సస్పెన్స్ ఖాతాలలోని నికర నిల్వలను ప్రతిబింబిస్తాయి. అందువల్ల, శాసనసభకు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వ వార్షిక పద్దులలో, ఈ సస్పెన్స్ ఖాతాలకింద మిగులు ఉన్న మొత్తాల వాస్తవ విలువలు నివేదించబడవు. వివిధ సస్పెన్స్ ఖాతాలకింది డెబిట్, క్రెడిట్ మొత్తాలను వేరుచేయటం ద్వారా మాత్రమే సరైన మిగులు మొత్తాలను తెలుసుకొనగలము. సస్పెన్స్ ఖాతాలలోని డెబిట్, క్రెడిట్‌లు దేనికది స్వతంత్రంగా ఉండి వాటి సర్దుబాటు సంబంధిత డెబిట్/ క్రెడిట్ నుండి తీసివేయడం ద్వారా జరుగుతుంది కనుక, వీటికింద డెబిట్‌లను క్రెడిట్‌లను ఏకంచేసి, నికర మొత్తాలను చూపడం వీలుకాదు. అలాచేయడంవల్ల, సస్పెన్స్ మిగులు మొత్తాలను ఆర్థిక పద్దుల్లో ప్రధాన పద్దు, చిన్న పద్దు స్థాయిలలో తక్కువచేసిచూపడం జరుగుతుంది. సస్పెన్స్ పద్దు (ప్రధాన పద్దు - 8658) కింద చిన్న పద్దులైన 101 - పి.ఏ.ఓ. సస్పెన్స్, 102 - సస్పెన్స్ ఖాతా (సివిల్) మరియు 110 - రిజర్వు బ్యాంకు సస్పెన్స్ - సెంట్రల్ అకౌంట్స్ కార్యాలయంలోని సస్పెన్స్ నిల్వల (డెబిట్/ క్రెడిట్) పరిస్థితిని, గత ఐదు సంవత్సరాలుగా ఆర్థిక పద్దుల్లో చూపిన నికర నిల్వ మొత్తాలతో కలిపి ఈ దిగువ ఇవ్వడం జరిగింది.




*మూలం : వార్షిక పద్దులు మరియు పి.ఏ.జి.(ఎ.&ఇ.) నిర్వహించు ఆవర్జాలు*

### 3.10.1 పే & అకౌంట్స్ కార్యాలయం - సస్పెన్స్ (చిన్న పద్దు 101)

భారత ప్రభుత్వ పి.ఏ.ఓ.లు, కేంద్ర పాలిత ప్రాంతాల పి.ఏ.ఓ.లు, మహాగణకాధికారుల పుస్తకాల్లో వివిధ శాఖల, ప్రభుత్వాల మధ్య జరిగిన లావాదేవీలను పరిష్కారం చేయడంకోసం ఈ చిన్న పద్దును నిర్వహిస్తారు. ఏ అకౌంట్స్ అధికారి పరంగా ఈ పి.ఏ.ఓ. సస్పెన్స్ చిన్న పద్దు నిర్వహించబడుతుందో ఆ అధికారి తరపున ఒక అకౌంట్స్ అధికారి చేసిన చెల్లింపులు, పొందిన రికవరీలకు సంబంధించిన లావాదేవీలను ఈ చిన్న పద్దు ప్రతిబింబిస్తుంది. ఏ అకౌంట్స్ అధికారి పుస్తకాల్లో మొదట రికవరీ నమోదవుతుందో, ఆ అధికారి చెక్కును జారీ చేసినప్పుడు, ' మైనస్ క్రెడిట్ ' చేయడం ద్వారా ఈ పద్దులోని క్రెడిట్‌ను సర్దుబాటుచేయడం జరుగుతుంది. అలాగే ఏ అకౌంట్స్ అధికారి తరపున చెల్లింపు జరిగిందో ఆ అధికారి నుండి చెక్కు ద్వారా సొమ్మును పొందినపుడు ' మైనస్ డెబిట్ ' ద్వారా ఈ పద్దులోని డెబిట్‌ను తొలగించడం

జరుగుతుంది. ఈ పద్దులోని డెబిట్ నిల్వ పి.ఏ.ఓ. ద్వారా వేరొక పి.ఏ.ఓ.కు సంబంధించిన చెల్లింపు జరిగి, ఇంకా రికవరీ కాని మొత్తాలను సూచిస్తుంది. ఒక పి.ఏ.ఓ. వేరొక పి.ఏ.ఓ. తరపున పొంది, ఇంకా చెల్లించవలసిన మొత్తాలను క్రెడిట్ నిల్వ తెలియజేస్తుంది.

2011-12 సంవత్సరాంతానికి ఈ పద్దుకింద ₹119.16 కోట్ల డెబిట్ నిల్వ, ₹23.48 కోట్ల క్రెడిట్ నిల్వ ఉన్నాయి. ఈ పద్దులోని డెబిట్ నిల్వలు ప్రధానంగా పి.ఏ.ఓ., కేంద్రీయ పింఛనులు, న్యూఢిల్లీ (₹18.22 కోట్లు), స్టాక్ వారంట్లపై వడ్డీ (₹18.74 కోట్లు) మరియు పి.ఏ.ఓ., షిప్పింగ్ & రవాణా, బెంగుళూరు (₹80.82 కోట్లు) లకు సంబంధించినవి. అలాగే, క్రెడిట్ నిల్వలు పి.ఏ.ఓ., ఆర్థిక వ్యవహారాల శాఖ, న్యూఢిల్లీ (₹12.65 కోట్లు), పేరోలు సేవింగ్ పథకం(₹1.69 కోట్లు) మరియు పి.ఏ.ఓ., షిప్పింగ్ & రవాణా, న్యూఢిల్లీ (₹8.41 కోట్లు) లకు సంబంధించినవి. ఈ పద్దులోని డెబిట్ నిల్వలు 2007-08 సంవత్సరంలోని ₹93.22 కోట్లనుండి 2011-12 లో ₹119.16 కోట్లకు పెరిగాయి. అలాగే, 2007-08 సంవత్సరంలో ₹23.68 కోట్లనుండి 2011-12 సంవత్సరంలో ₹23.48 కోట్లకు తగ్గడంవల్ల క్రెడిట్ నిల్వల్లో స్వల్ప తరుగుదల నమోదయింది. పి.ఏ.ఓ. సస్పెన్స్ ఖాతాలో క్రెడిట్, డెబిట్ నిల్వలు నిరంతరంగా పేరుకుపోవడం ప్రధానంగా నియంత్రణ లోపాలను సూచిస్తుంది.

### 3.10.2 సస్పెన్స్ అకౌంటు -సివిల్ (చిన్న పద్దు 102)

తగిన సమాచారం/పత్రాలు (చలాన్లు, ఓచర్లు మొదలైనవి) లేని కారణంగా ఖర్చులు/రాబడులకు సంబంధించిన లావాదేవీలను వాటికి సంబంధించిన వాస్తవ పద్దులకింద బుక్ చెయ్యలేము కనుక, అలాంటివాటిని ముందుగా ఈ సస్పెన్స్ పద్దులో బుక్ చెయ్యడం జరుగుతుంది. ఈ పద్దుకు రాబడులు క్రెడిట్ చేసి, ఖర్చులు డెబిట్ చెయ్యబడతాయి. తగు సమాచారం అందిన మీదట క్రెడిట్‌ను మైనస్ క్రెడిట్ ద్వారానూ, డెబిట్‌ను మైనస్ డెబిట్ ద్వారాను సర్దుబాటు చెయ్యడం జరుగుతుంది. ఈ పద్దు కింద మిగిలిపోయిన డెబిట్ మొత్తం అంటే వివరాలు అందని కారణంగా వాస్తవ ఖర్చుపద్దుకింద బుక్ చెయ్యలేక మిగిలి పోయిన మొత్తం అనీ, మిగిలిపోయిన క్రెడిట్ మొత్తం అంటే వివరాలు అందని కారణంగా వాస్తవ రాబడి పద్దుకింద బుక్ చెయ్యలేక మిగిలిపోయిన మొత్తం అనీ అర్థం.

2012 మార్చి 31 నాటికి ఈ పద్దుకింద ₹239.34 కోట్లు (డెబిట్), ₹84.55 కోట్లు (క్రెడిట్) మిగులు నిల్వలు ఉన్నాయి. అంటే, మొత్తం ₹323.89 కోట్లకు సంబంధించిన ఖర్చులు, రాబడులను వేటికవి సంబంధిత వాస్తవ పద్దులకింద సర్దుబాటు చేయవలసి ఉంది. ప్రధానంగా ఈ పద్దుకింద డెబిట్ నిల్వలు ఎఫ్.ఎ. & సి.ఏ.ఓ., దక్షిణ మధ్య రైల్వే (₹79.33 కోట్లు), వర్గీకరించని సస్పెన్స్ (₹50.92 కోట్లు), వేరొక అకౌంటింగ్ వ్యవస్థలోని ఖజానాలో రెమిటెన్సులకు (₹48.58 కోట్లు), సంబంధించిన మిగుళ్లు. కాగా, క్రెడిట్ నిల్వలు వేరొక అకౌంటింగ్ సర్కిల్‌లోని ఖజానా పేరుమీద డ్రాచేసిన చెక్కులు (₹55.50 కోట్లు), తుంగభద్ర ప్రాజెక్టు సస్పెన్స్ - జమలు (₹12.67 కోట్లు) మరియు తుంగభద్ర ప్రాజెక్టు సస్పెన్స్ (₹7.18 కోట్లు) లకు సంబంధించినవి.

### 3.10.3 రిజర్వు బ్యాంకు సస్పెన్స్-సెంట్రల్ అకౌంట్స్ కార్యాలయం (చిన్న పద్దు-110)

లోన్లు, గ్రాంట్లు మొదలైనవి మంజూరు చేసేటప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పెద్ద మొత్తంలో జరిగే నగదు బదిలీలకు సంబంధించిన లావాదేవీలను వాటి వాస్తవ పద్దులో రికార్డు చేసేముందు, పెద్ద పద్దు - 8658 కింది చిన్న పద్దైన '110 - రిజర్వు బ్యాంకు సస్పెన్స్ - సెంట్రల్ అకౌంట్స్ కార్యాలయం'లో రికార్డు చేయడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేసిన లోను విషయంలో, సంబంధిత మంత్రిత్వ శాఖ పి.ఏ.ఓ. నుండి మంజూరు ఉత్తర్వు అందగానే, రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ.) పెద్ద పద్దు - 8658, సస్పెన్స్ - 110 రిజర్వు బ్యాంకు సస్పెన్స్ (ఆర్.బి.ఎస్.), పి.ఏ.ఓ. కు క్రెడిట్ చేసి, పెద్ద పద్దు - 8675 - రిజర్వు బ్యాంకు డిపాజిట్లకు డెబిట్ ఇచ్చి, క్లియరెన్స్ మెమోను జారీ చేస్తుంది. మంత్రిత్వ శాఖనుండి ఒరిజినల్ మంజూరు ఉత్తర్వు అందగానే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ వాస్తవ పద్దు 6004 - కేంద్ర ప్రభుత్వం నుండి లోన్లు,

అడ్వాన్సులకు క్రెడిట్ ఇచ్చి సస్పెన్స్ పద్దును మైనస్ క్రెడిట్ ద్వారా సర్దుబాటు చేయడం జరుగుతుంది. ఈ చిన్న పద్దుకింద డెబిట్ నిల్వ అంటే తిరిగి చెల్లించిన లోన్లు వాటి వాస్తవ పద్దులోకి ఇంకా రాలేదనీ, అలాగే క్రెడిట్ నిల్వ అంటే భారత ప్రభుత్వం నుండి పొందిన లోన్లు సంబంధిత పద్దులో ఇంకా రికార్డు కాలేదనీ అర్థం.

2012 మార్చి 31 నాటికి ఈ పద్దుకింద ₹1,549.84 కోట్లు (డెబిట్) మరియు ₹1,553.57 కోట్లు (క్రెడిట్) నిల్వ ఉన్నాయి. అంటే ఈ పద్దుకింద డెబిట్‌లు, క్రెడిట్‌లకు సంబంధించి మొత్తం ₹3,103.41 కోట్లు సర్దుబాటు చేయవలసిన అవసరం ఉంది. ఐతే, ఆర్థిక పద్దుల ప్రకారం ఈ పద్దుకింద ₹3.74 కోట్ల (క్రెడిట్) నిల్వ మాత్రమే ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి లోన్లు, వాటి తిరిగి చెల్లింపుల వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. దీన్నిబట్టి, తిరిగి చెల్లించిన లోన్లను ₹1,549.84 కోట్లు తక్కువగాను, భారత ప్రభుత్వంనుండి తెచ్చుకున్న లోన్లను ₹1,553.57 కోట్లు తక్కువగాను చేసి ఆర్థిక పద్దుల్లో నివేదించినట్లు స్పష్టమౌతుంది.

## 3.11 ఓమ్నిబస్ - చిన్నపద్దు 800 నిర్వహణ

గత రెండు దశాబ్దాల కాలంలో ప్రభుత్వ కార్యకలాపాల పరిధి బహుముఖంగా పెరిగిపోయింది. అందువలన అందుబాటులో ఉన్న పథకాల చిన్న పద్దుల సంఖ్య కూడా మించిపోతోంది. ఉన్న చిన్న పద్దుల కింద వర్గీకరించలేని ఖర్చుకు ఓమ్నిబస్ చిన్న పద్దు - 800లో స్థానం కల్పించటం జరుగుతోంది.

**2011-12 లో ₹14,165 కోట్ల వ్యయాన్ని (ఇది మొత్తం ఖర్చు ₹1,04,137 కోట్లలో 13.6 శాతం)** రెవెన్యూ, క్యాపిటల్ విభాగాలలోని శతాధిక ప్రధాన పద్దులకు ప్రతిగా 800 - ఇతర వ్యయం అనే చిన్న పద్దుకింద వర్గీకరించారు. రైతులకు ఉచితంగా ఇచ్చే విద్యుత్తు కోసం ఏ.పి. ట్రాన్స్‌కో సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చిన ₹4,300 కోట్లు ఇందుకు అతిపెద్ద నిదర్శనం.

అదేవిధంగా, **₹3,447 కోట్ల రెవెన్యూ రాబడులను** (మొత్తం రెవెన్యూ రాబడులు ₹93,554 కోట్లలో ఇది 3.68 శాతం) 58 పెద్ద పద్దుల కింద ఓమ్నిబస్ చిన్న పద్దు '800 - ఇతర రాబడులు' కింద వర్గీకరించారు. భారీ మొత్తాలను ఓమ్నిబస్ చిన్న పద్దు - '800 ఇతర ఖర్చులు/రాబడులు' కింద వర్గీకరించటం వలన ఆర్థిక నివేదనలో పారదర్శకత లోపిస్తుంది.

ఆడిట్ వ్యాఖ్యను ప్రభుత్వం అంగీకరించి, సవరణ చర్య చేపడతామని హామీ ఇచ్చింది (2012 నవంబరు).

## 3.12 భారత ప్రభుత్వ అకౌంటింగ్ ప్రమాణాలను (ఐ.జి.ఏ.ఎస్.) అమలుచేయటం

### 3.12.1 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పూచీలు

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను సెక్టార్‌లవారీగాను, వర్గాలవారీగాను 2011-12 నుండి ఆర్థిక పద్దులలో, వెల్లడించాలని ఐ.జి.ఏ.ఎస్. -1 నిర్దేశిస్తోంది. సెక్టార్‌లవారీగా ఇప్పటికే చూపుతున్నప్పటికీ, వర్గాలవారీ వివరాలను ఇంతవరకూ రాష్ట్ర ఆర్థిక పద్దులలో చేర్చలేదు.

### 3.12.2 సహాయ గ్రాంట్ల వర్గీకరణ అకౌంటింగ్

ఐ.జి.ఏ.ఎస్. - 2 ప్రకారం, భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సలహా మేరకు, రాష్ట్రపతి ప్రత్యేకంగా అనుమతించిన కేసుల్లోతప్ప, స్థిరాస్తుల నిర్మాణం కోసమైనా సరే, గ్రాంట్లకు సంబంధించి చేసిన ఖర్చును రెవెన్యూ ఖర్చు కింద వర్గీకరించాలి. దీనికి విరుద్ధంగా, ఆస్తుల కల్పన కోసం భారత ప్రభుత్వ గ్రాంట్ల పరంగా ₹220.24 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించి దీనిపై అయిన ₹25.69 కోట్ల ఖర్చును క్యాపిటల్ ఖర్చుకింద వర్గీకరించింది.

## 3.13 సారాంశం

*రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖలు నియమ నిబంధనలను పాటించటం లేదు. ముఖ్యంగా, వివిధ సాంఘిక - ఆర్థికాభివృద్ధి పథకాల అమలుకోసం వారి అధీనంలో ఉంచిన నిధుల వినియోగం గురించి నివేదించడంలోనూ, పద్దులను సంకలనం చేసి, ఆడిట్‌కు సమర్పించడంలోనూ నియమాలను అనుసరించడం లేదు. ప్రధాన మహాగణకాధికారి (ఎ.&ఇ.) లెక్కలలోని రాబడులు, ఖర్చులను రికన్సయిల్ చేసుకోకపోవడాన్నీ, ప్రభుత్వ పద్దులకు బయట పలు డిపాజిట్లలో నిధులను అనుమతి లేకుండానూ, నియమ విరుద్ధంగానూ ఉంచడాన్నీ, ఎ.సి. బిల్లులపై అడ్వాన్సులు తీసుకొని వాటిని చాలాకాలం వరకు డి.సి. బిల్లుల ద్వారా సర్దుబాటు చేయకపోవడాన్ని బట్టి చూస్తే అంతర్గత నియంత్రణలు ఆశించిన రీతిలో లేకపోవటం స్పష్టమవుతుంది. అనామతు పద్దులలోని మొత్తాలను సర్దుబాటు చేయడంకోసం సంబంధిత అధికారులు అవసరమైన వోచర్లు/అందుబాటులోలేని పత్రాలను సమర్పించే విధంగా ప్రభుత్వం తగు శ్రద్ధచూపడంలేదు. లక్ష్యకుమించి పి.డి. ఖాతాలను నిర్వహించడం, ₹23,483 కోట్లు వాటిల్లో నిల్వఉండి పోవడం ప్రభుత్వ పద్దుల పారదర్శకతపై ప్రభావం చూపింది. సబ్సిడీ వంటి ప్రధానమైన ఖర్చులనూ, పెద్ద మొత్తాలనూ ఓమ్నిబస్ చిన్న పద్దు - 800 కింద వర్గీకరించడం ఆర్థిక విషయాల నివేదనలోని పారదర్శకత పై ప్రభావంచూపింది.*

(వాణీ శ్రీరామ్)
ప్రధాన మహాగణకాధికారి (జి.&ఎస్.ఎస్.ఏ.)
ఆంధ్రప్రదేశ్

హైదరాబాదు
21 November 2012

ధృవీకరించడమైనది

(వినోద్ రాయ్)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

కొత్త ఢిల్లీ
26 November 2012

# అనుబంధాలు

అనుబంధం 1.1

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వరూప చిత్రణ

(రాష్ట్ర స్వరూప చిత్రణపై పేరా; పేజీ 1)

| ఎ. | సాధారణ సమాచారం | | | |
|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | వివరాలు | | | విలువలు |
| 1 | విస్తీర్ణం | | | 2,75,000 చ.కి.మీ. |
| 2 | జనాభా | | | |
| | ఎ. | 2001 జనాభా లెక్కల ప్రకారం | | 7.62 కోట్లు |
| | బి. | 2011 జనాభా లెక్కల ప్రకారం | | 8.47 కోట్లు |
| 3 | ఎ. | జనసాంద్రత (2001 జనాభా లెక్కల ప్రకారం) (అఖిల భారత జనసాంద్రత = చ.కి.మీ. కి 325) | | 277 / చ.కి.మీ. |
| | బి. | జనసాంద్రత (2011 జనాభా లెక్కల ప్రకారం) (అఖిల భారత జనసాంద్రత = చ.కి.మీ. కి 382) | | 308 / చ.కి.మీ. |
| 4 | * దారిద్ర్య రేఖ దిగువ జనాభా (బి.పి.ఎల్.) (అఖిల భారత సగటు = 27.5 శాతం) | | | 15.8 శాతం |
| 5 | ఎ. | అక్షరాస్యత (2001 జనాభా లెక్కల ప్రకారం) (అఖిల భారత సగటు = 64.8 శాతం) | | 60.47 శాతం |
| | బి. | అక్షరాస్యత (2011 జనాభా లెక్కల ప్రకారం) (అఖిల భారత సగటు = 74.0 శాతం) | | 67.66 శాతం |
| 6 | శిశు మరణాలు ** (ప్రతి 1000 సజీవ జననాలకు) (అఖిల భారత సగటు = 47) | | | 46 |
| 7 | జీవన పరిమాణం*** (అఖిల భారత సగటు = 63.5 సంవత్సరాలు) | | | 64.4 సంవత్సరాలు |
| 8 | గిని కో-ఎఫిషిఎంట్ **** | | | |
| | ఎ. | గ్రామీణ (భారతీయ రేటు = 0.30) | | 0.29 |
| | బి. | పట్టణ (భారతీయ రేటు = 0.37) | | 0.37 |
| 9 | రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) 2011-12 ధరల ప్రకారం | | | ₹ 6,75,798 కోట్లు |
| | తలసరి జి.ఎస్.డి.పి. సి.ఎ.జి.ఆర్. (2002-03 నుండి 2011-12) | | ఆంధ్రప్రదేశ్ | 15.52 శాతం |
| | | | సాధారణ వర్గం రాష్ట్రాలు | 13.09 శాతం |
| 10 | జి.ఎస్.డి.పి. సి.ఎ.జి.ఆర్. (2002-03 నుండి 2011-12) | | ఆంధ్రప్రదేశ్ | 16.71 శాతం |
| | | | ***** సాధారణ వర్గం రాష్ట్రాలు | 14.46 శాతం |
| 11 | జనాభా పెరుగుదల (2002 నుండి 2012) | | ఆంధ్రప్రదేశ్ | 9.72 శాతం |
| | | | సాధారణ వర్గం రాష్ట్రాలు | 13.90 శాతం |

| బి. | ఆర్థిక సమాచారం | | | |
|---|---|---|---|---|
| | వివరాలు | | | |
| సి.ఎ.జి.ఆర్. | | 2002-03 నుండి 2010-11 | | 2002-03 నుండి 2011-12 |
| | | సాధారణ వర్గం రాష్ట్రాలు | ఆంధ్రప్రదేశ్ | ఆంధ్రప్రదేశ్ |
| | | (శాతాల్లో) | | |
| ఎ. | రెవెన్యూ వసూళ్లలో | 16.86 | 17.04 | 16.87 |
| బి. | సొంత పన్నుల రాబడిలో | 16.74 | 17.27 | 17.36 |
| సి. | పన్నులు కాని రాబడిలో | 12.84 | 14.90 | 14.24 |
| డి. | మొత్తం వ్యయంలో | 14.58 | 14.68 | 14.97 |
| ఇ. | క్యాపిటల్ వ్యయంలో | 21.25 | 18.16 | 18.72 |
| ఎఫ్. | విద్యపై రెవెన్యూ వ్యయంలో | 15.41 | 15.25 | 15.68 |
| జి. | ఆరోగ్యంపై రెవెన్యూ వ్యయంలో | 14.00 | 15.07 | 15.77 |
| హెచ్. | జీతాలు, వేతనాలలో | 13.43 | 14.01 | 13.82 |
| ఐ. | పింఛనులలో | 16.89 | 19.16 | 18.76 |

* సాధారణ సమాచారానికి మూలం : బి.పి.ఎల్. (ప్రణాళికా సంఘం & ఎన్.ఎస్.ఎస్.ఓ. డాటా, 61వ రౌండు),

** శిశు మరణాల రేటు (2011 జనవరి ఎస్.ఆర్.ఎస్. బుల్లెటిన్), ఆర్థిక సమాచారానికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పద్దులు ఆధారం,

*** జీవన పరిమాణం (భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం, హోం ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ), ఆర్థిక సమీక్ష, 2010-11,

**** గిని కో-ఎఫిషిఎంట్ (ప్రణాళికా సంఘం, ఎన్.ఎస్.ఎస్.ఓ. డాటా అనధికార అంచనాలు, 61వ రౌండు 2004-05 ఎమ్.ఆర్.పి.)
*గిని కో-ఎఫిషిఎంట్ అనేది జనాభా మధ్య ఆర్థిక అసమానతలకు కొలమానం. దీని విలువ సున్నా నుండి ఒకటి వరకు ఉంటుంది. సున్నాకు దగ్గరగా ఉంటే ఆర్థిక అసమానతలు తక్కువగా ఉన్నాయనీ, ఒకటికి దగ్గరగా ఉంటే అసమానతలు ఎక్కువగా ఉన్నాయని అర్థం*

***** *మూడు సాధారణ వర్గ రాష్ట్రాలను (ఢిల్లీ, గోవా, పుదుచ్చేరి) మినహాయించి*

# అనుబంధం 1.2

## ప్రభుత్వ పద్దుల రూపకల్పన - ఆర్థిక పద్దుల స్వరూపం

**(పేరా 1.1; పేజీ 1)**

### ప్రభుత్వ పద్దుల స్వరూపం

రాష్ట్ర ప్రభుత్వ పద్దులను మూడు భాగాలలో నిర్వహించడం జరుగుతుంది - (i) సంచిత నిధి, (ii) ఆకస్మిక ఖర్చుల నిధి, (iii) ప్రజాపద్దు.

**భాగం I : సంచిత నిధి :** రాష్ట్ర ప్రభుత్వం అందుకున్న అన్ని రకాల రెవెన్యూలు, ట్రెజరీ బిల్లుల ద్వారా సమీకరించిన ఋణాలు, అంతర్గత ఋణాలు, విదేశీ ఋణాలు, ఇచ్చిన ఋణాల తిరిగి వసూళ్ళ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందుకున్న మొత్తాలు అంతాకలిసి ఏకీకృతంగా 'రాష్ట్ర సంచిత నిధి' గా ఏర్పడుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 266(1) ప్రకారం ఇది ఏర్పాటైంది.

**భాగం II : ఆకస్మిక ఖర్చుల నిధి :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 267(2) కింద ఇది ఏర్పాటయింది. శాసన సభ ఆమోదం ముందుగా లేకుండా అత్యవసర, ఆకస్మిక ఖర్చుల కోసం అడ్వాన్సులు చెల్లించడానికి వీలుగా గవర్నర్ వద్ద ఉంచిన చేడబ్బు (ఇంప్రెస్ట్) ఈ నిధి. దీని నుండి చేసిన ఖర్చులకు శాసన సభ ఆమోదాన్ని తరువాత పొందాలి. ఆకస్మిక ఖర్చుల నిధి నుండి తీసుకున్న మొత్తానికి సమానమైన మొత్తాన్ని సంచిత నిధి నుండి ఉపసంహరించి ఆకస్మిక ఖర్చుల నిధికి తిరిగి జమచేస్తారు.

**భాగం III : ప్రజా పద్దు :** సంచిత నిధిలో భాగం కాని చిన్నమొత్తాల పొదుపులు, భవిష్యనిధులు, రిజర్వు నిధులు, డిపాజిట్లు, సస్పెన్స్, జమ చేసిన మొత్తాలు, వగైరాలకు సంబంధించిన వసూళ్లు, చెల్లింపులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 266(2) కింద ఏర్పాటైన 'ప్రజాపద్దు' ద్వారా నిర్వహిస్తారు. ప్రజాపద్దుకు సంబంధించిన లావాదేవీలపై రాష్ట్ర శాసన సభ ఓటు చేయడం ఉండదు.

### ఆర్థిక పద్దుల స్వరూపం

| స్టేట్‌మెంటు సంఖ్య | స్వరూపం |
|---|---|
| 1 | ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు, కూడుకున్న ఆస్తులు-అప్పుల వివరాలు ఈ పట్టికలో ఉన్నాయి. |
| 2 | సంచిత నిధి, ఆకస్మిక ఖర్చుల నిధి, ప్రజా పద్దులకు సంబంధించి ఈ సంవత్సరం ప్రభుత్వ వసూళ్లు, చెల్లింపులు ఈ పట్టికలో ఉన్నాయి. |
| 3 | వసూళ్ల పట్టిక (సంచిత నిధి) - ఇందులో రెవెన్యూ, క్యాపిటల్ వసూళ్లు, ప్రభుత్వం కేంద్రం నుంచీ, ఇతర సంస్థల నుంచీ ఋణంగా తీసుకున్న మొత్తాలు, మార్కెట్ లోన్లు, ఇచ్చిన లోన్లు, అడ్వాన్సుల వసూళ్లు ఉంటాయి. |
| 4 | వ్యయాల పట్టిక (సంచిత నిధి) ప్రభుత్వ వ్యవహారాలు, కార్యకలాపాల వారీగా ఖర్చును తెలియజేస్తుంది. |
| 5 | కార్యకలాపాలవారీగా ఇంతవరకూ చేసిన మొత్తం క్యాపిటల్ వ్యయాన్ని తెలుపుతుంది. |
| 6 | ప్రభుత్వ ఋణాలు, ఇతర బాధ్యతలు ఈ పట్టికలో ఉంటాయి. |
| 7 | ప్రభుత్వం ఇచ్చిన అప్పుల పట్టిక - సెక్టారు వారీగా, ఋణ గ్రహీతల గ్రూపులవారీగా వివరాలుంటాయి. |
| 8 | రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సహాయ గ్రాంట్ల వివరాలు సంస్థల వారీగా ఉంటాయి. |
| 9 | చట్టపరమైన సంస్థలూ, స్థానిక సంస్థల వంటివి చేసిన అప్పులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల వివరాలు ఇందులో ఉంటాయి. |
| 10 | ఈ సంవత్సరం ప్రభుత్వం చేసిన ఖర్చులు (ఓటు చేసినవీ, ఛార్జి చేసినవి) ఈ పట్టికలో ఉంటాయి. |
| 11 | చిన్న పద్దులలో క్యాపిటల్, రెవెన్యూ వసూళ్ల వివరాలు. |
| 12 | చిన్న పద్దులలో రెవెన్యూ వ్యయం - ప్రణాళిక, ప్రణాళికేతర, కేంద్ర ప్రాయోజిత పథకాలకు విడివిడిగా ఉంటాయి. |
| 13 | ఈ సంవత్సరంలోనూ, ఈ సంవత్సరాంతం వరకూ చేసిన క్యాపిటల్ వ్యయం. |
| 14 | ఈ సంవత్సరాంతం వరకూ చట్టపరమైన సంస్థలూ, ప్రభుత్వ కంపెనీలు, ఇతర జాయింటు స్టాకు కంపెనీలు, సహకార బ్యాంకులు, సంఘాలలో ప్రభుత్వ పెట్టుబడుల వివరాలు. |
| 15 | చిన్న పద్దులలో ఋణాలు, ఇతర బాధ్యతల పట్టిక. |
| 16 | ప్రభుత్వం ఇచ్చిన లోన్లు, అడ్వాన్సుల పట్టిక. |
| 17 | రెవెన్యూ పద్దుకాని నిధుల వనరులు, వినియోగం తెలిపే పట్టిక. |
| 18 | ఆకస్మిక ఖర్చుల నిధి, ప్రజా పద్దులలోని లావాదేవీల పట్టిక. |
| 19 | ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వు నిధుల నిల్వల మదుపు వివరాలు తెలిపే పట్టిక. |
| అనుబంధాలు | ఈ 19 పట్టికలకు తోడు ఆర్థిక పద్దులలో మరో 13 అనుబంధాలుంటాయి. పథకాలవారీగా, సంస్థలవారీగా జీతాలు, సబ్సిడీలు, గ్రాంట్లు, విదేశీ సాయం పొందే ప్రాజెక్టులు, ఇంకా ప్రధాన కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర ప్రణాళికా పథకాలపై ఖర్చు కూడా పథకాల వారీగా ఉంటాయి. |

## అనుబంధం 1.3

## 2011-12 సంవత్సరానికి సంక్షిప్తంగా వసూళ్లు, చెల్లింపులు

(పేరా 1.2; పేజీ 1)

(₹ కోట్లలో)

| వసూళ్లు | | | | చెల్లింపులు | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2010-11 | | 2011-12 | | 2010-11 | | 2011-12 | | |
| | | | | | | ప్రణాళికేతర | ప్రణాళిక | మొత్తం |
| సెక్షను - 'ఎ' : రెవెన్యూ | | | | | | | | |
| 80996 | **I. రెవెన్యూ వసూళ్లు** | | **93554** | **78534** | **I. రెవెన్యూ ఖర్చులు** | **66751** | **23664** | **90415** |
| 45139 | - పన్నుల రాబడి | 53284 | | 26708 | **సాధారణ సేవలు** | **29722** | **152** | **29874** |
| | | | | 32314 | **సామాజిక సేవలు** | **21287** | **16730** | **38017** |
| 10720 | - పన్నులు కాని ఇతర రాబడి | 11694 | | 12531 | - విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి | 11330 | 3604 | 14934 |
| | | | | 4134 | - ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | 3174 | 1852 | 5026 |
| 15237 | - కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటా | 17751 | | 3615 | - నీటిసరఫరా, పారిశుధ్యం, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి | 1021 | 2297 | 3318 |
| 4183 | - ప్రణాళికేతర గ్రాంట్లు | 3499 | | 124 | - సమాచార ప్రసార సేవలు | 212 | 100 | 312 |
| 3318 | - రాష్ట్ర ప్రణాళికా పథకాల కోసం గ్రాంట్లు | 3957 | | 4710 | - షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమం | 1610 | 4146 | 5756 |
| 2399 | - కేంద్ర ప్రణాళికా పథకాలు, కేంద్ర ప్రాయోజిత ప్రణాళికా పథకాల కోసం గ్రాంట్లు | 3369 | | 190 | - కార్మిక మరియు కార్మిక సంక్షేమం | 156 | 108 | 264 |
| | | | | 6973 | - సాంఘిక సంక్షేమం, పౌష్టికాహారం | 3744 | 4623 | 8367 |
| | | | | 37 | - ఇతరాలు | 40 | | 40 |
| | | | | **19346** | **ఆర్థిక సేవలు** | **15527** | **6782** | **22309** |
| | | | | 2984 | - వ్యవసాయం, తత్సంబంధిత కార్యకలాపాలు | 1108 | 3081 | 4189 |
| | | | | 3639 | - గ్రామీణాభివృద్ధి | 2109 | 1571 | 3680 |
| | | | | 6529 | - నీటిపారుదల, వరదల నియంత్రణ | 6287 | 608 | 6895 |
| | | | | 3757 | - ఇంధనం | 4400 | 16 | 4416 |
| | | | | 506 | - పరిశ్రమలు, ఖనిజాలు | 144 | 326 | 470 |
| | | | | 1026 | - రవాణా | 1190 | 449 | 1639 |
| | | | | 16 | - శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం | 3 | 10 | 13 |
| | | | | 889 | - సాధారణ ఆర్థిక సేవలు | 286 | 721 | 1007 |
| | | | | **166** | **సహాయక గ్రాంటులు, విరాళాలు** | **215** | | **215** |
| **---** | **II. సెక్షను 'బి' కి బదిలీ చేసిన రెవెన్యూ లోటు** | | **---** | **2462** | **II. సెక్షను 'బి' కి బదిలీ చేసిన రెవెన్యూ మిగులు** | | | **3138** |

| వసూళ్లు | | | | చెల్లింపులు | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| సెక్షను - 'బి' : ఇతరాలు | | | | | | | | |
| **5983** | **III. శాశ్వత అడ్వాన్సులు, నగదు నిల్వ పెట్టుబడులతో సహా ప్రారంభ నగదు నిల్వ** | | **8830** | | **III. భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి ఓవర్ డ్రాఫ్ట్/ప్రారంభ నిల్వ** | | | |
| **---** | **IV. వివిధ క్యాపిటల్ రాబడులు** | **---** | | **11123** | **IV. క్యాపిటల్ పరివ్యయం-** | | | **13722** |
| | | | | **108** | **సాధారణ సేవలు-** | | **83** | **83** |
| | | | | **609** | **సామాజిక సేవలు-** | | **830** | **830** |
| | | | | 53 | - విద్య, క్రీడలు, కళలు, సంస్కృతి | | 121 | |
| | | | | 18 | - ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | | 74 | |
| | | | | 240 | - నీటి సరఫరా, పారిశుధ్యం, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి | | 178 | |
| | | | | 276 | - షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల, ఇతర వెనుక బడిన తరగతుల సంక్షేమం | | 390 | |
| | | | | 10 | - సాంఘిక సంక్షేమం, పౌష్టికాహారం | | 13 | |
| | | | | 12 | - ఇతరాలు | | 54 | |
| | | | | **10406** | **ఆర్థిక సేవలు-** | | | **12809** |
| | | | | 31 | - వ్యవసాయం, తత్సంబంధిత కార్యకలాపాలు | | 77 | |
| | | | | - | - గ్రామీణాభివృద్ధి కార్యక్రమం | | 0 | |
| | | | | 9075 | - నీటిపారుదల, వరదలనియంత్రణ | | 10783 | |
| | | | | 22 | - ఇంధనం | | 33 | |
| | | | | 13 | - పరిశ్రమలు, ఖనిజాలు | | 8 | |
| | | | | 1058 | - రవాణా | | 1206 | |
| | | | | 207 | - సాధారణ ఆర్థిక సేవలు | | 702 | |
| **173** | **V. లోన్లు, అడ్వాన్సుల రికవరీలు -** | | **164** | **3315** | **V. పంపిణీ చేసిన లోన్లు, అడ్వాన్సులు -** | | | **4983** |
| 21 | - విద్యుత్ ప్రాజెక్టుల నుండి | 35 | | 494 | - విద్యుత్ ప్రాజెక్టులకు | | 1475 | |
| 89 | - ప్రభుత్వోద్యోగుల నుండి | 93 | | 102 | - ప్రభుత్వోద్యోగులకు | | 220 | |
| 63 | - ఇతరుల నుండి | 36 | | 2719 | - ఇతరులకు | | 3288 | |
| **2462** | **VI. సెక్షన్ 'ఎ' నుండి తీసుకున్న రెవెన్యూ మిగులు** | | **3138** | | **VI. సెక్షన్ 'ఎ' నుండి తీసుకున్న రెవెన్యూ లోటు** | | | |
| **18722** | **VII. ప్రజా ఋణాల రాబడులు** | | **19450** | **7881** | **VII. ప్రజా ఋణాల తిరిగి చెల్లింపు** | | | **6761** |
| 16260 | - అంతర్గత ఋణాలు - ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు కాకుండా | 16731 | | 6106 | - అంతర్గత ఋణాలు - ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు కాకుండా | | 5813 | |

| వసూళ్ళు | | | | | చెల్లింపులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 218 | - ఓవర్ డ్రాఫ్ట్‌తో సహా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల కింద నికర లావాదేవీలు | --- | | 218 | - ఓవర్ డ్రాఫ్ట్‌తో సహా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల కింద నికర లావాదేవీలు | | | |
| 2244 | - కేంద్ర ప్రభుత్వంనుండి లోన్లు, అడ్వాన్సులు | 2719 | | 1557 | - కేంద్ర ప్రభుత్వానికి ఋణాలు, అడ్వాన్సుల తిరిగి చెల్లింపు | | 948 | |
| --- | VIII. ఆకస్మిక ఖర్చుల నిధికి వినియోగార్థం | | --- | --- | VIII. ఆకస్మిక ఖర్చుల నిధికి వినియోగార్థం | | | |
| --- | IX. ఆకస్మిక ఖర్చుల నిధికి భర్తీచేసిన మొత్తం | | 2 | 2 | IX. ఆకస్మిక ఖర్చుల నిధి నుండి ఖర్చు | | | |
| **76218** | **X. ప్రజా పద్దు రాబడులు** | | **86051** | **72407** | **X. ప్రజా పద్దు నుండి చెల్లింపులు** | | | **82848** |
| 3130 | - చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధులు | 3376 | | 1527 | - చిన్న మొత్తాల పొదుపు, భవిష్య నిధులు | | 2156 | |
| 3017 | - నికర రిజర్వు నిధులు | 2873 | | 1221 | - నికర రిజర్వు నిధులు | | 1621 | |
| 16433 | - నికర అనామతు, ఇతర విధాలు | 19315 | | 16373 | - నికర అనామతు, ఇతర విధాలు | | 20026 | |
| 15030 | - జమలు (రెమిటెన్సులు) | 17524 | | 16381 | - జమలు (రెమిటెన్సులు) | | 17427 | |
| 38608 | - డిపాజిట్లు, అడ్వాన్సులు | 42963 | | 36905 | - డిపాజిట్లు, అడ్వాన్సులు | | 41618 | |
| **---** | **XI. భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి ఓవర్ డ్రాఫ్ట్ ముగింపు నిల్వ** | | **---** | **8830** | **XI. ముగింపు నగదు నిల్వ** | | | **9322** |
| | | | | 5 | - ఖజానాలలో నగదు, స్థానికంగా చేసిన జమలు | | 5 | |
| | | | | -237 | - రిజర్వు బ్యాంకు, ఇతర బ్యాంకులలో డిపాజిట్లు | | 403 | |
| | | | | 2 | - శాశ్వత అడ్వాన్సులతో సహా ప్రభుత్వ శాఖల్లో నగదు నిల్వ | | 2 | |
| | | | | 9060 | - నగదు నిల్వ పెట్టుబడి, ప్రత్యేకంగా కేటాయించిన నిధుల పెట్టుబడి | | 8912 | |
| 184554 | మొత్తం | | 211189 | 184554 | మొత్తం | | | 211189 |

## అనుబంధం 1.4

## 2011-12 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, వాస్తవ విలువలు

(పేరా 1.3; పేజీ 3)

(₹ కోట్లలో)

| | బడ్జెట్ అంచనాలు | వాస్తవ విలువలు | పెరుగుదల(+)/ తగ్గుదల (-) | పెరుగుదల(+)/ తగ్గుదల (-) (శాతం) |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) (3-2) | (5) |
| **రెవెన్యూ రాబడులు** | **100995** | **93554** | **-7441** | **-7.37** |
| **వీటిలో** | | | | |
| అమ్మకాలు, వర్తకాలు, వగైరాలపై పన్ను | 38306 | 34910 | -3396 | -8.87 |
| రాష్ట్ర ఆబ్కారీ | 9014 | 9612 | 598 | 6.63 |
| వ్యవసాయ భూములు మినహాయించి స్థిరాస్థులపై పన్ను | 97 | 157 | 60 | 61.86 |
| వాహనాలపై పన్ను | 3434 | 2986 | -448 | -13.05 |
| స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు | 4240 | 4385 | 145 | 3.42 |
| సామానులు, ప్రయాణీకులపై పన్నులు | 12 | 12 | 0 | 0.00 |
| భూమి శిస్తు | 146 | 141 | -5 | -3.42 |
| వడ్డీ వసూళ్లు | 7164 | 6279 | -885 | -12.35 |
| వివిధ సాధారణ సేవలు | 73 | 255 | 182 | 249.32 |
| నాన్ - ఫెర్రస్ గనుల తవ్వకం, లోహ పరిశ్రమలు | 2994 | 2337 | -657 | -21.94 |
| **రెవెన్యూ ఖర్చు** | **97170** | **90415** | **-6755** | **-6.95** |
| సాధారణ విద్య | 16281 | 14006 | -2275 | -13.97 |
| నీటి సరఫరా, పారిశుధ్యం | 728 | 393 | -335 | -46.02 |
| పింఛనులు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు | 9693 | 11110 | 1417 | 14.62 |
| పోలీసులు | 3671 | 3980 | 309 | 8.42 |
| షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు మరియు ఇతర వెనకుబడిన తరగతుల సంక్షేమం | 5430 | 5756 | 326 | 6.00 |
| ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | 5022 | 5025 | 3 | 0.06 |
| సాంఘిక సంక్షేమం, పౌష్టికాహారం | 7655 | 8366 | 711 | 9.29 |
| రోడ్లు, వంతెనలు | 1588 | 1506 | -82 | -5.16 |
| సచివాలయం - ఆర్థిక సేవలు | 614 | 666 | 52 | 8.47 |
| అటవీకరణ, వన్యప్రాణులు | 415 | 335 | -80 | -19.28 |
| గ్రామీణాభివృద్ధి | 4099 | 3680 | -419 | -10.22 |
| పట్టణాభివృద్ధి | 3341 | 2388 | -953 | -28.52 |
| నీటిపారుదల, వరద నియంత్రణ | 8517 | 6895 | -1622 | -19.04 |
| జిల్లా పరిపాలన | 1218 | 812 | -406 | -33.33 |
| న్యాయ పరిపాలన | 722 | 597 | -125 | -17.31 |
| వడ్డీ చెల్లింపులు | 11437 | 10561 | -876 | -7.66 |
| విద్యుత్ | 4422 | 4407 | -15 | -0.34 |
| **క్యాపిటల్ రాబడులు** | **0** | **0** | **0** | **0** |
| **క్యాపిటల్ ఖర్చు** | **17855** | **13722** | **-4133** | **-23.15** |
| **రెవెన్యూ మిగులు (+)/లోటు (-)** | **3826** | **3138** | **-688** | **-17.98** |
| **ద్రవ్య లోటు (-)** | **-17602** | **-15402** | **-2200** | **-12.50** |
| **ప్రాథమిక మిగులు (+)/లోటు (-)** | **-6164** | **-4841** | **-1323** | **-21.46** |

### అనుబంధం 1.5

## ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టం - 2005

(పేరా 1.4; పేజీ 3)

రాష్ట్రంలో ద్రవ్య సుస్థిరతను కొనసాగించడం కోసం, వివేకవంతమైన ద్రవ్య నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ - ఎఫ్.ఆర్.బి.ఎమ్.) చట్టం - 2005 అనే చట్టాన్ని చేసింది. ద్రవ్య పరిస్థితిని మెరుగుపర్చి ద్రవ్య సుస్థిరతను సాధించేందుకు రెవెన్యూ లోటును క్రమంగా రూపుమాపాలని, ద్రవ్యలోటును తగ్గించాలని, ద్రవ్య మనుగడకు అనుగుణమైన రీతిలో అప్పుల నిర్వహణ వివేకవంతంగా ఉండాలని ఈ చట్టం నిర్దేశిస్తోంది. వివేకవంతమైన ద్రవ్య నిర్వహణ కోసం, ప్రభుత్వ ద్రవ్య కార్యకలాపాల్లో పారదర్శకత, ద్రవ్య విధానాలను ఒక మధ్యకాలిక చట్రానికి లోబడి నిర్వహించడం, తత్సంబంధిత అంశాలను కూడా ఈ చట్టం నిర్దేశిస్తోంది. ఈ చట్టంలోనూ మరియు/లేదా దాని కింద రూపొందించిన నియమాలలోనూ పొందుపరచిన ఈ ద్రవ్య నిర్వహణ సూత్రాలను అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కింది ద్రవ్య లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది :

- 2005 ఏప్రిల్ 1 మొదలుకొని ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్ర స్థూల గృహోత్పత్తి (జి.ఎస్.డి.పి.) లో కనీసం 0.32 శాతానికి సమానమైన మొత్తం మేర రెవెన్యూ లోటును తగ్గించుకుంటూ 2009 మార్చి 31 నాటికి పూర్తిగా రూపుమాపడం, అటు తరువాత రెవెన్యూ మిగులును సాధించడం
- 2005 ఏప్రిల్ 1 నుంచి ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ జి.ఎస్.డి.పి. లో కనీసం 0.25 శాతానికి సమానమైన మొత్తం మేర ద్రవ్య లోటును తగ్గించుకుంటూ 2009 మార్చి చివరి నాటికి అది మూడు శాతం మించకుండా ఉండేలా చూడడం

2005 లోని 34వ చట్టం అంటే ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం - 2005 లోని సెక్షన్ 9 కి జరిగిన సవరణ దృష్ట్యా ఈ కింది నిబంధనను చేర్చడమైంది.

*"(సిసి) 13వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను అనుసరించి భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా, రానున్న ఐదేళ్లలో, అంటే 2010 ఏప్రిల్ 1 తో మొదలై 2015 మార్చి 31 తో ముగిసే ఐదేళ్ల కాలంలో బకాయి ఉన్న అప్పుల మొత్తం జి.ఎస్.డి.పి. లో 27.6 శాతాన్ని మించకూడదు." సంవత్సరవారీగా శాతాలను ఈ కింది విధంగా నిర్దేశించడమైంది :*

| | |
|---|---|
| 2010-11 ఆర్థిక సంవత్సరానికి | జి.ఎస్.డి.పి.లో 30.3 శాతం |
| 2011-12 ఆర్థిక సంవత్సరానికి | జి.ఎస్.డి.పి.లో 29.6 శాతం |
| 2012-13 ఆర్థిక సంవత్సరానికి | జి.ఎస్.డి.పి.లో 28.9 శాతం |
| 2013-14 ఆర్థిక సంవత్సరానికి | జి.ఎస్.డి.పి.లో 28.2 శాతం |
| 2014-15 ఆర్థిక సంవత్సరానికి | జి.ఎస్.డి.పి.లో 27.6 శాతం |

- సాలుసరి ఇంక్రిమెంటల్ రిస్క్ వెయిటెడ్ గ్యారంటీలు అంతకు ముందు సంవత్సరపు మొత్తం రెవెన్యూ వసూళ్లలో 90 శాతానికి పరిమితం చేయడం.

2010-11 నుండి 2014-15 వరకు మధ్య గల కాలానికి సంబంధించి ఫలితాల సూచికల మైలు రాళ్లను, వాటిని సాధించాల్సిన గడువు తేదీలను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ద్రవ్య దిద్దుబాటు పథాన్ని రూపొందించలేదు. ఎ.పి. ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్థూల ఆర్థిక నమూనా ప్రకటన (ఎమ్.ఇ.ఎఫ్.ఎస్.) ను ప్రతి ఆర్థిక సంవత్సరం శాసన సభలో ప్రవేశపెట్టాలి. ఈ ప్రకటనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అవలోకనం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, భావి అవకాశాలకు సంబంధించిన అంచనాలు ఉంటాయి.

## అనుబంధం 1.6

## రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై సమయానుగత సమాచారం

(పేరాలు 1.6 మరియు 1.10.2; పేజీలు 4 మరియు 21)

(₹ కోట్లలో)

| | | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|---|
| భాగం - ఎ : రాబడులు | | | | | | |
| 1. | రెవెన్యూ రాబడులు | 54143(89) | 62858(99) | 64678(100) | 80996(100) | 93554(100) |
| | (i) పన్నుల వసూళ్ళు | 28794(53) | 33358(53) | 35176(54) | 45139(56) | 53284(57) |
| | అమ్మకం, వ్యాపారం మొదలగు వాటిపై పన్నులు | 19026(66) | 21852(66) | 23640(67) | 29145(65) | 34910(66) |
| | రాష్ట్ర అబ్కారీ | 4041(14) | 5752(17) | 5849(17) | 8265(18) | 9612(18) |
| | వాహనాలపై పన్నులు | 1604(6) | 1801(5) | 1995(6) | 2626(6) | 2987(6) |
| | స్టాంపులు, రిజిస్ట్రేషన్ రుసుములు | 3086(11) | 2931(9) | 2639(8) | 3834(8) | 4385(8) |
| | భూమి శిస్తు | 144 | 130 | 222(1) | 171 | 141 |
| | ఇతర పన్నులు | 893(3) | 892(3) | 831(2) | 1098(2) | 1249(2) |
| | (ii) పన్నులు కాని ఇతర రాబడులు | 7064(13) | 9683(15) | 7803(12) | 10720(13) | 11694(12) |
| | (iii) కేంద్ర పన్నులు, సుంకాల్లో రాష్ట్రం వాటా | 11184(21) | 11802(19) | 12141(10) | 15237(19) | 17751(19) |
| | (iv) భారత ప్రభుత్వం నుండి సహాయక గ్రాంట్లు | 7101(13) | 8015(13) | 9558(15) | 9900(12) | 10825(12) |
| 2. | వివిధ క్యాపిటల్ వసూళ్ళు | 6558(11) | --- | --- | --- | --- |
| 3. | ఋణాలు, అడ్వాన్సుల రికవరీ | 191 | 370(1) | 143(0) | 173(0) | 165(0) |
| 4. | రెవెన్యూ మరియు ఋణేతర క్యాపిటల్ వసూళ్ల మొత్తం (1+2+3) | 60892(85) | 63228(80) | 64821(77) | 81169(81) | 93719(83) |
| 5. | ప్రజాఋణం రాబడులు | 11132(15) | 15353(20) | 19753(23) | 18722(19) | 19450(17) |
| | అంతర్గత ఋణం (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్‌డ్రాఫ్ట్ మినహా) | 10223(92) | 14956(97) | 18185(92) | 16260(87) | 16731(86) |
| | వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్ట్‌ల కింద నికర లావాదేవీలు | --- | --- | --- | 218(1) | --- |
| | భారత ప్రభుత్వం నుండి లోన్లు, అడ్వాన్సులు | 909(8) | 397(3) | 1568(8) | 2244(12) | 2719(14) |
| 6. | సంచిత నిధిలోనికి మొత్తం రాబడులు (4+5) | 72024(54) | 78581(52) | 84574(54) | 99891(57) | 113169(57) |
| 7. | ఆకస్మిక ఖర్చుల నిధి రాబడులు | --- | 1 | 7(0) | --- | 2(0) |
| 8. | ప్రజా పద్దు రాబడులు | 61380(46) | 72503(48) | 71780(46) | 76218(42) | 86051(43) |
| 9. | ప్రభుత్వపు మొత్తం రాబడులు (6+7+8) | 133404 | 151085 | 156361 | 176109 | 199222 |
| భాగం - బి : ఖర్చు/చెల్లింపులు | | | | | | |
| 10. | రెవెన్యూ వ్యయం | 53984(77) | 61854(82) | 63448(80) | 78534(84) | 90415(83) |
| | ప్రణాళిక | 13901(26) | 18993(31) | 15442(24) | 19701(25) | 23664(26) |
| | ప్రణాళికేతర | 40083(72) | 42861(69) | 48006(76) | 58833(75) | 66751(74) |
| | సాధారణ సేవలు (వడ్డీ చెల్లింపులతో సహా) | 18170(34) | 18730(30) | 21392(34) | 26708(34) | 29874(33) |
| | సాంఘిక సేవలు | 18660(35) | 25004(40) | 25757(41) | 32314(41) | 38017(42) |
| | ఆర్థిక సేవలు | 16904(31) | 17807(29) | 16213(25) | 19346(25) | 22309(25) |
| | సహాయక గ్రాంటులు, విరాళాలు | 249 | 313(1) | 86(0) | 166(0) | 215(0) |

| | | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|---|
| 11. | **క్యాపిటల్ వ్యయం** | **12774(18)** | **10367(14)** | **13793(17)** | **11123(12)** | **13722(13)** |
| | ప్రణాళిక | 12866(100) | 10611(102) | 13955(101) | 11120(100) | 13687(100) |
| | ప్రణాళికేతర | (-)9 | (-)244(-2) | (-)162(-1) | 3(0) | 35(0) |
| | సాధారణ సేవలు | 36 | 59 | 92(1) | 108(1) | 83(1) |
| | సామాజిక సేవలు | 284 | 324 | 639(4) | 609(5) | 830(6) |
| | ఆర్థిక సేవలు | 12454(98) | 9984 | 13062(95) | 10406(94) | 12809(93) |
| 12. | **లోన్లు, అడ్వాన్సుల చెల్లింపు** | **2920(4)** | **3414** | **1590(2)** | **3315(4)** | **4983(6)** |
| 13. | **మొత్తం (10+11+12)** | **69678(93)** | **75635** | **78831(93)** | **92972** | **109120(94)** |
| 14. | **ప్రజాఋణం తిరిగి చెల్లింపు** | **4993** | **4833** | **6277(7)** | **7881** | **6761(6)** |
| | అంతర్గత ఋణం (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్టులు మినహా) | 4041 | 4045 | 4782(76) | 6160(77) | 5813(86) |
| | వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్టుల కింద నికర లావాదేవీలు | --- | --- | --- | 218(3) | --- |
| | భారత ప్రభుత్వం నుండి లోన్లు, అడ్వాన్సులు | 952 | 788 | 1495(24) | 1557(20) | 948(14) |
| 15. | **ఆకస్మిక ఖర్చుల నిధికి వినియోగార్థం** | **---** | **---** | **---** | **---** | **---** |
| 16. | **సంచిత నిధి నుండి మొత్తం చెల్లింపులు (13+14+15)** | **74671** | **80468** | **85108(55)** | **100853** | **115881(79)** |
| 17. | **ఆకస్మిక నిధినుండి చెల్లింపులు** | **1** | **7** | **X** | **2** | **---** |
| 18. | **ప్రజా పద్దు నుండి చెల్లింపులు** | **55126** | **74149** | **70243(45)** | **72407** | **82848(42)** |
| 19. | **రాష్ట్ర ప్రభుత్వపు మొత్తం చెల్లింపులు (16+17+18)** | **129798** | **154624** | **155351** | **173262** | **198729** |
| *భాగం - సి : లోట్లు* | | | | | | |
| 20. | **రెవెన్యూ లోటు (-)/మిగులు (+) (1-10)** | 159 | 1004 | 1230 | 2462 | 3138 |
| 21. | **ద్రవ్యలోటు (-)/మిగులు (+) (4-13)** | -8786 | -12407 | -14010 | -11803 | -15401 |
| 22. | **ప్రాథమికలోటు (-)/మిగులు (+) (21-23)** | -1197 | -4350 | -5096 | -2128 | -4840 |
| *భాగం - డి : ఇతర సమాచారం* | | | | | | |
| 23 | **వడ్డీ చెల్లింపులు (రెవెన్యూ వ్యయంలో చేరిఉన్నవి)** | **7589** | **8057** | **8914** | **9675** | **10561** |
